# లోకానికి నేనే వెలుగు



## దివ్యసత్ప్రసాదం:
## దైవ ప్రజల జీవిత సంపూర్ణ సత్యం

సంపుటి : 46 జూలై - సెప్టెంబర్ 2023 సంచిక : 3

భక్త యోహాను ప్రాంతీయ గురువిద్యాలయం, హైదరాబాదు

## ప్రచురణ

భక్త యోహాను ప్రాంతీయ గురువిద్యాలయ ప్రచురణలు
రామాంతపురం, హైదరాబాదు.

### సంపాదక వర్గం :

ఫాదర్ పిల్లి అంతోని దాస్
ఫాదర్ కుర్మ తోమస్
ఫాదర్ సగినాల ప్రకాష్
ఫాదర్ దొడ్డ రాజా

### గురు విద్యార్థుల బృందం :

బ్రదర్ బాపనపాటి అలెక్స్
బ్రదర్ కండి కిషోర్
బ్రదర్ కోడిగంటి శౌరి నిఖిల్ తేజ
బ్రదర్ చాట్ల అలెగ్జాండర్
బ్రదర్ నెకూరి జాయ్ చందు
బ్రదర్ పెండేల ఉమేష్ చంద్ర
బ్రదర్ వంపుగుళ్ళ ప్రదీప్‌కుమార్
బ్రదర్ పచ్చిగొర్ల ఒబేజ్
బ్రదర్ పగుర్ల భానుప్రసాద్
బ్రదర్ పెంటారెడ్డి బాల సంజయ్
బ్రదర్ బడిపాటి జాకబ్
బ్రదర్ అలజంగి దీపక్
బ్రదర్ బొమ్ము ఫ్రాన్సిస్
బ్రదర్ సనాపతి ఆనంద్

## చందా వివరములు

సంవత్సరానికి మీ చందాను రూ॥ 100/- యం.ఓ., డి.డి.ల ద్వారా
**St. John's Regional Seminary Society, Hyderabad**
పేరున పంపించి మమ్మల్ని ప్రోత్సహించమనవి. అన్ని సంప్రదింపులకు
మరియు మీ విరాళము పంపవలసిన అడ్రస్:

**St. John's Regional Seminary**
Ramanthapur, Hyderabad - 500 013.
Ph: 91-040-29561761, 29561762
e-mail: stjohnshyd2@gmail.com

# లోకానికి నేనే వెలుగు

సంపుటి : 46 జూలై-సెప్టెంబర్ 2023 సంచిక : 3

## దివ్యసత్ప్రసాదం :
## దైవ ప్రజల జీవిత సంపూర్ణ సత్యం

**ఫాదర్ పిల్లి అంతోని దాస్**

ప్రధాన సంపాదకులు

మరియు

సంచిక సంపాదకులు

భక్త యోహాను ప్రచురణలు, భక్త యోహాను ప్రాంతీయ గురువిద్యాలయం

రామాంతపురం, హైదరాబాదు-500 013.

ఫోన్ : 91-040-29561761, 29561762

E-mail : stjohnshyd2@gmail.com
Website : stjohnseminaryhyd.org

# విషయసూచిక

సంపాదకీయం.......................................................05

1. దివ్యసత్ర్పసాదం - శ్రీసభ జీవనం ప్రేషిత కార్య ప్రారంభం పరిపూర్ణం

*- ఫాదర్ పిల్లి అంతోని దాస్*......................................08


2. దివ్యసత్ర్పసాదం - ప్రొటెస్టెంటు సంస్కర్తల వివాదం - కతోలిక శ్రీసభ విశ్వాస నినాదం

*- బ్రదర్ గాలి మనోహర్*......................................... 34

3. దివ్యబలిపూజ - మానవుల రక్షణార్థమై స్వీయ సమర్పణతో క్రీస్తు బలి

*- బ్రదర్ బాపనపాటి అలెక్స్*..................................... 72

# సంపాదకీయం



దివ్యసత్ప్రసాదము క్రైస్తవ విశ్వాస జీవితానికి ఒక ప్రారంభము ఒక పరిపూర్ణము. అనగా క్రైస్తవ జీవితము దివ్యసత్ప్రసాదముతో మొదలవుతుంది, దివ్యసత్ప్రసాదముతోనే ముగుస్తుంది. ఈ సత్యమునే ద్వితీయ వాటికను మహాసభ సంక్షిప్తంగా ప్రబోధిస్తుంది: "దివ్యసత్ప్రసాదము, క్రైస్తవ జీవితానికి ఒక ఆధారం మరియు ఒక పరిపూర్ణము" (లూమెన్ జెన్షియుం, నెం. 11).

కతోలిక శ్రీసభ దివ్యసత్ప్రసాదమును, అనగా దివ్యబలిపూజను క్రైస్తవ జీవితానికి ఒక పునాదిగా ఒక పరిపూర్ణతగా ప్రకటిస్తుంది (కతోలిక శ్రీసభ సత్యోపదేశం 1324). అది ఒక పునాది అది ఒక ఆధారం: ఎందుకన, యేసుక్రీస్తు సిలువ రక్షణ బలిని మనకు నూతనంగా ప్రత్యక్ష పరుస్తుంది (కతోలిక శ్రీసభ సత్యపదేశం 1362-68). అది ఒక పరిపూర్ణత, ఒక అంతిమము: ఎందుకన, క్రీస్తు శరీర రక్తాలను మనకు అందించడం ద్వారా పరలోకమునే చవిచూచే భాగ్యాన్ని మనకు అందిస్తుంది.

దివ్యసత్ప్రసాదము మనము స్వీకరించు ఒక బలి. పాత నిబంధనలో ఇశ్రాయేలు ప్రజలు ఏ విధంగా పాస్కా గొర్రెపిల్ల మాంసమును భుజించారో, మనము కూడా దివ్యసత్ప్రసాదములో క్రీస్తు శరీరమును భుజిస్తున్నాము. అయితే నూతన నిబంధనలో ఈ పాస్కా మరింత ఉన్నతమైన ఆహారము. ఎందుకన,

ఈ పాస్కాలో ఒకే ఒక గొర్రెపిల్ల, లోక పాపములను పరిహరించు దేవుని గొర్రెపిల్ల (యోహాను 1:29) ఉంటుంది. అంతేకాదు, యేసు శరీర రక్తములను స్వీకరించటం వలన మనకు నిత్యజీవితం లభిస్తుంది (యోహాను 6:52-59). అందుకొరకే, దివ్యసత్ప్రసాదము ఒక విశిష్టమైన శ్రేష్టమైన పరలోక ఆహారము. యేసు ఏకైక బలిని దివ్య సంస్కార రూపంలో ప్రతి దినము దివ్యబలిపూజ ద్వారా ప్రత్యక్ష పరచబడుతుంది, సమర్పించబడుతుంది. అది మెల్కిసెదేకుని క్రమము ప్రకారము అప్ప ద్రాక్షరూపాలలో నిర్వహింపబడుతుంది (ఆది 4:18-20; హెబ్రీ 5:7-10; మత్తయి 26:26-29; లూకా 22:19-20; కతోలిక శ్రీసభ సత్యపదేశం 1333, 1355, 1544). ఈ శ్రేష్టమైన మహోన్నతమైన దివ్యసత్ప్రసాదము గురించి లోతైన అధ్యయనం చేయడం అత్యవసరం. అందుకొరకే ''నేనే లోకమునకు వెలుగు'' అను ఈ సంచికలో "దివ్యసత్ప్రసాదము: దైవ ప్రజల జీవిత సంపూర్ణ సత్యం" అను ఒక వేదాంత సమగ్ర అధ్యయనమును పొందుపరచుచున్నాము.

"దివ్యసత్ప్రసాదం: శ్రీసభ జీవనం ప్రేషిత కార్య ప్రారంభం పరిపూర్ణం". ఇది మొదటి వ్యాసం. పదునకొండవ సాధారణ సమావేశమైన మేత్రానుల సభ, 25 ఫిబ్రవరి 2004న "దివ్యసత్ప్రసాదము: శ్రీసభ జీవనమునకు సువార్త పరిచర్యకు ఒక ప్రారంభము ఒక పరిపూర్ణము" అను ఒక పత్రమును మనకు అందించింది. ఈ పత్రము యొక్క సారాంశమును విపులీకరిచడం జరిగింది.

"దివ్యసత్ప్రసాదం: ప్రొటెస్టెంట్ సంస్కర్తల వివాదం - కతోలిక శ్రీసభ నినాదం". ఇది రెండవ వ్యాసం. ఈ వ్యాసంలో, మధ్యయుగంలో శ్రీసభ ప్రొటెస్టెంట్ సహోదరుల సంస్కరణల ఉద్యమాలను ఎదుర్కొని, దివ్య సత్ప్రసాదము ఎడల కతోలిక వేదాంత సిద్ధాంతములను బాహటంగా ప్రకటించింది. దివ్యసత్ప్రసాదము యొక్క విశిష్టతను, ఔన్నత్యమును, క్రైస్తవ జీవితములో దాని ప్రభావమును, అన్నిటికీ మించి క్రీస్తు కడరా భోజన సమయంలో స్థాపించిన దివ్యసంస్కార శక్తిని గురించి చక్కగా వివరిస్తుంది.

"దివ్యబలిపూజ: మానవుల రక్షణార్థమై స్వీయ సమర్పణతో క్రీస్తు బలి". ఇది మూడవ వ్యాసము. దివ్య బలి పూజ వాస్తవం వాస్తవముగా రెండు లక్షణాలను కలిగి ఉంది: అది ఒక దివ్య సంస్కారము (Sacrament) మరియు ఒక బలి (Sacrifice). దివ్య బలి పూజ, కడరా భోజన సంస్కారమునే కాక, క్రీస్తు సిలువ బలిని ప్రత్యక్ష పరుస్తూ, ఆ రక్షణ ఫలములను విశ్వాసులకు అందిస్తుంది.

ఇందులోని వ్యాసములను అందించిన వారు: మొదటి వ్యాసం – ఫాదర్ పిల్లి అంతోని దాస్, రెండవ వ్యాసం – డీకను గాలి మనోహర్, మూడవ వ్యాసం – డీకను బాపనపాటి అలెక్స్. వీరికి నా కృతజ్ఞతలు. ఈ సంచికను రూపొందించడానికి సహకరించిన జీవన్ ప్రింటింగ్ ప్రెస్ యాజమాన్యానికి నా కృతజ్ఞతలు. ఈ భక్తయోహాను ప్రచురణల ద్వారా అనేక మంది విశ్వాసులు దైవ జ్ఞానమును, శ్రీసభ విధానముల విషయమును పొందగలరని ఆశిస్తున్నాను. పాఠకులందరికీ నా శుభాకాంక్షలు.

ప్రేమతో ప్రార్థనతో


**ఫాదర్ పిల్లి అంతోని దాస్**

సంచిక సంపాదకులు

# 1. దివ్యసత్ప్రసాదం - శ్రీసభ జీవనం ప్రేషిత కార్య ప్రారంభం పరిపూర్ణం

**- ఫాదర్ పిల్లి అంతోని దాస్**

## పరిచయ పలుకులు



పదునకొండవ సాధారణ సమావేశమైన మేత్రానుల సభ, 25 ఫిబ్రవరి 2004న "దివ్యసత్ప్రసాదము: శ్రీసభ జీవనమునకు సువార్త పరిచర్యకు ఒక ప్రారంభము ఒక పరిపూర్ణము" అను ఒక పత్రమును మనకు అందించింది. ఇందులో మొదటి అధ్యాయముగా, దివ్యసత్ప్రసాదమును ఒక నూతన నిత్య నిబంధన దివ్య సంస్కారముగా మరొకసారి చాటి చెబుతోంది. రెండవ అధ్యాయముగా, దివ్యసత్ప్రసాదము శ్రీసభకు ఒక బహుమానమని, దానిని ఎల్లప్పుడూ అన్వేషిస్తూ ఉండాలని బోధిస్తుంది. మూడవ అధ్యాయముగా, దివ్యసత్ప్రసాదము ప్రకటించవలసిన ఒక విశ్వాస రహస్యము అని తెలియజేస్తుంది. నాలుగవ అధ్యాయముగా, దివ్యసత్ప్రసాదము యొక్క దైవార్చన క్రమము గురించి విపులీకరిస్తుంది. ఐదవ అధ్యాయముగా, దివ్యసత్ప్రసాద పరమ రహస్యము నూతన సువార్తీకరణకు ఎంతగానో దోహదపడుతుందని చాటుతుంది. ఆరవ అధ్యాయంలో, దివ్యసత్ప్రసాదము ఆరాధింపవలసిన ఒక వరము అనియు, ఏడవ అధ్యాయములో దివ్య సత్ప్రసాదము ప్రేషిత కార్య అనుగ్రహము అనియు వివరిస్తుంది. ఈ విధంగా మేత్రానుల సభ దివ్య సత్ప్రసాదము యొక్క తత్వమును, ఉనికిని, ప్రభావమును, ప్రయోజనం గురించి గొప్పగా సంగ్రహిస్తుంది. ఇందులోని నిగూఢమైన అంశాలను అధ్యయనం చేస్తూ దివ్య సత్ప్రసాద క్రైస్తవులుగా మనం రూపాంతరం చెందాలని నా ఆలోచన. అందుకొరకే ఈ పత్రికను ఒక సమగ్రమైన సంగ్రహ రూపంలో ఇక్కడ పొందుపరచడానికి ప్రయత్నం చేస్తున్నాను.

అదృశ్యుడైన దేవుడు తన కుమారుడైన శరీరధారియైన వాక్కు, యేసుక్రీస్తు నందు తనను తాను ప్రత్యక్ష పరచుకున్నాడు. మోక్షరోహణం తర్వాత, అంతవరకు మన కంటికి గోచరమైన మన రక్షకుడు ఇక దివ్య సంస్కార సాన్నిధ్యం సంతరించుకున్నాడు. అందుకొరకే మనము ఒకదానిని చూస్తున్నాము, మరొక దానిని గ్రహిస్తున్నాము: అనగా, మానవుడైన యేసును చూస్తున్నాము, దేవుని యందు విశ్వాసమును ప్రదర్శిస్తున్నాము.

శ్రీసభ యేసుక్రీస్తులో మానవాళికి ఒక రక్షణ దివ్య సంస్కారం. తండ్రి దివ్య సంస్కారమైన మనుష్యవతార వాక్కును ఆరాధిస్తూ శ్రీసభ జీవిస్తుంది. శాశ్వత వాక్కు మానవునితో మాట్లాడుతూ ఉండగా, మానవ వాక్కు ఒక ఆరాధనగా, ఒక త్యాగబలిగా, ఒక కృతజ్ఞతార్చనగా (Eucharist) మారుతుంది. దీనినే ఆధ్యాత్మిక ఆరాధన (రోమీ 12:1) అని అంటాము. దివ్యసత్ప్రసాదములో దైవ ప్రజలు ఇటువంటి పరిశుద్ధ ఆరాధనలో పాలుపంచుకుంటూ, సత్ప్రసాదమును స్వీకరించుటలో పరిపూర్ణ దశను చేరుకుంటారు.

ద్వితీయ వాటికను మహాసభ ఈ దివ్యసత్ప్రసాద పరమ రహస్యమును గూర్చి తన అధికార పత్రమైన పవిత్ర దైవార్చన మూడవ అధ్యాయములో నిర్దిష్టంగా చర్చిస్తుంది. ఈ పత్రము దివ్యసత్ప్రసాదమును శ్రీసభ పరిచర్య యొక్క ప్రారంభముగా మరియు పరిపూర్ణంగా (Source and Summit) అభివర్ణిస్తుంది. దివ్యసత్ప్రసాదము క్రైస్తవ విశ్వాస జీవిత ప్రవేశమునకు మరియు అపోస్తలిక పరిచర్యకు ఒక పరిపూర్ణతను (Summit) అందిస్తుంది. ఎందుకంటే, ఇక్కడ విశ్వసించిన వారందరూ కూడా శ్రీసభ సభ్యత్వంలో పాలుపంచుకొని ఒక సంఘంగా జీవిస్తారు. అంతేకాదు సత్ప్రసాదము శ్రీసభ జీవితానికి, సువార్త పరిచర్యకు పోషణమును అందిస్తూ అది ఒక ప్రారంభము, లేదా పునాది (Source)గా ఉంటుంది. దీని కారణంగానే, జాన్ పాల్ పాపుగారు తన అధికార పత్రమైన "దివ్యసత్ప్రసాద శ్రీసభ" (Ecclesia de Eucharistia)లో క్రీస్తును తెలుసుకొని, ప్రేమించి, అనుకరించి, దివ్యసత్ప్రసాద నిర్వహణ ద్వారా ఒక నూతన కణముగా మారాలని బోధిస్తున్నాడు.

దివ్యసత్ప్రసాదము: శ్రీసభ జీవితానికి, సువార్త పరిచర్యకు ఒక ప్రారంభం ఒక పరిపూర్ణం అను అంశము ద్వారా రెండవ జాన్ పాల్ పాపు గారు మూడు విషయాలను మన ముందు ఉంచుతున్నాడు:

మొదటిది: దైవ కుమారుడైన క్రీస్తు, కడరా భోజన సమయంలో తన క్రియల ద్వారా, ప్రత్యేక విధంగా దీనిని నా జ్ఞాపకార్థము చేయుడు అను మాటల ద్వారా కేవలము ఒక భోజనమును మాత్రమే స్థాపించలేదు, ఒక దైవార్చనను స్థాపించాడు. ఈ దైవార్చన ద్వారా ఆత్మతో సత్యముతో తండ్రిని ఆరాధించాలని సంకల్పించాడు

రెండవది: ఈ దైవార్చన విధానము కతోలిక శ్రీసభ వారసత్వమును వినాశనం చేయడం లేదు, పైగా కతోలిక సాంప్రదాయమునకు విశ్వసనీయంగా ఉంటూ, క్రైస్తవుల పవిత్రీకరణ నిమిత్తమై దానిని ధ్రువీకరిస్తుంది, దృఢపరుస్తుంది

మూడవది: ప్రభువు తన నిజమైన సన్నిధిని ఈ పరిశుద్ధ సంస్కారములో దాచి ఉంచాలని ఆశించాడు. దీని మూలముగా ఇమ్మానుయేలు దేవుడు, రక్షకుడు ప్రభువు అయిన దేవుడు, మానవాళికి నేడునూ నిరంతరమును అతి సమీపముగా ఉంటాడు.

తన శాశ్వత సన్నిధిని ఈ లోకములో స్థిరపరచడానికి మన రక్షకుడు కడరా రాత్రి భోజన సమయంలో, తన శరీర రక్తముల దివ్యసత్ప్రసాద బలిని స్థాపించాడు. దీని ద్వారా, ఆయన మరల వచ్చు వరకు యుగయుగాలుగా తన సిలువ బలిని ఈ దివ్యసత్ప్రసాద బలిద్వారా నిరంతరము కొనసాగించాలని ఆయన ఉద్దేశం. శ్రీసభ ఆయన ప్రియమైన పత్నిగా, యేసుక్రీస్తు మరణ పునరుత్థాన జ్ఞాపకార్థమును ఒక జీవిత సంస్కారముగా, ఒక ఐక్యత చిహ్నంగా, ఒక ప్రేమ బంధంగా ఒక పాస్కా విందుగా కొనియాడుతూ మనకు ఒక అనుగ్రహమును, రానున్న మహిమకు ఒక అభయమును అందిస్తుంది.

ఈ దివ్యసత్ప్రసాద సంగ్రహమును సిద్ధపరచుటకు అనేక ఆధారాలను పరిశీలించడం జరిగింది. ద్వితీయ వాటికను మహాసభ అధికార పత్రమైన "పవిత్ర దైవార్చన", ఆరవ పౌలు పాపుగారి అధికార పత్రం "విశ్వాస రహస్యం మరియు రోమీయ పూజాక్రమ సాధారణ సూచనలు", "కతోలిక శ్రీసభ సత్యపదేశం", "శ్రీసభ చట్టం" మరియు రెండవ జాన్ పాల్ పాపుగారి "దివ్య సత్ప్రసాద శ్రీసభ" అను పత్రములు ప్రముఖమైనవి.

## మొదటి అధ్యాయము:

## దివ్యసత్ప్రసాదము – నూతన నిత్య నిబంధన యొక్క దివ్య సంస్కారము

ఈ అధ్యాయములో మనము పలు అంశాల గురించి తెలుసుకుంటాము: రక్షణ చరిత్రలో దివ్యసత్ప్రసాదము, యేసుక్రీస్తు ఏకైక బలి మరియు ఆయన గురుత్వం, తండ్రికి కృతజ్ఞత మరియు స్తోత్రము, పాస్కా పరమ రహస్య జ్ఞాపకార్థము, ప్రభువుని ఐక్యత సన్నిధి.

### 1.1. రక్షణ చరిత్రలో దివ్యసత్ప్రసాదము

పాత నిబంధనలో దేవునికి కృతజ్ఞతగా, వినతులుగా, పాప పరిహారముగా కానుకలను మరియు బలులను సమర్పించేవారు. ఇవన్నీ కూడా యేసుక్రీస్తు కడరా భోజన బలిస్థాపనకు ఒక సంసిద్ధ పాటుగా ఉండేవి. యెహోవా సేవకుడు తనను తాను బలిగా సమర్పించుకొని, నూతన నిబంధన నిమిత్తమై మానవాళి స్థానములో, మానవాళి శ్రేయస్సు కొరకు తన రక్తమును ధారవోయివాడు అని ఆనాడే ప్రవచింపబడింది (యెషయా 42:1–9; 49:8). యూదుల మత వేడుకలు, ముఖ్యముగా నిర్గమకాండములోని పాస్కా జ్ఞాపకార్థము మరియు గొర్రె పిల్ల బలివిందు, దేవుని అనుగ్రహమునకు కృతజ్ఞత చెల్లించుటకు మరియు అర్పింపబడిన బలి ద్వారా ఆయనతో ఏకము కావడానికి ఇవి దోహదపడేవి (1 కొరింతీ 10:18–21). దివ్యసత్ప్రసాదము కూడా వ్యక్తిని యేసుక్రీస్తు బలితో ఐక్యపరుస్తుంది. యూదుల ఆరాధన, సాంప్రదాయం ప్రకారం, ఈ కృతజ్ఞత రెండు విధాల ప్రయోజనమును కలిగి ఉంది: దైవ జీవనమును మానవునికి అందించడం మరియు దేవుని ఘన కార్యములను మానవుడు అంగీకరించి ఆయనను ఆరాధించడం. ఇటువంటి కృతజ్ఞతను దేవాలయపు బలులలో గాని లేదా గృహములోని భోజనములో గాని నిర్వహిస్తారు (ఆది 1:28;9:1;12:2–3; లూకా 1:69–79). ఈ కృతజ్ఞత బలిని ఒకసారి “దైవ స్తుతి” (Eulogia) అనియు, మరొకసారి “దివ్యసత్ప్రసాదం” (Eucharistia) అనియు అంటారు. క్రైస్తవత్వంలో ఈ రెండవ పదమైన దివ్యసత్ప్రసాదం గొప్ప స్థాయిని సంతరించుకుని ఉంది.

క్రీస్తు కాలంలో కూడా యూదులు పవిత్ర భోజనమును, బలివిందును (కీర్తన 22;51) జరుపుకునేవారు. ఇందులో ముఖ్యంగా దేవునికి కృతజ్ఞత చెల్లించడము, రొట్టె ద్రాక్ష రసములను ఒక రక్తరహిత బలిగా సమర్పించడం జరిగేది. దీని ద్వారా, కడరా భోజనము కూడా ఒక కృతజ్ఞత బలివిందు అని గ్రహింపగలము. పాత నిబంధన రక్తహిత బలి దేవుడు తన ప్రజలతో చేసుకున్న ఒడంబడికను గుర్తుచేస్తుంది (ఆది 24:1-11). ఇటువంటి ఒక బలి సమర్పణను ప్రవక్తలు ఏనాడో ప్రవచించారు (యెషయా 55:1-5; యిర్మియ 31:31-34; యెహెజ్కి 36:22-28). దీని ద్వారా మనకు ఒక విషయము బోధపడుతుంది: నూతన నిబంధనలో కడరా భోజనం మరియు క్రీస్తు పరిపూర్ణ ప్రత్యక్షత ఈ నిబంధన గురించి సాక్ష్యమిస్తున్నాయి.

పాత నిబంధన సంజలు మరియు జ్ఞాపకార్థ బలులు, అనగా ఐగుప్తు దేశంలో భోజనం, ఎడారిలో మన్న అనుగ్రహం, పాస్కా పండుగ వార్షిక వేడుకలు, శ్రీసభ దివ్య సంస్కారాలలో లేదా పవిత్ర రహస్యాలలో నెరవేరుతున్నాయి. ఈ బలులలో, ప్రభుని మరణ పునరుత్థాన ఫలితముగా, దేవుని వరములైన పవిత్రీకరణ శక్తి, రూపాంతర భాగ్యము, దివ్యత్వ వరము కనిపిస్తాయి. వానిని ప్రతి ఆదివారం, అంతేకాదు ప్రతిరోజు కూడా, క్రైస్తవ పాస్కా విందులో కొనియాడుతున్నాము.

## 1.2. యేసుక్రీస్తు ఏకైక బలి మరియు గురుత్వం

కడరా భోజన చారిత్రక వాస్తవికత నూతన నిబంధనలో ప్రస్తావించబడింది (మత్తయి 26:26-28; మార్కు 14:22-23; లూకా 22:19-20; 1 కొరింతీ 11:23-25). యేసుక్రీస్తు మానవాళికి ఒక ఆహారముగా తనను తాను సమర్పించుకుంటున్నాడు (యోహాను 23:1): మనకై తన శరీరమును ఇస్తున్నాడు, తన రక్తమును ధారవోస్తున్నాడు. ఇది ఒక నూతన నిబంధన, ఎందుకంటే ఇది దేవునికి మానవునికి మధ్య ఒక నూతన సంబంధమును నిర్మిస్తుంది (హెబ్రీ 9:12). అంతకుమించి, ఇది ఒక నూతన నిబంధన మరియు పాత నిబంధనను దాటిపోతుంది, ఎందుకన కుమారుడు సిలువ మీద తన్ను తాను అర్పించుకుంటున్నాడు. తనను స్వీకరించు వారికి ఆయన, తండ్రి బిడ్డలుగా రూపాంతరం చెందు శక్తిని అనుగ్రహిస్తున్నాడు (యోహాను 1:12;

గలతీ 3:26). “దీనిని నా జ్ఞాపకార్థము చేయుడు” అను ఆజ్ఞ, ప్రభువు కార్యమును ఆయన మరలా వచ్చు వరకు విశ్వసనీయంగా కొనసాగించాలని తెలియజేస్తుంది (1 కొరింతీ 11:26).

ఈ జ్ఞాపకార్థ బలిద్వారా దేవునికి మానవుడికి మధ్య నశించిపోని ఒక స్నేహబంధము ఉందని, అది కూడా తనను తాను సమర్పించుకోవడం ద్వారా సాతాను జయించిన క్రీస్తు ప్రేమకు సంకేతమని, శ్రీసభ ప్రపంచానికి గుర్తుచేస్తుంది. అనగా, దివ్యసత్ప్రసాదం మానవజాతి సమైక్యతకు, ఆ సమైక్యత స్థలమునకు ఒక ఆధారంగా నిలుస్తుంది. ఈ కడరా భోజన నూతన లక్షణం మరియు పరమార్థం, ప్రభువు సిలువ ఉత్థానముల ద్వారా సాధించిన రక్షణకు ప్రత్యక్షంగా ముడివడి ఉంది. ఈ విధంగా, క్రీస్తు తన పాస్కా విందును చేసుకొని తన సమర్పించుకొనుటలో మనకు ఒక పాస్కాగా మారుతున్నాడు (1 కొరింతీ 5:7). అనగా, కడరా భోజన సమయంలోనే సిలువ ప్రారంభమైంది. కడరా భోజన రక్తరహిత బలిలో, సిలువ మీద రక్తహిత బలిలో యేసుక్రీస్తు ఏకకాలంలో ఒక గురువుగా, ఒక బలి వస్తువుగా, తన తండ్రికి అర్పించుకుంటున్నాడు: సిలువ మరణం వరకు విధేయత చూపించడం ద్వారా తన కుమారుడు అర్పించిన బలిని తండ్రి అంగీకరిస్తున్నాడు. ఈ కారణముననే క్రీస్తు మరణమును అతని ఉత్థానము నుండి వేరు చేయలేము, అది బాప్తిస్మ మునక ద్వారా నూతన జీవితాన్ని ప్రసాదిస్తుంది.

యోహాను సువార్త ఆరవ అధ్యాయములో దివ్యసత్ప్రసాద పరమ రహస్యము గురించి ముందుగానే ప్రస్తావించబడింది. కడరా భోజనమునకు ఇది ఒక ముందస్తు ప్రణాళికగా కనిపిస్తుంది. ఐదువేల మందికి ఆహారమును పంచు సందర్భంలో యేసు జీవమనిచ్చు రొట్టె గురించి, అనగా నిజ ఆహారము నిజపానమైన తన శరీరము రక్తముల గురించి మాట్లాడుతున్నాడు. తన యందు విశ్వాసముంచి, తన శరీరంలో భుజించువాడు నిత్య జీవితమును పొందును. కేవలము క్రీస్తును వెదకు వారికి మాత్రమే ఈ దివ్యసత్ప్రసాద బోధన అర్థమవుతుంది. పెంతకోస్తు పండుగ తర్వాత, ఈ అవగాహన స్పష్టంగా కనిపిస్తుంది. ప్రత్యేకంగా బాప్తిస్మము పొందిన వారందరూ అపోస్తలుల బోధన యందును, సహవాసమందును రొట్టె విరుచుటయందును సమావేశం కావడం

ద్వారా ఈ దివ్యసత్ప్రసాద రహస్యము అర్థం అవుతుంది. అనగా ఈ దివ్యసత్ప్రసాదమునకు అపోస్తలుల పునాది ప్రధానమని బోధపడుతుంది. ప్రభు భోజనమును ఇతర భోజనములతో పోల్చడము ఒక గొప్ప తప్పుగా, ఒక ఖండనగా భావించగలము. ఎందుకంటే, నూతన నిబంధన సత్ప్రసాద ప్రస్తావనలు ఒక కృతజ్ఞతా బలిగా, ఒక దివ్య సంస్కార జ్ఞాపకార్థముగా, ప్రతిష్ఠింపబడిన రొట్టె ద్రాక్ష రసముల రూపాంతరము ద్వారా ప్రభుని శరీరము రక్తములుగా ఆయన సన్నిధి మనకు ప్రత్యక్షమవుతుంది. దివ్యసత్ప్రసాదములో క్రీస్తు శరీర రక్తముల సన్నిధి, దానిని స్వీకరించు విశ్వాసుల పరిస్థితులపై ఆధారపడి ఉండదు. ఒకే శరీరమును స్వీకరించడం ద్వారా, విశ్వాసులు క్రీస్తు జీవమును పొంది ఒకే శరీరంగా మారి, ఏక హృదయముతో ఏక మనసుతో జీవించగలరు. ఈ దివ్య సత్ప్రసాద స్వీకరణ ద్వారా విశ్వాసులు ఒక అపోస్తలిక శ్రీసభగా ఏర్పడి, పరస్పరము ఆనందము శ్రమలను పంచుకుంటూ, ప్రేమ బంధములో జీవించగలరు (1 కొరింతీ 12:26-27).

## 1.3. తండ్రికి కృతజ్ఞత మరియు స్తోత్రము

"ఇది నా శరీరము", "ఇది నా రక్తపు పాత్రము". ఇవి యేసు తన సన్నిధిని గురించి ప్రస్తావించిన పలుకులు. ఈ పలుకులే శ్రీసభలోని దివ్యసత్ప్రసాద సంస్కారానికి పునాదులు. ఈ పలుకుల ద్వారా యేసు తనను తాను ఒక నిజమైన, చివరిదైన బలిగా సమర్పించుకొని పాత నిబంధనలోని బలులను పరిపూర్తి చేశాడు, ఈ బలి ద్వారా సమస్త ఫలాలను యేసు ప్రపంచానికి అందించాడు.

యేసు అనేకమంది కొరకు శ్రమలు అనుభవించి, అంతవరకు వేచి ఉన్న నిజమైన బలి ఆరాధన తనలో సంపూర్ణం కావించుకుంటాడు అని ప్రవక్తలు ముందుగానే ప్రవచించారు (యెషయా 53:11 నుండి). యేసు దేవుని సముఖమున నిలుచుండి తన కొరకు కాక అందరి కొరకు విన్నపములు చేస్తాడు. ఈ విన్నపమే ఒక నిజమైన బలి, ఒక ప్రార్థన మరియు కృతజ్ఞత వేడుక. ఈ విన్నపము ద్వారా దేవుడు మనలను సమస్త ప్రపంచమును పునరుద్ధరిస్తాడు. కావున దివ్య సత్ప్రసాదం క్రీస్తులో దేవునికి ప్రేమ కానుకగా అందించబడిన ఒక బలి.

యేసుక్రీస్తు సజీవుడు, మహిమాన్వితుడు, తన రక్తము ద్వారా పరలోక పరిశుద్ధ స్థానములో ప్రవేశించినవాడు (హెబ్రీ 9:12). ఒక ప్రధాన యాజకునిగా (హెబ్రీ 8:1-2) ఈ శాశ్వతమైన, మార్పులేని స్థితిలో యేసు తన యాజకత్వమును శాశ్వతంగా కలిగి ఉన్నాడు, దానిని కొనసాగిస్తున్నాడు (హెబ్రీ 7:24). భూలోక జీవితం ద్వారా మానవాళి మరియు విశ్వ రక్షణకై తాను సంపాదించిన అమితమైన ఫలముల వలన యేసు తనను తాను సమర్పించుకున్నాడు, తన పనిని ఇంకా కొనసాగిస్తూ ఉన్నాడు. అనగా, ఈ శాశ్వత వారసత్వానికి ఒక నూతన నిబంధన ద్వారా పిలువబడిన వారందరికీ యేసుక్రీస్తు ఒక మధ్యవర్తిగా ఉంటున్నాడు (హెబ్రీ 9:15). ఒక శాశ్వత ప్రధాన యాజకునిగా ప్రభువు సమర్పించిన ఈ శాశ్వత బలిని కొనసాగించవలసినదిగా పవిత్రాత్మ శ్రీసభకు గుర్తుచేస్తుంది (యోహాను 14:26;16:12-15). పునీత యోహాను క్రిసోష్టము ఇలా పలుకుతాడు: వాస్తవానికి పవిత్ర దైవార్చనను అర్పించినది యేసుక్రీస్తు మాత్రమే, కడరా భోజన సమయంలో దివ్యసత్ప్రసాదమును నిర్వహించిన ఆయన, నేడు కూడా అదే అద్భుతమును నిర్వహిస్తున్నాడు. మనకు గురుత్వము ఉంది, కానీ బలి వస్తువులను పవిత్రీకరించువాడు వాటిలో రూపాంతరము కలిగించువాడు ఆయనే. అందుకొరకే ఈ బలి కేవలము ఒక చిహ్నాము, ఏదో ఒక రకమైన బలి కాదు, ఇది నిజమైన బలి.

ఒక పాప పరిహార బలి వస్తువుగా తన కుమారుని మరణమును దేవుడు స్వీకరిస్తున్నాడు. ఈ బలి లోక రక్షణకై సమర్పింపబడాలని శ్రీసభ ప్రార్థిస్తుంది. బలి మరియు దివ్య సంస్కారము రెండు ఒకటిగా, క్రీస్తు కడరా భోజన సమయంలో స్థాపించి, తన జ్ఞాపకార్థమై దీనిని ఒక స్తుతి యాగముగా, కృతజ్ఞతా బలిగా పశ్చాత్తాపము పాపపరిహారముగా సమర్పించాలని తన శిష్యులకు ఆజ్ఞాపించాడు. యేసుని త్యాగపూరిత బలిద్వారా, దివ్యబలిపూజలో సిలువ బలి సమర్పించబడుతుంది. అంతేకానీ దివ్యబలిపూజ క్రీస్తు సిలువ బలికి ఒక అంశాన్ని జోడించడం గాని, దాన్ని రెట్టింపు చేయడం గాని జరగడం లేదు. బలి మొదటి కార్యము. ఆ తర్వాతనే సిలువపై సమర్పింపబడిన ఆ గొర్రె పిల్లను ఒక భోజనముగా పొందుతున్నాము.

## 1.4. పాస్కా పరమ రహస్య జ్ఞాపకార్థం

"క్రీస్తు జ్ఞాపకార్థము" నిర్వహించడం అంటే అతని సంపూర్ణ జీవితాన్ని జ్ఞాపకం చేసుకోవడమే. ఈ రక్షణ పరమ రహస్యములు నేడు దివ్యబలి పూజా ద్వారా మనకు అందించబడుతున్నాయి. పునీత పౌలు గారి మాటలలో, దివ్యబలిపూజ ఒక జ్ఞాపకార్థం, యేసు తనను తాను రిక్తునిగా చేసుకొనిన ఒక సందర్భం, సిలువ మరణం వరకు ఆయన తండ్రికి చూపించిన ఒక ఉన్నతమైన ప్రేమ సమర్పణం. ఆయన శరీరమును భుజించినప్పుడల్లా, ఆయన రక్తమును పానము చేయునప్పుడల్లా, ఆయన మరల వచ్చు వరకు మనము ఆయన మరణమును (1 కొరింతీ 11:26) ఉత్థానమును (అ.కా 2:32-36; రోమీ 10:9; 1 కొరింతీ 12:3; ఫిలిప్పీ 2:9-11) ప్రకటిస్తున్నాము. కావున అతడు ఒక పాస్కా బలి గొర్రె పిల్ల (1 కొరింతీ 5:7-8).

కడరా భోజన సమయంలో దివ్యసత్ప్రసాదం స్థాపించడం జరిగింది. యేసు పలికిన మాటలు అతని మరణమును ముందస్తుగానే ప్రకటిస్తున్నాయి. ఈ పలుకులలో ఆయనను మరణము నుండి పునరుత్థానమునకు నడిపించు శక్తి కనిపిస్తుంది. అందుకొరకే క్రీస్తు మరణమును ఉత్థానమును రెండింటినీ కలిపి ఒక పాస్కా పరమ రహస్యముగా సంబోధిస్తుంది. దివ్యసత్ప్రసాదం కేవలము ఒక భోజనము మాత్రమే కాదు, అంతకంటే కూడా ఒక శాశ్వత బలి అని ఈ పాస్కా పరమ రహస్యం ద్వారా తెలుసుకునగలము. ఇది ఆయన మరణమును మరియు పునరుత్థానమును సూచిస్తుంది. క్రీస్తు ప్రక్కల నుండి (యోహాను 19:34) శ్రీసభ ఉద్భవించింది. ఇక్కడ నుండి శ్రీసభ నిర్మాణ పునాదులైన బాప్తిస్మము మరియు దివ్యసత్ప్రసాదము అను దివ్య సంస్కారములు జనిస్తున్నాయి. అందుకొరకే దివ్యసత్ప్రసాదములో మరణించిన క్రీస్తుని, ఉత్థానమై శాశ్వతంగా జీవించు క్రీస్తుని మనము ఆరాధిస్తున్నాము (దర్శన 1:18). మనము రోమియ పూజాక్రమంలోని కృతజ్ఞతా ప్రార్ధనలో చెబుతున్నాము: "ఓ తండ్రీ! మీ ప్రజలము మీ సేవకులమైన మేము నీ కుమారుని శ్రమలను, మరణం నుండి ఉత్థానమును, మహిమ లోనికి మోక్షరోహణమును జ్ఞప్తికి చేసుకొనుచున్నాము. నీవు మాకు ప్రసాదించిన

అనేక వరముల నుండి, జీవమొసగు ఈ ఆహారమును, ఈ రక్షణ పాత్రమును, ఈ పవిత్రమైన జీవన బలిని, మహోన్నతుడవు సర్వశక్తిమంతుడైన నీకు సమర్పించుచున్నాము.

ఈ పరమ రహస్యమైన కడరా భోజన సమయంలో క్రీస్తు, పాత నిబంధన గతమును, నూతన నిబంధన వర్తమానమును, రానున్న కాలంలో భవిష్య విషయాలను తనలో ఏకం చేసుకుంటున్నాడు. దివ్యసత్ప్రసాదం ద్వారా మానవ కొలమానములో ఉన్న కాలముగాక, మరొక ప్రమాణమును గ్రహిస్తున్నాము: గతము ద్వారా ప్రకాశింపబడిన భవిష్యత్తు ఎన్నటికీ మారని ఒక వర్తమానముగా మనము పొందుతున్నాము. అనగా, ఆల్ఫా ఒమేగా అయినటువంటి క్రీస్తు పరమ రహస్యం నేడు ప్రతి యుగములో ప్రతి కాలంలో ప్రతి వ్యక్తికి అందించబడుతుంది. అందుకొరకే, ఒకవైపు మృతుల పునరుత్థానమును విశ్వసిస్తూ వేచి ఉంటూనే, ఇప్పుడు పరలోక జీవితమును అనుభవిస్తున్నాము. అనగా, దివ్యసత్ప్రసాదము ద్వారా పరలోకమును ఈ భూలోకంలోనే చవిచూస్తున్నాము.

## 1.5. ప్రభువుని ఐక్యత సన్నిధి

దివ్య సంస్కారాలలో యేసు గోచరమగు సంజ్ఞల ద్వారా, వాటి బాహ్య రూపమును మార్చకుండా, మనలను పవిత్రీకరణ వైపు నడిపించే సామర్థ్యమును వాటికి ఇస్తున్నాడు. దివ్య సత్ప్రసాదములో యేసు తన శరీరముతో రక్తముతో, తన ఆత్మతో దైవత్వముతో, కొలువై ఉండి తనను తాను సమర్పించు కుంటున్నాడు, మనకు తన జీవాన్ని ఇస్తున్నాడు. పాత నిబంధనలో దైవ సన్నిధిని ప్రత్యక్ష పరచు కొన్ని సందర్భాలు సంజ్ఞలు మనకు కనిపిస్తున్నాయి: మేఘము, గుడారము, దేవాలయము. అయితే నూతన నిబంధనలో, కాలము సంపూర్ణమైనప్పుడు, ఇక బాహ్య సన్నిధిలో కాకుండా, మానవ రూపమును దాల్చిన శరీరధారియైన వాక్కులో ఆయన వస్తున్నాడు, ఇమ్మానుయేలు దేవునిగా మారుతున్నాడు, తన కుమారుని ద్వారా మనతో మాట్లాడుతున్నాడు.

దివ్య సంస్కారమును ఒక పవిత్ర భోజనంగా స్వీకరించుటలో ఏమి జరుగుతుందో పౌలు చక్కగా వర్ణిస్తున్నాడు: "ప్రభువుతో ఐక్యము చెందు వారు

ఆధ్యాత్మికంగా ఆయనతో ఒకటి అగును” (1 కొరింతీ 6:17). ఈ నూతన జీవితము పవిత్రాత్మ దేవుని నుండి లభిస్తుంది. పునీత అంతియోకు ఇన్యాసి వారు మరియు అనేక వేదాంత శాస్త్రజ్ఞులు కనుగొన్న ఈ పరమ రహస్యమును పునీత అగుస్తీను లోతుగా పరిశీలిస్తున్నాడు. ఈ దైవీక అర్చన క్రీస్తు సన్నిధి. సమస్త సృష్టిని ఒకటిగా చేస్తుంది. అది అందరినీ పరిశుద్ధ పీఠం చెంతకు చేరుస్తుంది. అది అందరిని క్రీస్తుతో మరియు ఒకరిని మరొకరితో ఐక్యపరుస్తుంది. పునీత యోహాను క్రిసోస్టము ఇలా అంటాడు: పవిత్ర బల్లను మనము చేరినప్పుడు సృష్టికి రారాజు అక్కడ ఉన్నాడని విశ్వసించాలి. ఈ కారణముననే, దివ్య సత్ప్రసాద స్వీకరణ మరియు ఆరాధన విడదీయలేని ఒక కార్యముగా ఉంటాయి.

దివ్యసత్ప్రసాదములో క్రీస్తు సన్నిధి నిజముగా ఒక మహోన్నత రహస్యం. ఈ పరమ రహస్యమును సంబోధించడానికి ట్రెంటు మహాసభ వినియోగించిన పదమునే ద్వితీయ వాటికను మహాసభ కూడా వినియోగిస్తుంది: పదార్ధతత్వ రూపాంతర ప్రక్రియ (transubstantiation). ప్రభువు అప్పమును ద్రాక్ష రసమును తన శరీరముగా రక్తముగా మార్చు ప్రక్రియ. అనగా “దివ్యసత్ప్రసాద సన్నిధి అన్ని అద్భుతాలలో ఒక మహా అద్భుతం” అని ఆరవ పౌలు పాపుగారు ప్రకటిస్తున్నాడు.

## రెండవ అధ్యాయము:

## దివ్యసత్ప్రసాదము – శ్రీసభకు ఒక బహుమానము

దివ్యసత్ప్రసాదము ప్రభువు శ్రీసభకు అనుగ్రహించిన ఒక మహోన్నత వరము. శ్రీసభ ఈ మహోన్నత వరమును తన దైవార్చన ద్వారా నిరంతరముగా అన్వేషిస్తూనే ఉంటుంది. “నా జ్ఞాపకార్థం చేయుడి” అను క్రీస్తు ప్రభువుని ఆజ్ఞను అనుసరించి శ్రీసభ దివ్యసత్ప్రసాద ఫలములను సంపూర్ణంగా అందించడానికి ప్రతి దినము కూడా ఆ సిలువబలి యాగమును దివ్యబలిపూజలో కొనియాడుతూ ఉంటుంది. ఈ అధ్యాయంలో ఈ క్రింది అంశాలను మనము పరిశీలించుదాం: దివ్యసత్ప్రసాదము – శ్రీసభ పితరుల అధ్యయనము, దివ్య సత్ప్రసాదము – శ్రీసభ ఐక్యత పవిత్రతా దివ్య సంస్కారము, దివ్యసత్ప్రసాదము

– అపోస్తోలికతత్వము, దివ్యసత్ప్రసాదము – కతోలిక విశ్వాసము. ఈ అంశముల ద్వారా దివ్యసత్ప్రసాద ఔన్నత్యమును మనము గ్రహించుదాం.

## 2.1. దివ్యసత్ప్రసాదము – శ్రీసభ పితరుల అధ్యయనము

కడరా భోజన సమయము నుండి దివ్యసత్ప్రసాదమును శ్రీసభ అనేక నామములతో సంబోధిస్తుంది: ప్రభుని భోజనం, రొట్టె విరచుట, పవిత్ర బలియర్పణం, దివ్యసత్ప్రసాద సమావేశము, దివ్యబలిపూజ, పరమ రహస్య విందు, పవిత్రమైన దివ్యమైన అర్చన. ఈ నామములలో ఆమోదకరమైనది: దివ్యసత్ప్రసాదము. అనగా స్తుతి సమర్పణ దివ్య సంస్కారము. పలు విధములైన నామముల ద్వారా ఒక సత్యము విధితమవుతుంది: దివ్యసత్ప్రసాదము బాప్తిస్మము పొందిన విశ్వాసులచే ఆదివారము సమర్పింపబడు దివ్య సంస్కారము. లూకా సువార్తలోని ఎమ్మావు మార్గము అను ప్రస్తావన ఈ క్రమమును తెలియజేస్తుంది (లూకా 24:25–31). పునరుత్థాన ఆదివార సాయం సమయమున, ప్రభువు తన శిష్యులకు దర్శనమిచ్చాడు. ఎమ్మావు మార్గంలోని శిష్యులు ఆయన మాటలను శ్రద్ధగా ఆలకించారు. అంతిమమున రొట్టెను విరచి దేవునికి కృతజ్ఞత చెల్లించడంలో యేసు వారికి తనను తాను సంపూర్ణంగా తెలియజేసుకున్నాడు. అపోస్తోలిక సాంప్రదాయం ద్వారా, దివ్యసత్ప్రసాదము తన కుమారుని పరమ రహస్యంలో లోకమును రక్షించిన తండ్రి దేవుణ్ణి ప్రత్యక్ష పరుస్తుంది. అదే సమయంలో, దివ్యసత్ప్రసాదము ఈ రక్షణ నిమిత్తమై శ్రీసభ సమర్పించు కృతజ్ఞతా కార్యము.

విశ్వాసములో సఖ్యత జీవితమును పెంపొందించడానికి, సాతాను ద్వారా ఏర్పడిన విభజనలను జయించడానికి ఒక గొప్ప మార్గము దివ్య సత్ప్రసాదములో పాలుపంచుకోవడమే అని పునీత అంటియోకు ఇన్యాసి వారు అంటాడు.

క్రీస్తుని శరీరము రక్తము ఒక్కటే, పీఠము ఒక్కటే, మేత్రాణులు ఒక్కడే కాబట్టి దివ్యసత్ప్రసాద ఐక్యతలో మనం జీవించాలని ఈ పునీతులు పిలుపునిస్తున్నాడు. దివ్య సత్ప్రసాదములో పాపముల కొరకై శ్రమలను అనుభవించి ఉత్థానమైన క్రీస్తుని శరీరమును చూడాలని ఈ పునీతుడు క్రైస్తవ సంఘమును హెచ్చరిస్తున్నాడు. దివ్యసత్ప్రసాదము మలాకీ ప్రవక్త ద్వారా

ప్రవచింపబడిన విశ్వజనీన బలి యాగము, నిత్యజీవమును అందించు ఆధ్యాత్మిక ఆహారము, సమాధానమును కలిగించు ఒక ఊట అని ఈ పునీతుడు అంటాడు. ఆదివార దివ్యసత్ప్రసాదము లోక సృష్టిని కలిగించిన దినమును, యేసుక్రీస్తు ఉత్థాన దినమును సూచిస్తుంది అని పునీత జుస్టీను పలుకుతున్నాడు. పునీత ఇరేనియుసు ఈ దివ్యసత్ప్రసాదమును జ్ఞాన చాందసవాదులకు వ్యతిరేకంగా ఒక మనుష్యవతార పరమ రహస్యంగా పేర్కొంటాడు. అంతేకాదు, దివ్యసత్ప్రసాదములో క్రీస్తు నిజమైన సన్నిధి ఉందని, అది ఆయన నిజమైన శరీరము నిజమైన రక్తమని, అందుకొరకే దానిని స్వీకరించవలసిన అవసరము ఉందని ఆయన ప్రకటిస్తాడు. పునీత సిప్రియను రొట్టె రసములు క్రీస్తు శరీరక్తములుగా మారుతున్నాయని, అందులో వేద సాక్షులకు బలము, క్రైస్తవులకు ఐక్యత ఇమిడి ఉన్నాయని తెలియజేస్తున్నాడు.

శ్రీసభ అధికారికంగా దివ్యసత్ప్రసాద స్థాపనను, దాని క్రమమును, క్రీస్తు నిజమైన సన్నిధి సిద్ధాంతమును, ముఖ్యముగా క్రీస్తు నిజమైన సన్నిధి ఏర్పడు విధానమును, దానికి ఉన్నటువంటి బలి విధాన అంశమును, తన వేదాంత అధ్యయనం ద్వారా ప్రకటిస్తుంది. ఈ వేదాంత సత్యము శ్రీసభ పితరుల ప్రబోధములో కనిపిస్తుంది. విశ్వాసము ఏ విధంగా మనలను ఆత్మవైపు నడిపించి అమరమైన జీవితాన్ని అందిస్తుందో, అదే విధంగా దివ్యసత్ప్రసాదము మనలను క్రీస్తు శరీరంలో ఏకం చేస్తుందని పునీత నిస్సా గ్రేగోరి అంటాడు. పునీత సిరిలు ఈ విధంగా అంటాడు: దివ్యసత్ప్రసాదము మనలను దైవ స్వభావంలోనికి నడిపిస్తుంది.

దివ్య సత్ప్రసాదము, ఏసుక్రీస్తు మరణము పునరుత్థానం వలన అందించబడి అందులోని పవిత్రీకరణ శక్తి, అందరిని సత్ప్రసాద స్వీకరణ వైపు నడిపించు పవిత్రాత్మ ప్రేరణ ఇవన్నీ కూడా ఈ దివ్య సంస్కార సిద్ధాంతము, దైవార్చన క్రమంలో భాగమే, అని తీయోడోర్ అంటాడు. అనగా, బాప్తిస్మ జీవితము సత్ప్రసాద పోషణతో పరిపూర్ణమవుతుంది అని అతని సారాంశము. పునీత అంబ్రోసు పాత నిబంధన రక్షణ చరిత్రను రానున్న రెండవ రాకడ ప్రస్తావనను మదిలో ఉంచుకొని ఈ దివ్య సత్ప్రసాదము యొక్క సిద్ధాంతమును

రూపొందిస్తాడు. గురువు పలుకు క్రీస్తుని మాటలు, ఆ మాటల ద్వారా క్రీస్తు తండ్రికి సమర్పించు సమర్పించుకొను విధానము, ఆయన వాస్తవ సన్నిధికి ఒక నిదర్శనమని అంటాడు. అనేకమంది శ్రీసభ వేద పండితులు రొట్టె రసములు రూపాంతరం చెందు విధానం గురించి ప్రస్తావిస్తారు. ముఖ్యంగా పునీత అగుస్తీను దివ్యసత్ప్రసాదము యొక్క వాస్తవికతను, రూపకతను ధ్యానిస్తూ దివ్య సంస్కారములో దాగివున్న క్రీస్తు శరీరమును, బలి గుణమును ఆయన క్షుణ్ణంగా పరిశోధన చేస్తాడు.

పునీత థామస్ అక్వినాసు "దివ్య సత్ప్రసాదము క్రీస్తుని సన్నిధి సంస్కారము" అని అంటూ, ఇతర దివ్య సంస్కారాలకు దివ్యసత్ప్రసాదమునకు ఉన్న వ్యత్యాశమును తెలియజేస్తున్నాడు. ఆయన Representare అను పదమును, అనగా ''ప్రత్యక్షపరచు'' అను పదమును ఉపయోగిస్తాడు. అనగా దివ్యసత్ప్రసాదము కేవలము క్రీస్తుని మరణ పునరుత్థాన సంఘటనను భక్తిగా ధ్యానించడం మాత్రమే కాదు, అది నిజముగా ఆయన ప్రేరేపితమైన ప్రభావితమైన సన్నిధి. ఈ దివ్య సంస్కారం యొక్క అర్థము మూడు విధాలుగా కనిపిస్తుంది. మొదటిది గతమునకు చెందినది, అనగా క్రీస్తుని శ్రమలు, ఆయన నిజమైన బలిని సూచిస్తుంది, కాబట్టి దివ్య సంస్కారమును నిర్వహించడం అంటే క్రీస్తు బలిని కొనియాడడమే. రెండవది, వర్తమాన ప్రభావమును సూచిస్తుంది. అనగా శ్రీసభ ఐక్యమును, దివ్య సంస్కారం ద్వారా విశ్వాసుల మధ్య ఏర్పడు సఖ్యతను తెలియజేస్తుంది. మూడవది, భవిష్యత్తునకు సంబంధించింది. పరలోకములో పొందబోవు పరిశుద్ధమైన జీవితమును ఈ దివ్య సంస్కారము ముందుగానే రుచి చూపిస్తుంది. పునీత బోనవెంచరు దివ్య సత్ప్రసాద వేదాంతమును వివరిస్తూ, క్రీస్తును స్వీకరించు వారికి విశ్వాసము అవసరమని అంటాడు. కడరా భోజన సమయంలో ప్రభువుని పలుకులలో ప్రభువుని నిత్య సన్నిధి వాగ్దానమును అతడు గుర్తుకు చేస్తాడు: లోకాంతం వరకు నేను మీకు సదా తోడై ఉంటాను (మత్తయి 28:20). ఈ దివ్యసత్ప్రసాద సంస్కారము ద్వారా క్రీస్తు శ్రీసభలో నిజముగా వాస్తవముగా కొలువై ఉన్నాడు.

## 2.2. దివ్యసత్ప్రసాదము – శ్రీసభ సఖ్యత, పవిత్రత

దివ్యసత్ప్రసాదము శ్రీసభ స్వభావమును వెల్లడిస్తుంది. స్థానిక స్థాయిలో, విశ్వస్థాయిలో శ్రీసభ ఏకమైనది, పవిత్రమైనది, కతోలికమైనది, అపోస్తోలికమైనది. ఈ స్వభావము దివ్య సత్ప్రసాదము ద్వారా ప్రత్యక్ష పరచబడుతుంది అని రెండవ జాన్ పౌలు పాపుగారు శ్రీసభకు దివ్యసత్ప్రసాదమునకు ఉన్న సంబంధమును వివరిస్తూ Ecclesia de Eucharistia అను తన పత్రికలో సెలవిస్తాడు. కతోలిక శ్రీసభ సౌందర్యము విశిష్టత ఏమిటంటే అది ఒక కాలానికో ఒక యుగానికో పరిమితం కాదు. శ్రీసభ నిరంతరము కొనసాగుతుంది. పురోగతివైపు పయనిస్తూనే ఉంటుంది. పరమ రహస్యాల లోతుల్లోనికి ప్రవేశిస్తూనే ఉంటుంది. దైవార్చనలో, దివ్యసత్ప్రసాదములో దాగివున్న నిగూఢ రహస్యాలను ఈ ప్రపంచానికి చాటి చెబుతూనే ఉంటుంది.

పునీత అగుస్తీను నూతనంగా ఈ దివ్య సంస్కారమును స్వీకరించు బిడ్డలకు ఈస్టర్ పండుగ రోజు ఈ మాటలు అంటాడు: "మీరు స్వీకరించు దాని గురించి మీరు గ్రహించి ఉండాలి. అందుకొరకే అపోస్తలుల ద్వారా క్రీస్తు ప్రకటించు బోధనను మీరు శ్రద్ధగా ఆలకించాలి. క్రీస్తు శరీరము ఒక్కటే. కావున మీరు అనేకమంది అయినను క్రీస్తు శరీరంలో ఒకే శరీరంగా ఉంటున్నారు. ఇదియే మీరు స్వీకరించబోవు దివ్యసత్ప్రసాద విశ్వాస సంగ్రహము. అయితే ఈ దివ్యసత్ప్రసాద విశ్వాసమును వేదాంతమును నిరాకరించువారు శ్రీసభ ప్రారంభం నుండి కూడా ఉంటూనే ఉన్నారు. తనకు ఉన్నటువంటి సఖ్యత శక్తి ద్వారా దివ్యసత్ప్రసాదము విశ్వాసులను ఒకటిగా చేరుస్తుంది, ఆటంకాలను అవరోధాలను అధిగమించేలా వారిని ప్రేరేపిస్తుంది, ప్రభువునిలో నూతన ఐక్యత వైపు వారిని నడిపిస్తుంది. క్రీస్తు మనలను తనలో ఐక్యపరచుకొని ఒకే శరీరముగా మలుచుకుంటూ, శ్రీసభను పవిత్ర పరచు దివ్య సంస్కారమే ఈ దివ్యసత్ప్రసాదము.

## 2.3. దివ్యసత్ప్రసాదము – అపోస్తోలిక తత్వము

ప్రభువు దివ్య సంస్కారాలను శ్రీసభ పరిచర్యకు అందించాడు. ఈ విధముగా శ్రీసభ వాటిని స్వీకరించి రెండువేల సంవత్సరాలుగా విశ్వసనీయతతో ఈ

దివ్య సంస్కారాలను అపోస్తలిక విశ్వాసంతో ప్రజలకు అందుబాటులో ఉంచుతూనే ఉంది. యేసు పరలోకానికి వెళ్ళిపోతూ మోక్షరోహణ సమయంలో ఈ విధంగా అంటాడు: "పరలోకము నుండి దిగి వచ్చిన మనుష్య కుమారుడు తప్ప మరెవరును పరలోకమునకు ఎక్కిపోలేదు" (యోహాను 3:13). ఈ మాటలను శ్రీసభ మదిలో ఉంచుకొని నిరంతరము తన దృష్టిని ప్రభు మీదనే కేంద్రీకరించి ఉంది. క్రీస్తు తన మహిమగల భౌతిక శరీరంతో పునరుత్థానమై పరలోకానికి వెళ్ళాడు. అయినప్పటికీ ఇంకా ఈ భూలోకంలో తన ఆధ్యాత్మిక దేహమైన శ్రీసభలో, ఆ శ్రీసభ సభ్యులలో ఇంకా నివసిస్తున్నాడు (1 కొరింతీ 22:5) అంతేకాదు దివ్య సంస్కారాలలో, మహోన్నతంగా దివ్యసత్ప్రసాదములో క్రీస్తు జీవిస్తూనే ఉన్నాడు. ఆయన ముందుగానే సెలవిచ్చి ఉన్నాడు: నేను వెళ్ళకుంటే ఆదరణ కర్త మీ చెంతకు రాడు (యోహాను 16:7). తన జన్మము ద్వారా మనుష్యవతారములో తన నిజమైన శరీరమును అనుగ్రహించిన ప్రభువు ఇప్పుడు తన శ్రీసభ అయిన ఆధ్యాత్మిక శరీరములో తన జీవాన్ని అందిస్తున్నాడు.

శ్రీసభ లేదా దివ్యసత్ప్రసాదము యొక్క అపోస్తోలిక ఉనికి కేవలము ఒక చారిత్రాత్మక ఘట్టము మాత్రమే కాదు, అంతకన్నా ఎక్కువగా ప్రతి యుగములో క్రీస్తు తనను తాను ప్రతి వ్యక్తికి ప్రత్యక్ష పరచుకుంటున్నాడు. ఇది ఒక నిరంతర ప్రక్రియ. దీనినే శ్రీసభ ఐక్యత పరమ రహస్యం అని సంబోధించగలము. "ఎక్లేసియా దే యూకరిస్తియా" అను పాపుగారి అధికారిక పత్రము పునీత అగుస్తీను మాటలను ప్రస్తావిస్తూ ఇలా అంటుంది: నీ పరమ రహస్యమునే నీవు అందుకొనుచున్నావు. క్రీస్తుని పరిశుద్ధ సన్నిధి మనుష్యవతార పరమ రహస్యం యొక్క ఒక ప్రతి ఫలము. కావున అది ఒక విశ్వాస పరమ రహస్యము. అందులో శ్రీసభ పరమ రహస్యం కూడా దాగి ఉంది. అందుకొరకే దివ్యసత్ప్రసాద నిర్వహణలో శ్రీసభ సంపూర్ణ ఆశ్చర్యముతో "కన్య మరియ నుండి జన్మించిన నిజమైన శరీరమా నీకు స్తుతి" అని ధ్యానిస్తుంది.

బలిపీఠముపై నిర్వహింపబడు దివ్య సంస్కారంలోని రక్షణ కార్యం వలన శ్రీసభ ఎదుగుతుందని ద్వితీయ వాటికన్ మహాసభ బోధిస్తుంది. ఆరవ పౌలు పాపు గారు ఇలా ప్రకటిస్తాడు: శ్రీసభ నిరంతరము కూడా దివ్యసత్ప్రసాద పరమ రహస్యంలోని వేదాంతమును సాంప్రదాయంగా, నిరాటంకంగా

అందిస్తుంది అని చెప్పడానికి రోమను మిసలు అనగా రోమియా పూజా క్రమము ఒక సాక్ష్యము. రెండవ జాన్ పౌలు పాపుగారు శ్రీసభకు మరియు దివ్యసత్ప్రసాదమునకు మధ్య ఒక బంధం ఉందని చెప్పడానికి ఒక నానుడి వినియోగిస్తాడు: "దివ్యసత్ప్రసాదము శ్రీసభను నిర్మిస్తుంది, శ్రీసభ దివ్యసత్ప్రసాదమును అందిస్తుంది." ఇంకొంచెం లోతుగా అధ్యయనం చేస్తూ ఆయన అంటాడు: విశ్వాస సంగ్రహములోని శ్రీసభ గుణములైన ఏక, పవిత్ర, కతోలిక, అపోస్తలిక అను అంశాలు దివ్యసత్ప్రసాదమునకు కూడా వర్తిస్తాయి. ఎందుకంటే, అది క్రీస్తులో జన్మించింది అయినప్పటికీ అపోస్తలుల విశ్వాసమునకు అప్పగించబడింది. ఈ శ్రీసభ గుణముల ద్వారా శ్రీసభ దివ్యసత్ప్రసాదముతో ఐక్యమై, ఒక ఆధ్యాత్మిక శరీరముగా రూపొంది, తన ఆంతరంగిక మార్పును ప్రత్యక్ష పరుస్తుంది. దీని ద్వారా మనకు రెండు విషయాలు అర్థమవుతున్నాయి: మొదటిది, దివ్యసత్ప్రసాదము ఒక అనుగ్రహము మరియు ఒక పరమ రహస్యం, రెండవది అది విశ్వాస సంఘము యొక్క శక్తికి అతీతంగా అందించబడుతుంది. కాబట్టి దివ్యసత్ప్రసాదమును ఒక వరముగా స్వీకరించాలి, క్రీస్తులో ఐక్యత కొరకు వ్యక్తిగతంగా ప్రయత్నించాలి, అందులోని లోతైన రహస్యమును మరియు వాస్తవిక నిజమును గ్రహించాలి.

## 2.4. దివ్యసత్ప్రసాదము - కతోలిక విధానము

దివ్యసత్ప్రసాదానికి ఒక విశ్వజనీన లక్షణము ఉంది. అది స్థానిక మరియు విశ్వవ్యాప్త శ్రీసభతో సంబంధం కలిగి ఉంది. విశ్వవ్యాప్తంగా విశ్వాసులందరినీ కూడా అది ఏకం చేస్తుంది. ఈ దివ్యసత్ప్రసాదము నుండి శ్రీసభ అనుగ్రహమును స్వీకరించి నిరంతరము వర్ధిల్లుతుంది. అదేవిధంగా, తనలోని సభ్యులందరినీ కూడా ఒకటిగా విశ్వాసములో జత చేస్తూ, వారిని పరిపూర్ణత వైపు నడిపిస్తుంది. ఈ విశ్వ శ్రీసభ ఐక్యత అనేక పునాదుల మీద ఆధారపడి ఉంది. విశ్వాస ప్రకటన, అపొస్తలిక సిద్ధాంతము, దివ్య సంస్కారములు, శ్రీసభ పరిపాలన ఈ ఐక్యతకు పునాదులు. ఈ ఐక్యత బాహ్యంగా కనిపించాలంటే దివ్యసత్ప్రసాద నిర్వహణ ఒక సంపూర్ణ మార్గము. ఈ దివ్యసత్ప్రసాద నిర్వహణ స్థానికంగా జరిగినప్పటికీ, అది కేవలము ఆ స్థానిక సంఘంనకు మాత్రమే పరిమితం

కావడం లేదు, అంతకుమించి అది విశ్వ శ్రీసభకు సంకేతముగా ఉండి, ఏక పవిత్ర కతోలిక అపోస్తలిక శ్రీసభను సూచిస్తుంది.

మొదటి శతాబ్దంలో, ఆదిమ క్రైస్తవ సంఘాలలో, నగరానికి కేవలము ఒక పీఠాధిపతి మరియు ఒక పీఠము ఉండేవి. ఇది ప్రభువుని ఐక్యతకు గుర్తుగా ఉండేది. దివ్యసత్ర్పసాదములో తనను తాను సమర్పించుకోవడం ద్వారా క్రీస్తు ప్రతి స్థలములో ప్రత్యక్షంగా ఉంటున్నాడు. ఎక్కడెక్కడ అయితే ఈ దివ్యసత్ర్పసాదము నిర్వహింపబడుతుందో అక్కడ శ్రీసభ పరమ రహస్యం సంపూర్ణంగా నిర్వహింపబడుతుంది. అదే సందర్భంలో, క్రీస్తు ఆ స్థలములలో ప్రత్యేకంగా కొలువై ఉంటాడు. క్రీస్తులో విభజన లేదు. ఆయన ఒక్కడే. తన సభ్యుల నుండి ఆయన విభజింపబడలేదు. దీని మూలంగా దివ్యసత్ర్పసాదములో క్రీస్తు సన్నిధి ఏకంగా పరిపూర్ణంగా విశ్వ శ్రీసభలో వ్యాప్తి చెంది ఉంటుంది.

ఆరవ పౌలు పాపుగారు, 1969 సంవత్సరములు, అపొస్తోలిక పత్రము "మిస్సలే రోమానుం"లో తన కోరికను వెల్లడి చేస్తాడు: ద్వితీయ వాటికను మహాసభ నియమాలను అనుసరించి రూపొందించబడిన ఈ రోమియ పూజా క్రమము, అనేక భాషలలో తర్జుమా చేయబడినప్పటికీ, అది ఒకే ఒక ప్రార్ధనగా శ్రీసభ ఐక్యతను సూచిస్తుంది. అందుకొరకే దివ్యసత్ర్పసాద నిర్వహణలో దైవార్చనపరంగా, శ్రీసభ చట్ట పరంగా కొన్ని నియమాలను పాటించవలసి ఉంది. అన్ని దేవాలయాలలో, అన్ని సందర్భాలలో ఒకే పూజ ఒకే విధంగా సమర్పింపబడుతుంది.

శ్రీసభ ఒక రక్షణ దివ్య సంస్కారము. ఒక దివ్య సంస్కారముగా శ్రీసభ ఐక్యతలో ఉన్న గోచరమగు అగోచరమగు అంశాల మధ్య ఒక బంధము ఏర్పడుతుంది. ఈ దివ్యసత్ర్పసాద నిర్వహణలో విశ్వవ్యాప్తంగా అందరూ ఒకే బంధములో ఏకమై ఉంటారు. దీనినే శ్రీసభ కతోలిక విధానం అంటారు.

## మూడవ అధ్యాయము:

## దివ్యసత్ర్పసాదము - విశ్వాస రహస్య ప్రకటనము

దివ్యసత్ర్పసాదము ఒక విశ్వాస పరమ రహస్యము. దివ్యబలిపూజలు సమర్పించడం ద్వారా ఆ విశ్వాసమును శ్రీసభ విశ్వవ్యాప్తంగా ప్రకటిస్తుంది. అనగా, తన బోధన ద్వారా, అధికారిక పత్రాల ద్వారా, దివ్యసత్ర్పసాద పరమ

రహస్యం గూర్చి ప్రబోధిస్తుంది. ఈ అధ్యాయములో ఆ ప్రబోధనలో భాగంగా కొన్ని అంశాలను పరిశీలించుదాం: కతోలిక శ్రీసభ బోధనలు దివ్యసత్ప్రసాదం, దివ్యసత్ప్రసాద లక్షణం, వాక్కు మనుష్యవతారము మరియు దివ్యసత్ప్రసాదమునకు మధ్య ఉన్న సంబంధము, దివ్యసత్ప్రసాదము ఒక ఐక్యత చిహ్నము మరియు దివ్యసత్ప్రసాదము ఒక భక్తియుత దివ్య సంస్కారము. ఈ అంశములను విపులంగా అధ్యయనం చేద్దాం.

## 3.1. దివ్యసత్ప్రసాదము – శ్రీ సభ ప్రబోధము

దివ్యసత్ప్రసాదం ఎడల విశ్వాసాన్ని పెంపొందించడం, దాని గురించి ఎదురయ్యే సిద్ధాంతపరమైన మరియు సువార్తపరమైన అంశాలను ఖండించడం, అందులోని వాస్తవికతను, క్రీస్తు ఆలోచన సమగ్రతను అందించడం శ్రీసభ ఎల్లప్పుడు తన బాధ్యతగా తన భుజస్కందాలపై మోస్తూ వస్తుంది. దివ్యసత్ప్రసాదము గురించి వాస్తవ విశేషాలను శ్రీసభ తన పలు రకాల సమావేశాల ద్వారా, తన ప్రబోధన అధికార పత్రాల ద్వారా ప్రపంచానికి చాటిచెబుతూ ఉంది. ఈ విధంగా ఈ దివ్య సంస్కారం గురించి ప్రబోధించడంలో శ్రీసభ అపోస్తోలిక మరియు శ్రీసభ పితరుల సాంప్రదాయములను పరిగణలోనికి తీసుకుంటుంది.

ట్రెంట్ మహాసభ మూడు ప్రకరణల ద్వారా దివ్యసత్ప్రసాద సిద్ధాంతమును వివరిస్తుంది. ఈ విధంగా ప్రొటెస్టెంట్ ఉద్యమ శాఖల వారికి దివ్యసత్ప్రసాదము గురించి, ముఖ్యముగా అందులో క్రీస్తు సన్నిధి గురించి ప్రబోధిస్తుంది: అప్ప ద్రాక్ష రసరూపాలలో నిజ దేవుడు నిజమానవుడైన యేసు ప్రభువు నిజముగా వాస్తవముగా తత్వ పరిణామముగా కొలువై ఉన్నాడు. అంతేకాదు శ్రీసభ ప్రబోధన మరింత లోతుగా వెళ్తుంది: ప్రభుని శరీరము కనిపించే రొట్టెలో మాత్రమే కాదు ద్రాక్ష రసములో కూడా ఉంది మరియు ప్రభువుని రక్తము కనిపించే ద్రాక్షరసములో మాత్రమే కాదు అప్పములో కూడా ఉంటుంది. ఇంకా అధికంగా దివ్యసత్ప్రసాదములో ప్రభువైన యేసు క్రీస్తు అప్ప రస రూపాలలో తన ఆత్మతో తన దైవత్వంతో ఉంటున్నాడు. సంగ్రహంగా, క్రీస్తు, తండ్రి వాక్కు, నిజ దేవుడు మరియు నిజమానవుడు, ద్వివిధముగా అప్ప రసములలో, ఏక విధముగా

ఒక్కొక్క దానిలో సంపూర్ణంగా నిండుగా కొలువై ఉంటున్నాడు. అదే మహాసభ "పదార్ధ తత్వ పరిణామ సిద్ధాంతమును" (Transubstantiation) కూడా వివరిస్తుంది. అంతేకాక క్రీస్తు శరీరమును స్వీకరించు విధానము గురించి, రక్తరహిత బలి అయిన దివ్యపూజకు మరియు రక్తహిత బలి అయిన సిలువ బలికి ఉన్న సంబంధం కూడా వివరిస్తుంది. అంతేకాదు తప్పుడు సిద్ధాంతమును కూడా ఈ మహాసభ ఖండిస్తుంది: ప్రతిష్టాపన మాటలు "దీనిని నా జ్ఞాపకార్థంగా చేయండి" అను ఆజ్ఞ కేవలము ఒక అలంకారము, ఒక రూపకము, ఒక అద్వితీయ భాగము అని ఎవరైనా పలికారంటే అది ఒక తప్పుడు సిద్ధాంతము మరియు దివ్య సంస్కార విశ్వాస నైజానికి వ్యతిరేకము. దివ్యసత్ర్పసాద స్థాపన క్రీస్తు యాజకత్వమును ప్రత్యక్ష పరుస్తుంది. అదే సమయంలో సిలువ రక్షణ శక్తి మరణించిన జీవించిన మానవాళి పాపములకు పరిహారమును సంపాదించి పెడుతుంది.

దివ్యపూజయొక్క బలి లక్షణములు 12వ భక్తినాథ పాపుగారు తన అధికార పత్రము "మీడియేటర్ దేయి" అనగా దేవుని మధ్యవర్తి అను పత్రములో బోధించిన సత్యమును ద్వితీయ వాటికను మహాసభ ధ్రువీకరించింది: క్రీస్తు ఏకైక ఒకే ఒక్క యాజకుడు, ఇతర యాజకులు ఆయన నామములో కర్తవ్యం నిర్వహిస్తారు, అతడు మరలా వచ్చు వరకు నూతన నిబంధన ఏకైక బలిని పీఠముపై ప్రత్యక్ష పరుస్తూ, శ్రీసభను నిరంతరము నూతనకరిస్తూ ఉంటారు. క్రీస్తు యాజకత్వములో గురుత్వ అభిషేకము ద్వారా పాలుపంచుకున్న, వారు క్రీస్తు వ్యక్తిలో కార్యమును నిర్వహిస్తారు.

## 3.2. దివ్యసత్ర్పసాదము – దాని లక్షణము

ట్రెంటు మహాసభ రూపొందించిన దివ్యసత్ర్పసాద సిద్ధాంతమును ఆధారంగా చేసుకొని ద్వితీయ వాటికను మహాసభ క్రీస్తు సన్నిధి విధానం గురించి, దివ్యసత్ర్పసాద సన్నిధి లక్షణముల గురించి బోధించింది. రక్షణ కార్యము ఒకే ఒకసారి, శాశ్వతంగా యేసుక్రీస్తు ద్వారా సంపూర్ణం కావించబడింది. అయితే శ్రీసభ మన పాస్కా క్రీస్తు వధింపబడిన సిలువ బలి ఫలములను దివ్యబలి పూజ నిర్వహణ ద్వారా ఆయన జ్ఞాపకార్థముగా ఇంకా కొనసాగిస్తూనే ఉంది. ఒక దివ్య సంస్కారముగా, దివ్యసత్ర్పసాదము క్రీస్తు

శరీరమైన శ్రీసభను నిర్మించి, దానిని ప్రగతి పదములో నడిపిస్తుంది. అందుకొరకే దివ్యసత్ప్రసాదము శ్రీసభ సభ్యులందరికీ రక్షణ ఫలములను అందించి, వారి మీద ఐక్యత అనుగ్రహమును, ప్రేమ వరమును ప్రోక్షిస్తుంది. ఎందుకంటే, దివ్యసత్ప్రసాదము ఆత్మకు ఒక ఆధ్యాత్మిక భోజనము, పాపమునకు విరుగుడు పరిహారము, రానున్న మహిమకు ఒక ప్రారంభము మరియు పవిత్రతకు ఆధారము.

ఆరవ పౌలు పాపుగారు తన అధికారిక పత్రమైన "మిస్టేరియమ్ ఫీదేయి" అనగా "విశ్వాస పరమ రహస్యము" లో ఈ విధంగా అంటాడు: దివ్యబలిపూజ, వ్యక్తిగతంగా జరుపబడిన సమయాలలో కూడా, ఒక క్రీస్తు కార్యము మరియు శ్రీసభ కార్యము. దివ్యసత్ప్రసాదములో క్రీస్తు తన సన్నిధిని ఆధ్యాత్మిక రూపంలో, చిహ్న రూపంలో కాదు, వాస్తవ రూపంలో ప్రత్యక్ష పరచి, తన దేహమైన శ్రీసభ ఐక్యతకు పునాదిగా ఉంటాడు. శ్రీసభ అనాది కాలము నుండి ప్రకటించిన విశ్వాసం ప్రకారము, ఇతర దివ్య సంస్కారాలకు భిన్నంగా, దివ్యసత్ప్రసాదము "మన పాపములకై శ్రమలను అనుభవించి, తండ్రి చేత మరణం నుండి లేవనెత్తబడిన, మన ప్రభువు రక్షకుడైన ఏసుక్రీస్తు శరీరము." పదార్ధ తత్వరూపాంతర పరిణామం గురించి ఆరవ పౌలు పాపుగారు ఇలా అంటాడు: ద్విపదార్ధములైన అప్పము ద్రాక్షరసముల తత్వమును మార్చుడం ద్వారా క్రీస్తు వాస్తవ రూపంలో తన సన్నిధిని అనుగ్రహిస్తున్నాడు. ఈ పదార్ధ తత్వ రూపాంతర పరిణామము ఒక నూతనమైన విధానము, ఎందుకంటే అందులో క్రీస్తు వాస్తవముగా ఉంటున్నాడు, అందుకొరకే అది అగోచరమైన స్థితిని సూచించినది. దానిని గ్రహించాలంటే విశ్వాసము అవసరము.

## 3.3. దివ్యసత్ప్రసాదము - వాక్కు మనుష్యవతారము

యేసు దేవుని కుమారుడు. శరీర రూపంలో మానవాళి మధ్య జన్మించాడు. ఈ సత్యమును స్వయంగా తానే ప్రకటించాడు. అంతేకాదు తండ్రి దేవుడు ఆత్మ దేవుడు కూడా ఈ విషయమును విధితం చేశారు. ప్రత్యేక విధంగా బాప్తిస్మ సమయంలోను, దివ్య రూప ధారణ సమయంలోను ఈ ప్రత్యక్షత కనిపిస్తుంది. చరిత్ర మొత్తము కూడా, యుగాంతం వరకు ప్రభువు ప్రతిరోజూ తనను తాను ప్రత్యక్ష పరచుకుంటున్నాడు. తండ్రి నుండి జన్మించిన క్రీస్తు,

నిరంతరము తండ్రికి తనను తాను సమర్పించుకొను క్రీస్తు, తన సన్నిధిని ప్రతి సమయంలో ఆత్మ ద్వారా ప్రతి వ్యక్తికి వ్యక్తపరచుకుంటున్నాడు. జీవ వాక్కు అయిన ఈ దైవత్వ పరిపూర్ణత నజరేతు యేసు మానవత్వములో ప్రవేశించింది. అయితే అతని మోక్షరోహణ సమయము నుండి (మార్కు 16:19–20; లూకా 24:50–53; అ.కా 1:9–14) అతడు ఇక దివ్యసత్ర్పసాద రూపంలో ఉంటున్నాడు. ఈ దివ్యసత్ర్పసాదము మానవాళి మధ్య దైవ సన్నిధిని ప్రత్యక్ష పరచు ఉత్తమమైన దివ్యసంస్కారము. మోక్షరోహణ అనగా మన చూపు నుండి క్రీస్తు దూరంగా పరలోకానికి వెళ్లాడని కాదు. తెరువబడిన పరలోక ద్వారములు ఆయన రెండవ రాకడను సూచిస్తున్నాయి. దీని ద్వారా మనుష్య కుమారుడు దైవ కుమారునిగా అత్యున్నతమైన స్థానమునకు, పరిశుద్ధమైన స్థితికి లేవనెత్తబడి ఉన్నాడు అని అర్థము అవుతుంది. అనగా తన యొక్క దైవత్వమును మహిమయుత మానవత్వములో ఆయన ప్రదర్శిస్తున్నాడు. కాబట్టి, మోక్షరోహణములో యేసుక్రీస్తు తనను తాను ఈ లోకము నుండి దూరం చేసుకోలేదు కానీ, ఒక నూతన విధానంలో తనను తాను ప్రత్యక్ష పరచుకుంటున్నాడు.

క్రైస్తవ విశ్వాసం అనగా దేవుడున్నాడని విశ్వసించడం మాత్రమే కాదు, చారిత్రాత్మక యేసు నిజముగా ఉన్నాడని విశ్వసించడం మాత్రమే కాదు, అంతకన్నా ముఖ్యముగా శరీర ధారియైన వాక్కులో దేవుడు తన సన్నిధిని నిరాటంకంగా మన మధ్య స్థిరపరచుచున్నాడు అని విశ్వసించడము. ఈ భూలోక జీవిత ఆరంభంలో ఆయన కాలమునకు స్థలమునకు పరిమితమైన ఒక నశించు శరీరమును కలిగి ఉన్నాడు. కానీ ఇప్పుడు అతడు ఉత్థాన శరీరమును కలిగి ఉన్నాడు, కాబట్టి అతని సన్నిధికి ఎటువంటి పరిమితులు లేవు. అందుకొరకే ఆ ఉత్థాన ప్రభువు మూసి ఉన్న ద్వారముల నుండి లోనికి వెళ్ళగలరు, బహుదూరమైన స్థలములలోకి కూడా క్షణములలో చేరుకోగలరు. అనగా పునరుత్థాన సమయము నుండి మోక్షరోహణ సమయము నుండి క్రీస్తు సన్నిధి ఒక నూతన రూపంలో, ఒక వినూతల తీరులో ఉంటుంది.

తన మొదటి లేఖలో పునీత యోహాను చరిత్రలో ప్రజలను చేరడానికి దేవుడు ఎటువంటి మార్గమును ఎంచుకుంటున్నాడో తెలియజేస్తున్నాడు: సృష్టి

ఆరంభము నుండి గల జీవ వాక్కును గూర్చి మేము మీకు తెలుపుచున్నాము. మేము దానిని చెవులారా విని కనులారా కాంచితిమి. కన్నులారా కాంచనయే కాదు, మా చేతులు దానిని స్పృశించినవి. ఈ జీవము ప్రదర్శింపబడినప్పుడు మేము దానిని చూచితిమి, సాక్ష్యమిచ్చితిమి. కనుకనే మేము దానిని గూర్చి మాట్లాడుచూ మనకు విధితము చేయబడినదియు, పితతో ఉండునదియు ఆగు నిత్యజీవమును గూర్చి మీకు విషయము చేయుచున్నాము. పిత తోడను, కుమారుడు యేసుక్రీస్తు తోడను, మాకు గల సహవాసములో మీరును మాతో చేరుటకై, మేము వినినవి కనినవి అగు వానిని మీకును తెలియచెప్పుచున్నాము (1 యోహాను 1:1−3). మనుష్యవతారంలో మరియనుండి సహజ సిద్ధముగా ప్రభువు పొందిన శరీరమునే, సిలువ వేయబడి మరణించి మూడవరోజు సజీవంగా లేచిన శరీరమునే, ఒక దివ్య సంస్కారముగా ప్రభువు మనకు ఇస్తున్నాడు. అదియే దివ్యసత్ప్రసాదము.

దీని ఫలితముగా, దివ్యసత్ప్రసాదములో క్రీస్తు శరీరానికి, క్రీస్తు శరీరమైన శ్రీసభకు, ఆధారము పునాది శరీర రూపం దాల్చిన దైవ వాక్కు అని మనము గ్రహించగలము. పునీత హిలరీ మాటలలో మనము తెలుసుకొను సత్యము: దైవవాక్కు శరీర ధారియై మన మధ్య నివసించింది (యోహాను 1:14) అనునది ఎంత వాస్తవమో, దివ్యసత్ప్రసాద ఆహారములో ఈ శరీరధారియైన వాక్కును స్వీకరిస్తున్నామన్నది కూడా అంతే వాస్తవము. రెండవ జాన్ పౌలు పాపుగారు ఇలా ప్రకటిస్తాడు: దివ్యసత్ప్రసాదము క్రీస్తు శ్రమల ఉత్థానముల జ్ఞాపకార్థమే కాదు, అతని మనుష్యవతార కొనసాగింపు కూడా. శుభవార్త సమయములో మరియ దేవుని కుమారుని వాస్తవ శరీర రూపంలో, అనగా శరీర రక్తాలలో, గర్భం దాల్చింది. విశ్వాసులు కూడా దివ్య సంస్కార రూపంలో బాహ్యంగా గోచరమగు అప్పరస రూపాలలో ప్రభువుని శరీర రక్తములను స్వీకరిస్తున్నారు అనడానికి ఇది ఒక ముందస్తు సత్యము.

## 3.4. దివ్యసత్ప్రసాదము – ఐక్యతకు చిహ్నము

దివ్యసత్ప్రసాదము కలిగించు ఐక్యత గురించి పలుమంది పునీతులు వారి వారి భావాలను ప్రకటిస్తున్నారు. "ఒకే ఒక రొట్టెను విరుచుట యందు విశ్వాసులందరూ ఒకే విశ్వాసంలోనికి, యేసుక్రీస్తు నందు విశ్వాసంలోనికి

కలసి వస్తారు" అని పునీత అంటియోకియా ఇగ్నేషియస్ అంటాడు. పునీత యోహాను క్రిసోస్టం కూడా ఇలా సెలవిస్తున్నాడు: ఇది విశ్వాస ఐక్యత, మనమందరం ఏకమై ఉన్నాము, మనలను ఐక్యపరచు బంధమును అందరూ అంగీకరించాలి. సత్ప్రసాదములో స్థిరపరచబడిన ఐక్యతకు ఆధారము బప్తిస్మములో పొందిన విశ్వాసమే. ఎందుకనగా బాప్తిస్మములో తండ్రితో శాశ్వత సమానత్వములో ఏకమైన ఆ కుమారులతో మనము ఐక్యమై ఉంటున్నాము. క్రీస్తు యందు ఒకే విశ్వాసం లేకుండా ఆయనలో ఐక్యమై ఉండడం సాధ్యం కాదు. వేర్వేరు విశ్వాసాలను మనం కలిగి ఉన్నప్పుడు ఒకే క్రీస్తును ఎలా స్వీకరించగలము? అనగా క్రీస్తు శరీరమును రక్తమును నిరుపయోగముగా స్వీకరించడమే కదా. అందుకొరకే దివ్యసత్ప్రసాదములో పాలుపంచుకొని వారందరూ ఒకే విశ్వాసములో ఐక్యమై ఉంటారు. శ్రీసభ ఒక తల్లిగా అవిశ్వాసుల ఎడల, ప్రాథమిక విశ్వాసమును అభ్యసించువారి యెడల, విశ్వాసమునకు దూరంగా ఉన్నవారి ఎడల ప్రేమను కలిగి ఉంది. అయితే బాప్తిస్మము స్వీకరించని వారికి, కతోలిక క్రైస్తవ సిద్ధాంతాలకు వ్యతిరేకంగా బోధించు వారికి, అనైతిక జీవితాన్ని జీవించు వారికి దివ్య సత్ప్రసాద స్వీకరణను నిరాకరిస్తుంది.

ఒకే రొట్టెను స్వీకరించిన ద్వారా మనము ఒకే జీవితంలో ప్రవేశిస్తున్నాము, ప్రభువుని ఒకే శరీరంగా మారిపోతున్నాం. చెల్లా చెదరైన క్రైస్తవులను ఒకరొట్టె ద్వారా ఒక పాత్రము ద్వారా ఐక్యతలోనికి ఆహ్వానించడమే దివ్యసత్ప్రసాద ఫలము. దీని ఫలితముగా, విశ్వ శ్రీసభకు సభ్యతగా ఉన్న వారు మాత్రమే, అన్య మతమును దాటి మారుమనస్సు పొందిన వారు మాత్రమే, నైతిక జీవితమును జీవించు వారు మాత్రమే దివ్యసత్ప్రసాదమును స్వీకరించాలి.

ఈ విధంగా చూస్తే, ఆంతరంగిక ఐక్యతకు తగ్గింపుతనము సహనము అవసరము. అందుకొరకే దివ్యసత్ప్రసాద పరమ రహస్య ఔన్నత్యమును భంగపరచు ప్రయోగాలకు తావివ్వకూడదు. దివ్య సంస్కారమును కేవలము మానవ సాధనగా పరిగణించకూడదు. సమిష్టి ప్రార్థన, నిరీక్షణ కలిగి ఉండి, విశ్వాసముతో అపోస్తలిక వారసత్వముతో ఆరంభము నుండి మనకు అందించబడిన దివ్యసత్ప్రసాదమును మనము గౌరవించాలి.

ఆర్థోడాక్స్ సంఘాలు మరియు ప్రాచీన తూర్పు సంఘాలు దివ్యసత్ప్రసాదం ఎడల ఒకే విశ్వాసమును కలిగి ఉండేవారు, ఎందుకన వారు నిజమైన దివ్య సంస్కారాలను కలిగి ఉన్నారు. కాబట్టి పలు సందర్భాలలో దివ్యసత్ప్రసాద ఐక్యత సాధ్యమే. అయితే తరువాత ముఖ్యముగా ప్రొటెస్టెంట్ ఉద్యమకారులు దివ్య సత్ప్రసాదం ఎడల ఒక వ్యతిరేకతను ఒక నిరాకరణను ప్రదర్శించారు. ముఖ్యముగా లూథరనులు దివ్య సత్ప్రసాద నిర్వహణ సమయంలో మాత్రమే క్రీస్తు సన్నిధిని విశ్వసించారు. అయితే యాజకత్వ దివ్య సంస్కారమును నిరాకరించారు. అంతే కాదు దివ్య సత్ప్రసాద పరమరహస్యం లోని సంపూర్ణ తత్వమును వారు అంగీకరించలేదు. కొన్ని చర్చల ద్వారా విజయాలు సాధించినప్పటికీ, వారు శ్రీసభ విశ్వాసానికి సంపూర్ణ అంగీకారమును తెలుపలేదు. అందువలన వారి ఉద్దేశం ప్రకారం, ఆధ్యాత్మిక అవసరత ఉన్న సమయాలలో సరి అయిన సంసిద్ధత కలిగిన కతోలికేతర సభ్యుడు దివ్య సత్ప్రసాదమును స్వీకరించవచ్చు. కానీ కతోలిక క్రైస్తవులు మాత్రము కేవలము అభిషేకము పొందిన గురువుల నుండి మాత్రమే దివ్యసత్ప్రసాదమును స్వీకరించాలి.

**ముగింపు**

దివ్యసత్ప్రసాదము శ్రీసభకు, తద్వారా విశ్వాస మానవాళికి దేవుడు అనుగ్రహించిన ఒక మహోన్నత అనుగ్రహము. దైవ సన్నిధిని నిరంతరము ఈ భూమిపై నిలిపే ఒక మహా సాధనమే ఈ దివ్యసత్ప్రసాదము. దేవుడు మానవళితో తన స్నేహమును సంపూర్ణంగా కొనసాగించాలని ఆకాంక్షించాడు. పాపము ద్వారా మానవుడు ఆ ప్రేమ బంధానికి భగ్నం కలిగించాడు. దేవునితో స్నేహాన్ని కోల్పోయాడు. పరలోక ఔషధాన్ని దూరం చేసుకున్నాడు. ఇటువంటి తరుణంలో మానవాళితో తల స్నేహాన్ని పునర్నిర్మించుకోవాలని దేవుడు సంకల్పించాడు. ఆ సంకల్పంలో భాగంగా, తన దైవత్వాన్ని మానవ శరీరానికి ఆపాదించాడు. తన జనితైక కుమారుడు యేసుక్రీస్తు ద్వారా తండ్రి దేవుడు మానవాళి రక్షణ కోసం తన కార్యమును ప్రారంభించాడు. మానవ శరీరముని దాల్చి ఆ దైవ కుమారుడు మానవుని మధ్యలో దైవ సన్నిధిని సుస్థిరం చేశాడు. అన్నిటికీ మించి, పాస్కా పరమ రహస్యము ద్వారా, అనగా ఏసుక్రీస్తు తన

మరణము పునరుత్థానముల ద్వారా మానవుని మధ్యలో ఆ దైవ సన్నిధిని శాశ్వతం చేశాడు. లోకాంతము వరకు, అనగా శాశ్వతంగా దేవుడు మానవునితో ఉండడానికి, దైవ రూపము నుండి మానవ రూపానికి వచ్చిన దేవుడు, మానవ రూపము నుండి దివ్యసత్ప్రసాద రూపానికి తనను తాను రూపాంతరం చేసుకున్నాడు. అప్ప ద్రాక్ష రసరూపాలలో తన శరీరమును రక్తం ఉంచి తానే స్వయంగా, సంపూర్ణంగా, వాస్తవంగా కొలువై ఉన్నాడు. ఇటువంటి శాశ్వత సన్నిధి బలిని తన జ్ఞాపకార్థముగా యుగాంతం వరకు కొనసాగించమని ఆజ్ఞాపించారు.

పాస్కా పరమ రహస్య ఆజ్ఞను శ్రీసభ తన ప్రేక్షక బాధ్యతగా స్వీకరించి దివ్య బలి పూజను నిరంతరము కొనసాగిస్తుంది. కావున, దివ్య బలి పూజ క్రీస్తుని పరిపూర్ణ సన్నిధికి ప్రత్యక్ష సంకేతం. దివ్య బలి పూజ ఒక నిరర్థకమైన కార్యము కాదు, ఒక నిరుపయోగమైన సంస్కారము కాదు, కొందరు భావించి ప్రకటించినట్లుగా అది ఒక మ్యాజిక్ కాదు. దివ్య బలి పూజ క్రీస్తుని సిలువ బలిని ప్రత్యక్ష పరచి పాప పరిహారములు అందించి మానవాళికి ప్రత్యేకంగా విశ్వాసులకు ఒక నూతన జీవితాన్ని అందించు ఒక బలి మాత్రమే కాదు, దానికి కొనసాగింపుగా అనుసంధానంగా పరిపూర్ణ సాధనంగా ఆధ్యాత్మిక భోజనమును అందించి ఆత్మను పోషించు ఒక దివ్య సంస్కారము. మనము దివ్య సత్ప్రసాదములోని సత్యమును గ్రహించాలి. విశ్వాసముతో క్రీస్తు ప్రభువుని శరీర రక్తములను స్వీకరించాలి. ఒకే రొట్టెలో పాలుపంచుకుంటున్నాము కాబట్టి అందరము సమిష్టిగా జీవిస్తూ ఒకే విశ్వాస సంఘమును నిర్మించాలి. అన్నింటికంటే మిన్నగా, ఇది ఒక పరలోక ఔషధం కాబట్టి ఈ పరలోక ప్రయాణములో దాని శక్తిని పొంది ముందుకు సాగాలి. మరోవైపు, సత్ప్రసాదము ఎడల ఎదురయ్యే అగౌరవమును, అమర్యాదను, సిద్ధాంత వ్యతిరేకతను నిర్మూలించి, వాస్తవికతను ప్రబోధించడానికి మన క్రైస్తవ జీవితాన్ని వెచ్చించాలి. దేవుడు మనకు తోడై ఉండును గాక. ఆమెన్.

# 2. దివ్యసత్ప్రసాదం - ప్రొటెస్టెంటు సంస్కర్తల వివాదం - కతోలిక శ్రీసభ విశ్వాస నినాదం

- బ్రదర్ గాలి మనోహర్

## ఉపోద్ఘాతం



దివ్యసత్ప్రసాదం క్రైస్తవ ఆధ్యాత్మిక జీవనానికి మూలం. అదిమానవ జీవితానికి ఒక చివరి అంకము. అనగా, విశ్వాస జీవితానికి అది ఒక ఆది, అంతము, అంతేకాదు, అది ఒక మొదలు ఒక ముగింపు. ఇంకోమాటలో చెప్పాలంటే దివ్యసత్ప్రసాదంలో క్రైస్తవ జీవితము ప్రారంభమవుతుంది, అందులోనే పరిపూర్తి అవుతుంది. కాబట్టి, క్రైస్తవ విశ్వాస జీవితంలో ఇది ఒక ముఖ్య భూమిక పోషిస్తుంది. ఇది ప్రవహించే జీవనదిలా మన జీవిత గమ్యానికి మార్గచూపరిగా మారుతుంది. దీని ప్రభావము, దీని అపరిమితమైన శక్తికొరవడితే క్రైస్తవ జీవితం ప్రామాణికతను కోల్పోయే ప్రమాదం ఉంది. ఇది దేవుని సృష్టిలో అత్యంత శ్రేష్ఠమైనది, మానవుని జీవితంలో సమూల పరివర్తనమును కలిగించే దివ్యసంస్కారము. శ్రీసభ అభివృద్ధిలో దివ్యసత్ప్రసాదం ఒక నిర్ణయాత్మక పాత్రను పోషిస్తుంది. ఆదిమ క్రైస్తవ విశ్వాసం "రొట్టెవిరుచుట" లేదా దివ్యసత్ప్రసాద పునాదిపై నిర్మితమై ఉంది అని గ్రహించగలము.

పునీత పౌలు తన కొరింతు క్రైస్తవ సంఘమును ఈ "రొట్టెవిరుచుట" సాంగ్యము ద్వారా ఒక కుటుంబముగా సఖ్యతతో ఐఖ్యతతో వర్ధిల్లాలని ప్రబోధించాడు (1 కొరింతీ 10:16-17). దివ్యసత్ప్రసాదం "ఐఖ్యత"కు చిహ్నంగా ఉండడమేకాదు, అది శ్రీసభ ఐఖ్యతకు దోహదపడుతుంది. రొట్టెను భుజించువారు అందరూ కూడా ఏకహృదయంతో ఏకమనసుతో జీవిస్తారు. శ్రీసభ దివ్యసత్ప్రసాదమును అనునిత్యం అందిస్తుంది. ఈ సంస్కారమును

శ్రీసభ "క్రీస్తుజ్ఞాపకార్థం"గా స్వయంగా ప్రభుని నుండే పొందిన దని గ్రహించి, దానిని ఒక వారసత్వపు హక్కుగా భావించి, నిరంతరం కొనియాడుతుంది. ఈ దివ్యసంస్కార నిర్వహణ ద్వారా శ్రీసభ మానవాళికి, ప్రత్యేకంగా విశ్వాసులకు ఆధ్యాత్మిక బలమును అనుగ్రహిస్తూ, సర్వమానవాళికి ఒక సజీవ సాక్షముగా నిలుస్తుంది. ఇప్పుడు మనం దివ్యసత్ప్రసాదమూలాలను, చారిత్రాత్మక పురోగతిని, శ్రీసభలో దాని ప్రాముఖ్యతను చర్చిద్దాం.

## "దివ్యసత్ప్రసాద" పద ఉత్పన్నం

క్రొత్త నిబంధన మొదట గ్రీకు భాషలో వ్రాయబడింది. గ్రీకు నామవాచకంలో "యూకరిస్తియా" అనగా "కృతజ్ఞత" అని అర్థం. దీనికి సంబంధించిన ఒక గ్రీకు పదము "ఎక్సాపిస్టియోనె" నూతన నిబంధనలో ప్రత్యేక విధంగా కడరా భోజన ప్రస్తావనలో ఎక్కువగా కనిపిస్తుంది (1 కొరింతీ 11:23-24).

యూకరిస్ట్ అనుపదం "కృతజ్ఞత" అను అర్థంలో అపోస్తలుల బోధన గ్రంథంలో, అంటియోకు ఇన్యాసి వారి బోధనలో, వేదసాక్షి జస్టిన్ గారి లేఖలలో చాలాసార్లు గోచరమవుతుంది. ఇప్పటికీ దివ్యసత్ప్రసాదమును తూర్పు ఆర్థోడాక్స్, ఓరియంటల్ ఆర్థోడాక్స్, కతోలికసభ, ఆంగ్లికను సభ మరియు లూథరనులు ఉపయోగిస్తున్నారు.

దివ్యసత్ప్రసాదమును రెండు విధాలుగా అర్థం చేసుకోవొచ్చు: ఒకటి, దివ్యసంస్కారము మరియు రెండవది, దివ్యబలిపూజ. ఎందుకన, ఇందులో క్రీస్తు రొట్టె రసరూపాలలో నిజముగా వసించుచున్నాడని విశ్వసిస్తారు. ఈ దివ్యసత్ప్రసాదమును అనాధి క్రైస్తవ విశ్వాసం నుండి చాలా రకాల పేర్లతో అభివర్ణించారు. అవి ఏవనగా: ప్రభుని భోజనం (చేనాడొమిని), ప్రభుని బల్లభోజనం (మెన్సాడొమిని), ప్రభుని దేహం (కోర్పుస్డొమిని) మరియు పరమ పవిత్రమైనది (సాంక్తిస్సిముస్).

అంతేకాదు, ఇంకాకొన్ని బిరుదులు ద్వారా దివ్యసత్ప్రసాదం వ్యక్తీకరించబడింది. ఆదిమ అర్థం కొద్దిగా మారినప్పటికీ, ఆది నుండి ఈ పదాల ద్వారా దివ్యసత్ప్రసాద ఉనికిని తెలియజేసారు. ఆపదాలు: అగాపే (ప్రేమవిందు),

యులూజియా (దీవెన), రొట్టెవిరచుట, సినాక్సిస్ (సమావేశము). అయితే ఇన్యాసి మరియు జుస్తిను రచనలలో కనిపించు పురాతన శీర్షిక "యూకరిస్టు" లేదా "కృతజ్ఞత" ఒక్కుమ్మడిగా శ్రీసభ వేదాంత శాస్త్రములో సంపూర్ణ ప్రాధాన్యత సంతరించుకుంది. దీనిని తెలుగు భాషలో అర్ధవంతముగా "దివ్యసత్ప్రసాదం"గా గైకొనబడింది.

## దివ్యసత్ప్రసాదం - పరమార్థం

దివ్యసత్ప్రసాదంలో ఒక పరమార్ధం దాగి ఉంది. క్రీస్తు ప్రభువు తన శరీరరక్తముల సిలువత్యాగం, ఆయన మహిమతో తిరిగి వచ్చు వరకు సిలువత్యాగాన్ని యుగాల పాటుకొనసాగించడానికి కడరాత్రి సమయాన ఈ దివ్యసత్ప్రసాదమును స్థాపించాడు. అనగా, తన మరణ పునరుత్తానములను కొనసాగించే బాధ్యతను శ్రీసభకు అప్పగించారు. ఈ దివ్యసత్ప్రసాదము ఐఖ్యతకు సంకేతం, దాతృత్వ బంధానికి స్మారక చిహ్నాం. ఎందుకన, దీని ద్వారా క్రీస్తు విశ్వాసులచే స్వీకరింపబడి, తండ్రి దేవుని దయనుపొందిపరలో కమహిమను పొందగలుగుతారు.

ఇది క్రైస్తవ జీవనమునకు, ఆధ్యాత్మిక ఎదుగుదలకు మూలము. దివ్యసత్ప్రసాదంలో దేవుని పవిత్రీకరణచర్య, ఆయన యెడల ఆరాధన మహోన్నత స్థాయికి చేరుకుంటుంది. తద్వారా తల్లి శ్రీసభ సంబంధించిన ఆధ్యాత్మికత, దైవీక జీవిత పుసహవాసము, దేవుని ప్రజల ఐఖ్యత అన్నీ కూడా ప్రభావి తమవుతాయి. దివ్యబలిపూజ నిర్వహణ ద్వారా మనం పరలోకపు విందును ముందస్తుగానే ప్రతి దినముచవి చూస్తున్నాము. ఈ దివ్యబలిపూజ ద్వారా పరలోకము భూలోకము ప్రభువు రొట్టెరస ఫలితముగా ఏకం అవుతున్నాయి.

## దివ్యసత్ప్రసాదం - నిర్వచనం

క్రీస్తు ప్రభువు ఎల్లప్పుడూ తన ప్రజలతో వాసం చేయాలని కడరాత్రి భోజన సమయాన ఈ దివ్యసంస్కారమును స్థాపించాడు. దానిని తన సిలువ మరణము ద్వారా పరిపూర్తిగా వించాడు. తన ప్రజల ఆధ్యాత్మిక ఎదుగుదలకు

ప్రతిదినము అప్పము మరియు ద్రాక్షరసములను తన శరీరరక్తముగా మార్చి ఒక పరలోక ప్రసాదముగా మనకు అందించు పరమ పవిత్ర సాంగ్యము సంస్కారము ఈ దివ్యబలిపూజ. దీనిని కృతజ్ఞత బలి అని కూడా పిలుస్తారు. ఎందుకనగా క్రీస్తు తన శిష్యులతో కడరా భోజన సమయాన - దీనిని నాజ్ఞాపకార్థముగా చేయుడు - అని వారికి ఒక ఆజ్ఞను అందించాడు. ఈ దివ్యసత్ప్రసాదమును ఒక ప్రామాణికమైన చర్యగా శ్రీసభ భావించింది. ఈ సంస్కారాన్ని తన ఉన్నతమైన బాధ్యతగా స్వీకరించి శ్రీసభ దానిని క్రీస్తు జ్ఞాపకార్థముగా చేయుటకు నిశ్చయించింది.

## దాటి పోవుట లేక విమోచనోత్సవము

పూర్వ నిబంధన గ్రంథములో నిర్గమకాండములో ఈ దాటిపోవుట (పాస్ఓవర్) అనుపదమునకు ఒక ప్రత్యేకత ఉంది. ఎందుకన ఇది ఇశ్రాయేలు ప్రజల బానిసత్వ పుసంకెళ్ల విమోచనకు సంకేతం. వారు దాటిన ఆసముద్రం, అంతకు ముందు రోజు వారు భుజించిన ఆ పాస్కాబలి రక్షణకు సూచికగా నిలుస్తుంది. దీనిని సత్ప్రసాదపు ఆకృతిగా, రూపికగా గుర్తించవచ్చు. నిర్గమ 12:23లో ఈ విధంగా చెప్పబడింది. ఆరోజు రాత్రి తండ్రి దేవుని మదిలో దివ్యసత్ప్రసాదం మెదిలింది. ఒక నిజమైన గొర్రెపిల్లగా కనిపించింది. దేవుడు చెప్పినట్లు, “రక్తాన్ని మీ ఇంటిగడపపై చూచినప్పుడు నేను మిమ్మల్ని దాటిపోవుదును, కావున మీరందరు రక్షింపబడుదురు.” ఈ అంశంపై శ్రీసభ గురువులు ఆశ్చర్యాన్ని వ్యక్తంచేశారు. ఎందుకన అలనాడు దేవదూత చూసినది మామూలు గొర్రెపిల్ల రక్తం కాదు అని, అది సాక్షాత్తు దేవుని పుత్రుడైన క్రీస్తురక్తమని వారు అభివర్ణించారు. పూర్వ గ్రంథాల్లో పాస్కావలి గూర్చి శ్రీసభ ఈ విధంగా గ్రహిస్తుంది: ఇది వర్ణింపసాధ్యం కాని ఓ పరమ రహస్యం! గొర్రెపిల్ల రక్తం ఈ విధంగా ఇశ్రాయేలీయుల రక్షణకు మూలకారణం అయిందో అదే విధంగా దాని రక్తం దేవదూతను మరింతగా భయపెట్టింది.

## పాస్కాబలి గురించి ద్వితీయోపదేశకాండంలో ప్రస్తావన

ఇశ్రాయేలీయులు ఆశ్చర్యపడే విషయం ఏమిటంటే వారు వాగ్దాన భూమిని ఆక్రమించుకోవడానికి నలువది సంవత్సరాల కాలంపట్టింది. అదే విధంగా

ఈ ప్రయాణములో వారునూతన నియమాలు స్వీకరించడం జరిగింది. అప్పుడు వారంతా వ్యక్తి గతంగా ఒక్కొక్కరుగా కాకుండా అందరూ కలసి సమిష్టిగా ఈ పాస్కాబలిని ఒక ఉత్సవముగా, విమోచన గుర్తుగా జరుపుకునే వారు. ద్వితీయోపదేశ కాండములో ఈ పాస్కాబలి గురించి మూడు సార్లు ప్రస్తావించబడింది. ఆ పాస్కాబలి నిర్వహణ తీరు గురించి, ఎలా జరుపుకోవాలి పాటించాలి అన్న అంశాల గురించి వివరించబడింది.

## ద్వితీయ ఉపదేశకాండం 16:2, 6-7

**మొదటిది:** ప్రభువు నియమించిన ఏకైక ఆరాధన స్థలమునందు మాత్రమే పాస్కాబలిని కొనియాడవలెను.

**రెండవది:** మీమందల నుండి కొని వచ్చిన బలిజంతువును వధింపుడు.

**మూడవది:** ఎన్నుకొనిన స్థలముననే బలి జంతువును వండి భుజింపుడు. ఆమరుసటి రోజు ప్రొద్దుననే మీ ఇండ్లకు వెళ్ళిపోవచ్చును.

పైన పేర్కొన్న భాగంలో ఇశ్రాయేలు ప్రజలు దేవుడు వారి యెడల చేసిన మేలులకు విమోచనకు గుర్తుగా త్యాగబలిని అర్పించారు. అది కూడా కేవలం యాజకులు మాత్రమే ఈ బలిని అర్పించేవారు. ఈ విధముగా నలువది సంవత్సరాలు ప్రయాణించి మరల వాగ్దాన భూమిలో ప్రవేశించాక ఈ బలి నిస్మరించినట్లు పేర్కొన్నారు. కావున ఇది నూతనత్యాగ బలికి ఒక సూచక క్రియగా ఉంద నిగ్రహించగలము.

## దివ్యసత్ప్రసాదం - ప్రాముఖ్యత

క్రైస్తవ దైవార్చనలో దివ్యసత్ప్రసాదం కేంద్రబిందువుగా చెప్పవచ్చు. క్రైస్తవులందరూ దీనిని ఒకస్మారక చిహ్నామని అంగీకరిస్తారు. ఇందులో అప్పము మరియు ద్రాక్షరసము సేవించుట ద్వారా ప్రభుక్రీస్తు అర్పించిన జ్ఞాపకార్థ బలిని శ్రీసభ స్మరించు కుంటుంది. దివ్యబలిలో పాల్గొనడం ద్వారా దైవప్రజలు క్రీస్తుతో మాత్రమే పరస్పరము అనగా ఒకరితో ఒకరు విశ్వాసుల సహవాసమును పంచుకుంటారు. అనేక క్రైస్తవ సంఘాలు కూడా దివ్యసత్ప్రసాదంలో క్రీస్తువాస్తవంగా ఉన్నారని బోధిస్తాయి. అయినప్పటికీ వారు ఆ ఉనికి యొక్క స్వభావం, స్థానం మరియు సమయం గురించి విభేదిస్తారు.

పరిశుద్ధ సత్ర్పసాదం కతోళికుల జీవితంలో కేంద్రము అని పునీత రెండవ జాన్ పౌలు పాపుగారు చెప్పారు. పవిత్ర సత్ర్పసాదం మన విశ్వాసానికి మూలం. దైవ ప్రసాద స్వీకరణ మనలను క్రీస్తుతో మరియు తన సంఘముతో ఐక్యతను పెంచుతుంది. ఈ దివ్యసత్ర్పసాదం మనజ్ఞానస్నానం మరియు ధ్రువీకరణ సంస్కారముల సమయంలో పొందిన పవిత్రాత్మను మనలో ఎల్లప్పుడూ స్థిరముగా ఉండునట్లుగా మనలను సంరక్షిస్తుంది. ఇది మనలను దాతృత్వంలో బలపరుస్తూ, పాపములను తుడిచి వేస్తూ భవిష్యత్తులో మహాపాతకముల నుండి మనలను కాపాడుతుందని వారుబోధించారు.

## మొదటి అధ్యాయము
## దివ్యసత్ర్పసాదం: చారిత్రక పురోగమనము

దివ్యసత్రసాదం ఒక పరమ రహస్యం. ఒకదైవ రక్షణ అనుగ్రహముగా మన్నింపు చర్యలలో, మానవ చరిత్రలో వాస్తవము గాక నిపించే విధంగా దేవుడు ఏర్పరచిన ఒక దైవ రహస్యం. నిజమైన చారిత్రక వాస్తవికతగా, దాని బాహ్య ఆకృతి చారిత్రాత్మకంగా ముఖ్యమైన భాగమై, అదివై విధ్యాలతో భాగస్వామ్యం చేయబడింది. శ్రీసభ చరిత్రలో నాటియుగము నుండి నేటికాలం వరకు దివ్యసత్ర్పసాదం కాలాను గుణంగా ప్రదేశాన్ని బట్టి రూపాంతరం చెందుతూ అనేక విధాలుగా మారుతూ ఒక పరమ రహస్యంగా ఇప్పటికీ కొనసాగుతుంది. ఇప్పుడు పవిత్ర గ్రంథములోని పాతనిబంధనలో, నూతన నిబంధనలో దివ్యసత్ర్పసాదం వృత్తాంతాన్నిపరిశీలిద్దాం.

### 1.1. పాతనిబంధన వృత్తాంతములు

పాతనిబంధనలో దివ్యసత్ర్పసాదం ఒక ఆకృతిగా ప్రదర్శింపబడింది. పాతనిబంధన మొత్తము కూడా ప్రభువుని కడన రాత్రి భోజనానికి ఒక సిద్ధపాటు అని భావించగలము. ఎందుకన, పాతనిబంధనలో ప్రభుకడగా భోజనాన్ని సూచించు ఆకృతులు కనిపిస్తాయి. అవి కూడా క్రీస్తుచే స్వయముగా స్మరింపబడినాయి. ఈ ఆకృతుల్లో మొదటిదిగా నిర్గమకాండము మరియు రెండవదిగా ద్వితీయోపదేశకాండములోని పాస్కా మరియు మన్నా యొక్క భాగాలు మరియు రొట్టెరసమును అర్పించిన మెల్కిసెదేకుని యాజకబలి

(ఆదికాండము 14:18; కీర్తన 110:4; హెబ్రీయులు7:1). ఇశ్రాయేలీయుల జీవితంలో పాస్కా ఒక ముఖ్యమైన పండుగ. ఇప్పుడు మనం పాతనిబంధనలో దివ్యసత్ప్రసాద ఆనవాళ్లను తెలుసుకుందాం.

**మలాకీ గ్రంథము**

క్రీస్తుకు కొన్ని శతాబ్దాలకు ముందు మలాకీ ప్రవక్త ఎరుషలేము దేవాలయంలో యావే దేవునికి అర్పించిన బలుల గురించి మరియు భవిష్యత్తులో రానున్న మెస్సయ్య అర్పించే అర్పణముల గురించి దేవుని ప్రవచముగా బహిర్గతం చేశాడు. "అయ్యో మీలో ఒకరు తలుపులు మూసివేసి మీరు నా పీఠముపై నిరుపయోగముగా నిప్పులను సిద్ధం చేయకుండునట్లు చేసినచో ఎంత బాగుండును! నాకు మీపై ప్రీతిలేదు. తూర్పు నుండి పడమర వరకు సకల జాతి ప్రజలు నన్ను గౌరవింతురు. వారు ఎల్లఎడల నాకు సాంబ్రాణి పొగవేసి నిర్మలమైన బలిని అర్పించుదురు" అని మలాకీ గ్రంథం 1:10-11 వచనాలలో చూడగలము.

పునీత ఇరేనియుసు గారి వేదాంతం ప్రకారంపై మాటల ద్వారా దేవుడు "పూర్వయూదులు దేవునికి బలి అర్పించడం మాని వేస్తారని, అలాగే ప్రతిచోటా దేవునికి పవిత్రమైన బలులు అర్పింపబడతాయని, తద్వారా దేవుని నామము అన్ని దేశప్రజల మధ్య మహిమ పరచబడుతుందని సెలవిచ్చారు." మలాకీ ప్రవక్త దేవాలయంలో అర్పించే బలుల స్థానంలో కడరా భోజనాన్ని బలిభోజనముగా సమర్పిస్తారని ముందుగానే ప్రవచించాడు.

## 1.2. నూతననిబంధనలో కడరాత్రి భోజనం ప్రస్తావనలు

దివ్యసత్ప్రసాదం యొక్క ప్రస్తావన నూతననిబంధనలో స్పష్టంగా కనిపిస్తుంది. ఇది కడరాత్రి భోజన ప్రస్తావన యొక్క ప్రధాన వనరుగా చెప్పవచ్చు. పాస్కా పండుగ మాదిరిగానే ప్రభువు తన తండ్రికి కృతజ్ఞతా పూర్వకంగా సమర్పించడం చూడగలము. దీనిని గురించి మూడు సువార్తలలో మరియు ఒక లేఖలో క్రింది విధంగా పేర్కొనడం జరిగింది.

**మత్తయి 26:26-28**

వారు భుజించుచుండగా యేసు రొట్టెను అందుకొని ఆశీర్వదించి త్రుంచి

తన శిష్యులకు ఇచ్చుచు, దీనిని మీరు తీసుకొని భుజింపుడు, ఇది నా శరీరము అనెను. తరువాత పాత్రమునందుకొని, కృతజ్ఞతా స్తోత్రములు చెల్లించి, వారికి ఇచ్చి ఉదీని లోనిది మీరు అందరు త్రాగుడు. ఇది అనేకుల పాపపరిహారార్థమై చిందబడనున్న నిబంధన యొక్క నా రక్తము.

**లూకా 22:19-20**

యేసు రొట్టెను అందుకొని కృతజ్ఞత స్తోత్రములు చెల్లించి, దానిని తృంచి వారికి ఒసగుచు ఇది మీ కొరకు అర్పింపబడునున్న నా శరీరము. దీనిని నాజ్ఞాపకార్థము చేయుడు అనెను. అట్లే భోజనానంతరము పాత్రమును అందుకొని ఈ పాత్రము మీ కొరకు చిందబడు నా రక్తములో ముద్రితమైన నూతన నిబంధన అని చెప్పెను.

**మార్కు 14:22-24**

వారు భుజించుచుండగా యేసు రొట్టెను అందుకొని, ఆశీర్వదించి, తృంచి, తన శిష్యులకు ఇచ్చుచు "దీనిని మీరు తీసుకొని భుజింపుడు, ఇది నా శరీరము" అని చెప్పెను. తరువాత ఆయన పాత్రమునందుకొని కృతజ్ఞతా స్తోత్రములు చెల్లించి వారికి అందించెను. దాని నుండి వారందరూ త్రాగిరి. ఏసువారితో "ఇది అనేకుల కొరకు చిందబడునున్న నిబంధన యొక్క నా రక్తము" అనెను.

**1 కొరింతీ 11:23-25**

తాను అప్పగింపబడిన రాత్రి, ప్రభువు రొట్టెను తీసుకొని, దేవునకు కృతజ్ఞతలు అర్పించి, దానిని తృంచి, "ఇది మీ కొరకు ఇవ్వబడిన నా శరీరము. దీనిని నాజ్ఞాపకార్థము చేయుడు'' అని పలికెను. అదే విధముగా భోజనానంతరము పాత్రను అందుకొని, "ఈ పాత్ర నా రక్తములో నూతన నిబంధన. దీనిని మీరు పానము చేయునప్పుడల్లా, నాజ్ఞాపకార్థం చేయడు" అని పలికెను.

అయితే దివ్యసత్ప్రసాదమును ప్రాథమిక మూలంగా ఏసుప్రభు కడరాత్రి విందును ప్రధమంగా పునీత పౌలు ప్రస్తావించాడు. ఆనాటి కొరింతు సంఘమును ఉద్దేశించి, వారు ఏ విధంగా ప్రభుని భోజనమును స్మరించుకోవాలో ఆ కొరింథీయుల లేఖలో క్లుప్తంగా ప్రస్తావించాడు. అటు తరువాతనే సువార్తలలో భోజనం ప్రస్తావనను మనము చూడగలం.

## 1.3. యుగాల నుండి కడల భోజనం యొక్క పరిణామం

తొలి క్రైస్తవులు కడప భోజనాన్ని క్రమం తప్పకుండా జరుపుకునే వారని మనకు స్పష్టం అవుతుంది. వాస్తవముగా ఈ ఆచారం ఆనాటి స్థానిక శిష్యుల సమూహం యొక్క సాధారణ భోజనం యొక్క పునరావృతం. ఈ ఆచారంలోని రొట్టె మరియు కప్పు ఏసుప్రభుని ఉనికిని సూచిస్తుంది. పునీత పౌలుగారి పత్రిక మొదటి లేఖలోని ఆదేశాల ప్రకారము ఆనాటి ప్రజలు కడరాత్రి భోజనమును సాధారణ భోజనంతో కలిపి కొన్ని దుర్వినియోగాలకు పాల్పడ్డారని తెలియజేస్తున్నాడు. అది త్రాగుడు మరియు తిండి బోతుల యొక్క సందర్భంగా తయారయింది అని కూడా మనకు తెలుస్తుంది. వీటిని సరిదిద్దటానికి పౌలుగారు ఉద్దేశ్యము, దాని వివరణ ప్రభువు నిత్యాగ సంస్కార ఆచారముగా గుర్తు చేసుకొని పునఃస్థాపించాడు.

రెండవ శతాబ్దము చివరిలో ప్రభువుని భోజనం పనికి రానిదిగా వదిలివేయబడింది. అప్పట్లో ప్రభుభోజనం వాస్తవానికి ప్రతి ఆదివారం జరుపుకునేవారు. కానీ నాలుగవ శతాబ్దం నాటికి ప్రతి రోజు జరుపుకునేవారు. ప్రభు భోజనం యొక్క సంస్మరణం, దాని వాడుక నియమాలు, గ్రంథ పఠనాలు, కీర్తనలు, ప్రార్థన క్రమంగా ఏర్పాటు చేయడం జరిగింది. ఆనాటి ఆచారంగా మొదలై నేడు వ్యక్తిగత సంఘాలకు మించి విస్తరించి ప్రపంచం మొత్తం కూడా శ్రీసభ ప్రతిమను కలిగి ఉంది.

కానీ మూడవ మరియు నాలుగవ శతాబ్దాలలో రోమునగగ సందర్శనలు భాగంగా పాపుగారితో మేత్రాణులు అందరూ కలిసి సమిష్టి పూజ చేసే వారుగా రోమునగర చరిత్రలో మనకు కనిపిస్తుంది. ఇప్పుడు దివ్యసత్ప్రసాదం ఏ విధంగా లేఖల ద్వారా, బోధనల ద్వారా, రూపాంతరం చెందిందో మనం పరిశీలిద్దాం.

### అపోస్తులుల బోధనల గ్రంథం

శ్రీసభ సభ్యులు పెరిగే కొద్దీ యూదయ మతం తక్కువ శాఖగా మారింది. మరియు శ్రీసభ దాని సొంతగుర్తింపును పొందడం ప్రారంభించింది. చట్ట బద్ధమైన గ్రంథాలు పూర్తి చేయబడి, పంపిణీ చేయబడి ఉన్నందున, క్రైస్తవులు లేఖలు రాయడం మానుకోలేదు గాని, అనేకరకమైన ఆసక్తి కరమైన రచనలను

రూపొందించడం ప్రారంభించారు. 19వ శతాబ్దంలో ఈ సంపుటలలో పురాతనమైనది ఒకటి కనుగొన బడింది. దీనిని 12 మంది అపోస్తలల బోధన లేదా  దిడాకె అని పిలుస్తారు. ఆ తర్వాత రెండవది కనుగొన బడిన తర్వాత అది మొదటి దానికి మరింత దగ్గరగా ఉన్నట్లు అనిపించింది.

ఆ గ్రంథంలో బప్తిస్మ సత్యోపదేశాన్ని గుర్తించారు. కానీ దీని రచయితలు పాస్కా పండుగను ప్రభు భోజనం దృఢంగా ప్రస్తావించారు. ఈ ప్రార్ధన గ్రంథాలు అన్ని భద్రపరచబడ్డాయి మరియు అవి ఆధునిక కృతజ్ఞతార్చన ప్రార్థనల మాదిరిగానే ఉన్నాయి. ఇప్పుడు చూద్దాం.

**అపోస్తులుల బోధనప్రతి: 9 అధ్యాయము**

9:1 – కానీ ప్రభు భోజన స్మరణమున కృతజ్ఞతలు చెల్లించి...

9:2 – మొదటకప్పు గురించి మా తండ్రి, నీ కుమారుడైన ఏసుక్రీస్తు ద్వారా నీవు మాకు తెలియజేసిన నీ కుమారుడైన దావీదు పవిత్ర ద్రాక్షవల్లిని బట్టి నీకు కృతజ్ఞతలు తెలియజేస్తున్నాము. నీకు ఎప్పటికీ కీర్తి.

9:3 – మరియు విరిగిన రొట్టెను గూర్చి మా తండ్రి నీ కుమారుడైన యేసు క్రీస్తు ద్వారా మాకు తెలియజేసిన జీవితము మరియు జ్ఞానం కోసం మేము మీకు కృతజ్ఞతలు చెల్లించుచున్నాము. నీకు ఎప్పటికీ కీర్తి.

9:4 – ఈ విరిగిన రొట్టె ఒకసారి పర్వతాల మీద చెల్లా చెదరుగా ఉండి మరల అది ఒక చోటచేర్చబడిన విధంగా నీ శ్రీసభ భూమ్మీద చివరి అంచుల నుండి నీ రాజ్యం వచ్చు వరకు నిలిచి ఉండును. ఏసుక్రీస్తు ద్వారా మహిమయు శక్తియు ఎప్పటికీ నీవే.

9:5 – ప్రభువు నామంలోకి జ్ఞానస్థానం పొందినవారు తప్ప మరెవ్వరు కూడా ఈ దివ్యభోజనమును తినకూడదు మరియు త్రాగకూడదు.

దీని ద్వారా మన కుమూడు విషయాలు తెలుస్తున్నాయి. మొదటిది, ప్రభు భోజనం అందరికీ ఇచ్చేవారు కాదని తెలుస్తుంది, రెండవది, వధింపబడిన శరీరము ప్రజల దికాదని చెప్పబడటం. మూడవది, అప్పట్లో ఆచారంతో ప్రభువు భోజనం సంబంధం ఉన్నట్లుగా కనిపిస్తుంది.

అదే విధంగా రెండవ గ్రంథములో ప్రభు భోజనం ఆధ్యాత్మిక ఆహారముగా మరియు ఆధ్యాత్మిక పానీయంగా ఉన్నట్లు రెండవ ప్రార్ధన సూచిస్తుంది. ఇది

యేసును ప్రజల హృదయాలకు మరింత సమీపంగా చేస్తుంది. ప్రభువుని రెండవ రాకడను, అంతిమ తీర్పు, అంతిమ ఆగమనం గురించి ఈ 10వ అధ్యాయము తెలియజేస్తుంది.

10:3 – నీవు సర్వశక్తిమంతుడైన దేవుడవు నీ నామ మహిమార్ధము నీవు అన్నింటిని సృష్టించావు. నీకు కృతజ్ఞతలు తెలుపుట కొరకు శరీరం మరియు నీటిని అనుగ్రహించావు. నీకు మారుని ద్వారా నిత్యజీవం పొందుటకు ఆహారాన్ని జీవజలమును ప్రసాదించావు.

10:6 – మీ దయమాపై కురిపించండి. ఈ లోకం గతించును. దావీదు కుమారుని హొసన్న, ప్రభువు నామమున వచ్చేది వారు ధన్యులు. పవిత్రత లేని వారు పశ్చాతాప పడండి. రండిదేవా. ఆమెన్.

అపోస్తులుల బోధన గ్రంథం ప్రకారం త్యాగబలి గురించి మరియు జ్ఞాపకార్థం గురించి ప్రస్తావించ లేదు. మరియు పాస్కాబలి గురించి గానీ, గొర్రెపిల్ల గురించి మాట్లాడలేదు. కానీ అలనాటి ఆచార సాంప్రదాయాలు ఏ విధంగా ఉన్నాయో ప్రస్తావించింది.

**పునీత జస్టిన్ (క్రీ.శ.100–165)**

రచయిత జుస్టిను ప్రభుని కడరా భోజనం గురించి అతని లేఖలలో ప్రస్తావించాడు. ప్రభు భోజనం మరియు ఆరాధన యొక్క సారూప్యతను గుర్తించాడు. గుర్తించడమే కాకుండా రహస్య ఆరాధనను అతడు ఖండించాడు. అప్పట్లో అతడు ఈ విధంగా పేర్కొన్నాడు: శ్రీసభ ఆలోచనలు మార్పురావడం ప్రారంభించింది, శ్రీసభతన ఆచారాల సంప్రదాయాల విషయాల్లో పరివర్తన చెందింది.

అతడు ఈ విధంగా చెప్పుకొచ్చాడు: 'మేము వీటిని సాధారణ రొట్టె మరియు సాధారణ పానీయంగా పొందలేము. కానీ మన రక్షకుడైన ఏసుక్రీస్తు వాక్కు ద్వారా శరీరాన్ని పొంది, మన రక్షణ కోసం, శరీరము మరియు రక్తాన్ని కలిగి ఉంది. ప్రభువు నివాక్యము యొక్క ప్రార్థన ద్వారా ఆశీర్వదింపబడిన రొట్టె మరియు రసము పరివర్తన ద్వారా రొట్టె శరీరముగా, రసము రక్తముగా మనకు అందించబడుతుంది'.

## నైజీయా సమితి – మత విషయ సమాలోచన

నాలుగవ శతాబ్దం ప్రారంభమైనప్పుడు శ్రీసభ మతపెద్దలు ప్రభుభోజన ఘట్టమును విశ్వవ్యాప్తంగా పునరావృతమయ్యే త్యాగబలిగా భావించడం మొదలు పెట్టారు. దేవుడి దయవలన క్రీస్తులో కనుగొనబడిన రక్షణకార్యం శ్రీసభ ద్వారా నెరవేర్చబడింది అనుసందేశాన్ని విశ్వవ్యాప్తంగా విస్తరింపజేశారు. నాలుగవ శతాబ్దం ప్రారంభమైన తర్వాత అందరూ కడరాత్రి భోజనాన్ని క్రీస్తు ప్రభువుని కలువని త్యాగబలిగా ప్రధాన వేదాంత శాస్త్రజ్ఞులు అభివర్ణించారు. అదే సత్యమును విశ్వమంతా విశ్వసించేలా ప్రకటించారు.

అటు తరువాత చాలా మంది ఉపగురువులు పూజను సమర్పించుకున్న ఆ యొక్క అప్పమును ద్రాక్షరసమును, గురువులకు అందించడాన్ని చాలా మంది తిరస్కరించారు. లేవీయులు రొట్టెను ద్రాక్షరసమును బల్లపై ఉంచడం, దానిని తీసుకెళ్లి దేవునికి అర్పించడం చూసాము. కానీ వారు ఆ విధంగా అర్పించిన తర్వాత వారు ప్రార్థనలు చేయడము, ఆ తర్వాత దేవుడు వారిని స్వీకరిస్తున్నారు. అదే విధంగా ప్రార్థన చెప్పడం ద్వారా క్రీస్తు శరీరరక్తాలుగా అప్పరసములు మారుతున్నయి అని విశ్వసించారు.

### నాలుగవలాతరను మహాసభ

కాలము గడిచేకొద్దీ 13వ శతాబ్దంలో శ్రీసభ దివ్యసత్ప్రసాదం పైన లోతైనభావాలు కలిగిన సిద్ధాంతాలను రూపొందించాలని అది అత్యంత ఆవశ్యకత అని భావించింది. అది నాలుగవ లాతరను మహాసభ ద్వారా 1215 సంవత్సరములో అంత రపరిణామం అను సిద్ధాంతాన్ని ప్రతిపాదించింది. దీనిని గురించి ఫిలిప్పు ఈ విధంగా చెప్పుకొచ్చాడు.

ఆ అంతర పరిణామం నిర్వచనం ఇది: క్రీస్తుని యొక్క దివ్యశరీరం దివ్యరక్తము నిజముగా రొట్టెరసరూపములలో కలిగి ఉన్నాయి. దివ్యసంస్కారమైన దివ్యసత్రసాదములో ఇమిడి ఉన్నాయి, అవి దేవుని దివ్యశక్తి ద్వారా అంతర పరిణామం చెందుతాయి, కానీ మనకంటికి సాధారణంగా కనిపించిన రొట్టెరసములలో క్రీస్తు శరీరము రక్తము దాగి ఉన్నాయి.

ఈ నూతన సిద్ధాంతం యావత్తు శ్రీసభ రూపు రేఖలను మార్చివేసింది. పునీత తోమాసు అక్వినాసు కూడా ఈ విధంగా పేర్కొన్నారు: "ఈ అంతర పరిణామం కేవలం పవిత్రీ కరణ సంస్కారం యొక్క ప్రార్ధనను స్పష్టంగా వల్లించడం ద్వారా మాత్రమే సాధ్యమవుతుందని, మార్పు అనేది అంతర్లీనంగా జరుగుతుందని, రొట్టెరసములు నిజమైన క్రీస్తు శరీర రక్తములు".

## 1.4. ముగింపు

మొదటి అధ్యాయంలో మనము దివ్యసత్ర్పసాదము యొక్క పరిణామం నిర్వచనం ప్రాముఖ్యత మరియు యుగాల నుండి ఏ విధంగా నిర్వహింపబడింది అనువిషయాలను పరిశీలించాము. ఇప్పుడు రెండవ అధ్యాయంలో అందరి చేత విశ్వసింపబడిన దివ్యసత్ర్పసాదము ఎందుకు ప్రొటెస్టెంట్సంఘాల ద్వారా వ్యతిరేకింపబడింది, దాని మూలాలు కారణాలు తెలుసుకుందాం. అలాగే వారు ఎందుకు దివ్యసత్ర్పసాద ఉనికిని ప్రశ్నించారు, వాటికి కతోలిక సమాధానాలు ఏమిటి అని పరిశీలిద్దాం.

# రెండవ అధ్యాయము

# దివ్యసత్ర్పసాదము - చారిత్రక సంస్కరణము

చరిత్రలో సంస్కరణము ఒకమైలురాయిగా పరిగణింపబడుతుంది. ఇది శ్రీసభ చరిత్రలో కేవలము ఒక సంఘటన మాత్రమే కాదు. ప్రొటెస్టెంటు వారి వేదాంతశాస్త్రం యొక్క ఆవిర్భావం కూడా. ఈ సంస్కరణము 16వ మరియు 17వ శతాబ్దంలో ఐరోపాలో సామాజిక మరియు రాజకీయ వాతావరణంలో విప్లవాత్మక మార్పులను తీసుకొనివచ్చింది. మొదటి శతాబ్దము నుండి ఒకే ఒక్క శ్రీసభగా ఉన్న సంఘం ఇప్పుడు ఎన్నో సంఘాలుగా ఏర్పడింది. దీనికి కారణం ఏమిటి? ఈ సంఘ విభజన ఎక్కడమొదలైంది? ప్రొటెస్టెంటు సంఘము కతోలిక సంఘము నుండి ఎందుకు విడిపోయింది? విభేదించిన వారి విశ్వాసం ఏమిటి? ఎందుకు వారు దివ్యసత్ర్పసాదమును విశ్వసించినప్పటికీ కొన్ని విషయాలలో వారు విముఖతను చూపిస్తున్నారు? ఈ ప్రశ్నలకు సమాధానమును ఈ అధ్యాయములో కనుగొనడానికి ప్రయత్నిద్దాం.

## 2.1. దివ్యసత్ప్రసాద సంస్కరణ: కారణాలు మరియు మూలాలు

సంస్కరణ యొక్క ఆలోచనలు మరియు దానిమూల కారణం అలనాటి రాజకీయము మతపరమైనటు వంటి స్వభావంతో కప్పి వేయబడడం. ఇది కతోలిక శ్రీసభలో మార్పుకోసం పెద్దఎత్తున సంస్కరణకు మరియు సంస్కరణ పిలుపుకు దారి తీసింది. అలనాటి సంస్కరణ యొక్క మూలాలను మూడు విధాలుగా అర్థం చేసుకోవచ్చు.

### మొదటిది, మతాధిపతుల పాత్ర

సంస్కరణ పిలుపు జర్మనీలో ప్రారంభమైంది. అక్కడ మతాధికారులు వారికి కేటాయించిన సంబంధిత కార్యాలయాలలో లేకపోవడం మరియు మతాధికారులను వారికి ఇష్టం వచ్చినట్లు భారీగా భర్తీచేయడం, అధిక మొత్తధనానికి స్థలాలను కేటాయించడం మొదలైన పరిస్థితులు సంస్కరణకు దారితీసాయి. ముఖ్యముగా సావోయికు చెందిన డ్యూక్ అమేడియస్ అనువ్యక్తిని పాపుగారిగా సొంతకొడుకుని ఎన్నుకోవడం, అతడు రాజకీయ మరియు మతపరమైన అధికారాన్ని పొందడానికి దారి తీసిన కారణాలు జర్మనీలో సంస్కరణకు మూలకారణాలుగా మారాయి. మతాధికారులు నిజాయితీగా ఉండకపోవడాన్ని ఆనాటి జనులు తీవ్రంగా విమర్శించారు.

### రెండవది, మతాధికారుల అనైతికత

శ్రీసభలో మరియు మతాధికారుల స్థాయిలో నైతికప్రమాణాలు లోపించడం వలన సమాజంలో నైతిక ప్రమాణాల తిరోగమనానికి దారితీసింది. ఇటువంటి అవినీతికి జగద్గురువుల యొక్క రాజకీయ ఆకాంక్షలు కూడా మద్దతు ఇచ్చాయి. తద్వారా అధిక మోతాదులో అవినీతి జరిగింది. దైవ ఆరాధనపై పన్నువిధించారు. జర్మనీలో మరియు ఫ్రాన్సు దేశంలో దశమ భాగం పనులు కూడా విధించారు. అంతేకాకుండా పాప సంకీర్తన చేయుటకు మరియు సంఘశుద్ధికరణకు, రక్షణకు, పునీత పేతురుగారి గృహదేవాలయ నిర్మాణం కొరకు పన్ను విధించడానికి ప్రజలు తీవ్రంగా వ్యతిరేకించారు. ఇవన్నీ కూడా సంఘ సంస్కర్తల వ్యతిరేక విధాన ప్రవర్తన కుమూల కారణాలు.

## మూడవది, మధ్యయుగంలో శ్రీసభ

కతోలిక శ్రీసభ 14 మరియు 15వ శతాబ్దాలలో ఆధ్యాత్మిక నాయకత్వం అందించడంలో విఫలమైంది. దీని మూలంగా సంస్థాగత సమస్యలు అంతర్గత సమస్యలు ఎదురయ్యాయి. ఆనాటి సమకాలిన రచనలు సందేహం లేకుండా మతపరమైన అవినీతి మరియు అసమర్ధత చేతకానితనం ఏ విధంగా వేగంగా పెరిగిపోతున్నాయో ఆస్థితిగతులను బహిర్గతం చేశాయి. వ్యక్తిగత భుక్తి కోసం విశ్వాసుల కోర్కెలను తీర్చడంలో శ్రీసభ అధికారులు తమ అసమర్ధతను చూపించారు. ఆర్థిక మార్పులు మరియు భూస్వామ్య సంక్షోభం శ్రీసభ యొక్క ఆర్థిక భారానికి కారణమైంది. జగద్గురువులపై అతని అధికారంపై పెరుగుతున్న విమర్శలకు దారి తీసిన ముఖ్యమైన కారణాలలో ఇది ఒకటి. ముఖ్యంగా మధ్యయుగంలో శ్రీసభ అత్యంత వివాదా స్పదమైనవి ప్రత్యేక దీవెనలు. శ్రీసభ ఆదీవెనలను ఆశీర్వాదములను అమ్మడం, పాపమన్నింపు కార్డులను మొదలైన వాటి ద్వారా శ్రీసభ సంపదను ప్రోగుచేసుకుంది. మతాధికారుల మధ్యవ్యత్యాసాలు ధనికులంటూ పేద గురువులంటూ శ్రీసభ పరిస్థితి అస్తవ్యస్తంగా మారింది. అందువలననే మధ్యకాలం సంస్కరణకు దారి తీసింది. అదే విధంగా శ్రీసభ సామాజిక రాజకీయ విషయాలలో మాత్రమే కాకుండా పవిత్రమైన దివ్యసంస్కారాలు జ్ఞానస్నానము మరియు దివ్యసత్ర్ప సాదానికి సంబంధించిన విషయాలలో కూడా మార్పుకు దారి తీసింది.

## 2.2. దివ్యసత్ర్పసాదం - సంస్కరణ పురోగమనం

శూన్యము నుండి సంస్కరణ పుట్టలేదు. 14వ శతాబ్దపు చివరిలో మొదలైన జాతీయవాదం, వర్తకవాదం, మతాధికారుల వ్యతిరేకవాదం, శ్రీసభ చేతుల్లోని స్వార్థం, ప్రయోజనాలకు వ్యతిరేకత. ఇటువంటి ప్రవాహాల ద్వారా సంస్కరణ ప్రారంభమైంది, కాలాను గుణంగా పెరుగుతూ వచ్చింది. పవిత్ర బైబులు గ్రంథ బోధనలకు మరలి రావాలని పిలుపు నిచ్చిన వారిలో ముందుగా జాన్ విక్లిఫ్ మరియు జాన్ హుస్ ఉన్నారు.

అది 1517. అప్పుడే సంస్కరణకు పునాదులు వేయడం ప్రారంభమైంది. మత గురువు అయిన మార్తిను లూథరు, విశ్వవిద్యాలయ ఆధ్యాపకుడు. ఆయన

శ్రీసభ నైతికతకు వ్యతిరేకంగా 95 సిద్ధాంతాలను తయారుచేసి విట్టెంబరి దేవాలయ ద్వారమునకు అంటించాడు. వాటియొక్క ప్రధాన ఉద్దేశం, శ్రీసభ తనను తాను నూత్నీకరణ చేసుకోవాలి లేదా సంస్కరించుకోవాలి. ఏసు క్రీస్తుపై వ్యక్తిగత విశ్వాసం మరియు దేవుని కృప ద్వారా మాత్రమే విశ్వాసులు రక్షింపబడతారని ఆయన బలమైన అభిప్రాయం. పుణ్యక్షేత్ర యాత్రలు పాపమన్నింపు పొందుటకు డబ్బులు వెచ్చించడం మరియు పునీతుల సహాయం కొరకు ప్రార్థించటం, వీటిని అన్నిటిని ఆచరిస్తున్న ఒక అనైతిక సంఘంగా అతడు పరిగణించాడు.

అలాగే దివ్యబలిపూజలో అప్పద్రాక్ష రసములు ప్రభుక్రీస్తు శరీర రక్తములుగా మారతాయి గానీ అందులో క్రీస్తు ప్రభువు కలకాలము ఉండడు అని అతడు వాదించాడు. ఆయన వాదనలు ఐరోపాలోని విశ్వాసులను వాస్తవంగా ప్రభావితం చేశాయి. చాలా మంది దివ్యసంస్కారాలను వ్యతిరేకించారు. తిరుగుబాటు చేశారు. అనేకమంది శ్రీసభను నిరాకరించి వెళ్లిపోయారు. వారు ఎందుకు శ్రీసభ నుండి వెళ్లిపోయారో, దివ్యసత్రసాదాన్ని ఎందుకు వారు వ్యతిరేకించారో చరిత్రపుటల ద్వారా గ్రహించుదాం.

## 2.3. దివ్యపూజబలి - వివాదం మూలములు

క్రీస్తుని కడరా భోజనం అయినటు వంటి దివ్యపూజ కతోలిక శ్రీసభలో ప్రథమ స్థానమును ఆక్రమించి ఉంది. 11వ శతాబ్దం చివరినాటికి శ్రీసభ సభ్యులందరూ కూడా దివ్యసత్వసాద ఆరాధన చరిత్రలో క్రొత్తశకం లోనికి ప్రవేశించారు. అప్పటి వరకు కతోలిక విశ్వాసంలో క్రీస్తు ప్రభువుని ఉనికిని సహజంగా తీసుకున్నారు. మరియు సత్ప్రసాదాన్ని దేవాలయాల్లో మరియు కతోలిక సంస్థలలో సాధారణంగా భద్రపరచేవారు. మధ్యయుగము నుండి ఆరాధన దైవార్చన శ్రీసభలో ఒక కేంద్రంగా మారింది.

8వ శతాబ్దం వరకు తూర్పు మరియు పశ్చిమ దేశాల దేవాలయాన్ని మధ్యయుగంలో రక్తంచిందించబడని దివ్యబలిపూజ విధానములు అంగీకరించాయి. తూర్పుభాగంలోని విశ్వాసులు రొట్టె మరియు ద్రాక్షరసములో క్రీస్తు శరీరం మరియు రక్తం ఎలా ఉంటాయో నిరూపించడానికి ఎక్కువ

కృషిసల్పాయి. పశ్చిమ భాగంలోని విశ్వాసులు అగుస్తీను వారి రచనల ద్వారా చాలా వరకు ప్రభావితం చెందారు. తొమ్మిదవ మరియు 16వ శతాబ్దంలో క్రీస్తు శరీరరక్తమును గురించి మూడు వివాదాలు వెలుగు లోనికి వచ్చాయి.

## మొదటి వివాదం

మొట్టమొదటగా 833 సంవత్సరములు క్రీస్తు పవిత్ర శరీర రక్తముల గురించి వివాదం ఏర్పడింది. కోర్బేయొక్క మఠాధిపతి అయిన పాస్కాసియుస్ రాడ్ బెర్తుస్ రచించిన "ఆఫ్ ది బాడి అండ్ బ్లడ్ ఆఫ్ ది లార్డ్" గ్రంథములో క్రీస్తుప్రభువు యొక్క దివ్యసత్ప్రసాద ఉనికిని బాగా వివరించాడు. ఈ సిద్ధాంతం ప్రకారం మరియు ద్రాక్షరసంలో క్రీస్తు యొక్క నిజమైన ఉనికిని వివరిస్తుంది ఈ పుస్తకం. మరియు ఈ మూలకాలు భౌతికంగా పరిశుద్ధ మరియ తల్లి నుండి పుట్టినవి మరియు క్రీస్తుప్రభువు యొక్క శరీరరక్తాలుగా మారతాయి అని అతడు ప్రస్తావించాడు.

మఠాధిపతి అయిన రాబర్ట్సు ఆధ్వర్యంలోని సన్యాసులలో ఒకరైన రాత్రాకీనుస్ గారు ప్రభువుని "నిజమైన ఉనికిని" ఖండించాడు. పునీత అగుస్తీని వారి ప్రతికాత్మక దృక్పథాన్ని ప్రతిధ్వనిస్తూ విశ్వాస గ్రహింపు ద్వారా మాత్రమే అప్పరసాలలో పవిత్రమైన క్రీస్తు శరీరరక్తాలను గుర్తించ గలమని, ఇవి ఆబ్జెక్టివ్ అనగా బాహ్యంగా మార్పు లేకుండా ఆధ్యాత్మిక ప్రభావం కలిగి ఉంటాయని అప్పద్రాక్షరసాలు అనేవి క్రీస్తుశరీరం మరియు రక్తాన్ని సూచించే చిహ్నాలు మాత్రమే అని ఆయన వాదించాడు.

## రెండవ వివాదం

11వ శతాబ్దం మధ్యకాలం నాటికి రాబర్ట్సు రచనలు విస్తృతంగా ఆమోదింపబడ్డాయి. కానీ బెరెన్‌గర్‌గారు మాత్రం అతడు ప్రతిపాదించిన సత్యాలను సిద్ధాంతాలను తీవ్రంగా నిరాకరించాడు ఖండించాడు. బెరెనుగారు ఆయన చేసిన ప్రతి వాదనలకు పాపుగారైన రెండవ నికోలస్ మరియు రోంనగర మత విషయసమ లోచన సమితి సభ్యులు కతోలిక సిద్ధాంతాలకు లొంగిపోయి పవిత్రమైన దివ్యసత్ప్రసాదం ఒక దివ్యసంస్కారము మాత్రమే కాదు, అది నిజమైన ఏసుక్రీస్తు శరీరరక్తాలు అనునిజాన్ని చెప్పించాలని ప్రయత్నించినా, బెరెన్‌గర్ ప్రభుని యొక్క నిజమైన ఉనికి వాస్తవం కాదని ప్రబోధించడం కొనసాగించాడు.

12వ శతాబ్దంలో పీటర్ లొంబార్డ్, ఏది ఏమైనా ఈ అప్పద్రాక్షరసములో క్రీస్తు నిజముగా ఉన్నాడు అను సిద్ధాంతాన్ని వివరించి, అందులోని లోపాలను సవరించాడు. 1215 నాటికి అప్పద్రాక్షరసాలు క్రీస్తుప్రభువుని శరీర రక్తాలుగా అంతర్పరిణామము చెందుతున్నాయని ఏర్పడింది.

## మూడవ వివాదం

15వ మరియు 16వ శతాబ్దాలలో దివ్యసంస్కార వ్యవస్థ శ్రీసభలు క్రమంగా వేదాంత క్రమములో రూపొందించబడింది. శ్రీసభ ఏడు దివ్యసంస్కారాలపై పూర్తి వివరణను రూపొందించి వాటిని సంస్కారాలుగా స్థిరపరచింది. 15వ శతాబ్దంలో సంస్కరణ సమయంలో మూడవ దివ్యసత్ప్రసాద వివాదం తలెత్తింది. దీనిని వ్యతిరేకించిన అధికారులు మార్టిన్ లూథార్ క్యాల్విన్, జ్వింగ్లీ ఈ ముగ్గురిలో జుంగ్లి ప్రతిపాదన దివ్యసత్ప్రసాదానికి వ్యతిరేక వాదన. శ్రీసభ సిద్ధాంతమైన అంతర్పరిణామము అత్యంత సవాలుగా మారింది. అయితే లూథర్‌ద్వి పదార్ధ సంఘటి తసహజీవన సిద్ధాంతం అంతర్పరిణామ సిద్ధాంతానికి దగ్గరపోలిక కలిగి ఉంది. కానీ ఆయన ప్రతిపాదించిన సిద్ధాంతం కతోలిక శ్రీసభ సిద్ధాంతానికి వ్యతిరేకమైంది. ఇదిలా ఉండగా క్యాల్విన్ మాత్రము సంస్కరణ సమయములో దివ్యసత్రసాదము యొక్క ఉనికిని మరియు క్రీస్తు శరీరరకాలుగా రూపాంతరం చెందడాన్ని రెండింటిని ఖండించాడు.

ఇప్పుడు మనం సంస్కరణకు మూలకారకులైన ఆ ముగ్గురి యొక్క దివ్యసత్ప్రసాద సిద్ధాంతాలను, వారి ఆలోచనలను వివరంగా తెలుసుకుందాం.

## 2.4. దివ్యసత్రసాద వేదాంతం - ప్రొటెస్టెంటు సంస్కర్తల అభిప్రాయం

సంస్కర్తల ఆలోచన ప్రకారం భోజనం లేదా దివ్యసత్ప్రసాదం అనేది కతోలికులను ఆధ్యాత్మికంగా పోషించే ఒక దివ్యభోజనం మరియు క్రీస్తుతో వారి ఐక్యతను బలపరచే ఒక దివ్యసంస్కారం. దివ్యసంస్కారం యొక్క బాహ్యామైన లేక భౌతికమైన చర్య ఏమిటంటే: అప్పమును భుజించడం మరియు ద్రాక్షరసమును పానము చేయడం. శ్రీసభ అధికారిక ప్రకటన ప్రకారం క్రీస్తుప్రభువుని శరీరముగా రక్తముగా మారతాయని బోధిస్తుంది. కానీ సంస్కర్తలైన లూథర్, కాల్విన్, జింగ్లీ ప్రకారం క్రీస్తుయొక్క శరీరరక్తాలను నోటితో భౌతికంగా

తినడంలో క్రీస్తు సన్నిధి ఉంటుందని, అంతేకానీ అప్పరసాలలో క్రీస్తు శాశ్వతంగా నివసింపడని, శ్రీసభ విశ్వాసాన్ని వ్యతిరేకించాడు. దీనిని ఆధారం చేసుకుని క్యాల్విన మరియు జ్వింగ్లీ గారు దివ్యసత్ప్రసాదానికి వ్యతిరేకంగా ప్రబోధించడం ప్రారంభించారు. సంస్కర్తలు యొక్క దివ్యసత్ప్రసాద వాదనలను పరిశీలిద్దాం.

## 2.4.1 మార్టిన్ లూథర్ దివ్యసత్ప్రసాద వేదాంతం

మార్టిన్ లూదర్ శ్రీసభ దివ్యసత్ప్రసాదము గురించి మూడు లోపాలను త్రివిధ బంధనాలుగా వ్యతిరేకించాడు. మొదటిది, పరివర్తన సిద్ధాంతం (ద్విపదార్ధ సంఘటిత సహజీవనం). రెండవది, పవిత్రమైన దివ్యబలిపూజ. మూడవది, క్రీస్తు ప్రభువుని నిజమైన ఉనికి. దివ్యసంస్కారం యొక్క సారాంశం విశ్వాసం తప్ప మరొకటి కాదని, శ్రీసభ తన సొంత ప్రయోజనాల కోసం ఉపయోగించ కూడదని ఆయన అన్నాడు. కడరా భోజన సమయంలో క్రీస్తు నిజమైన శరీరం కల్వరిగిరిపై ఇచ్చాడు అని అంగీకరించాడు. ప్రతి దివ్యసంస్కారం విశ్వాసంపై ఆధారపడి ఉంటుందని బోధించాడు. ఆయన బోధించిన వాటిని క్షుణ్ణంగా పరిశీలనచేద్దాం.

### దివ్యపూజ – ఒక బలి

మార్టిన్ లూథర్ దివ్యపూజను ఒక త్యాగబలిగా నిరాకరించాడు. దీనిని కేవలము దేవుని సంతోష పెట్టడానికి నిర్వహించు ఒక ప్రక్రియ గా మాత్రమే చూశాడు. హెబ్రీయుల పత్రిక 7:27లో ఇలా చదువుతాం: “ఆయన ఇతర ప్రధాన యాజకుల వంటి వాడు కాదు. ప్రతి దినము, మొదట తన పాపముల కొరకు, తరువాత ప్రజల పాపముల కొరకు బలులను అర్పించవలసిన అవసరము ఆయనకు లేదు. తనను తాను అర్పించుకున్నప్పుడు ఒకే ఒక బలిగా శాశ్వతముగా అర్పించుకొనెను.” దీనిని ఆధారంగా చేసుకుని మార్టిన్ లూథర్ ఇలా అంటాడు: దివ్య బలి పూజ ఒక నిబంధన, కేవలము పాపపరిహారమునకై దేవుడిచ్చిన వాగ్దానము, ఇది దైవ సంకల్పం, దీనిని పొందాలంటే మానవుడు విశ్వాసమును కలిగి ఉండాలి. ఈ సంస్కరణ సందర్భంలో దివ్య పూజ ఒక బలి అని ఎవరైనా నిర్వచిస్తే అది అక్రైస్తవం అని ఆయన సంబోధించాడు.

## దివ్యబలిపూజ – క్రీస్తు ప్రత్యక్ష ఉనికి

మార్టిన్ లూథర్ శ్రీసభ ఫారంపర్యంగా వచ్చు విధానాలను ఎన్నడు తృణీకరించలేదు. అయితే దివ్య సత్రప్రసాదము గురించి ఆయన కతోలిక సిద్ధాంతాలకు విరుద్ధమైన భావాలను కలిగి ఉన్నాడు. అప్పరసరూపాలలో క్రీస్తు నిజంగా ఉన్నాడు అను సత్యమును ఆయన నిరాకరించాడు. ఇందులో కూడా ఇతర ప్రొటెస్టెంట్ సంస్కర్తల మాదిరిగా కాకుండా మార్టిన్ లూథర్ కొద్దిపాటి వాస్తవాన్ని అంగీకరిస్తున్నాడు. దివ్యబలి పూజలో క్రీస్తు ప్రభు మాటలను గురువు ఎప్పుడైతే ఉచ్చరిస్తాడో అప్పుడు ఈ అప్ప ద్రాక్ష రసములు క్రీస్తు ప్రభువుని శరీర రక్తముగా మారుతున్నాయి. ఎవరైతే భక్తి విశ్వాసంతో స్వీకరిస్తారో, వారు పాప పరిహారం పొంది క్రీస్తుతో ఐక్యమవుతారు. ఇది కేవలము క్రీస్తు ప్రభువుని మనుష్యవతారము వలన మరియు పవిత్రాత్మ ప్రేరణ వలన మాత్రమే జరుగును. అనగా, మార్టిన్ లూథర్ దివ్య సత్రప్రసాదములో క్రీస్తు ప్రభువుని శాశ్వత సన్నిధిని విశ్వసింపలేదు.

## 2.4.2. జాన్ కాల్విన్ – దివ్యసత్రప్రసాద సిద్ధాంతము

జాన్ కాల్విన్ అను తొలి వేదాంత సంస్కరణ కర్త, దివ్య సత్రప్రసాదమును భుజించడం ద్వారా క్రైస్తవులు క్రీస్తుతో ఐక్యము కాగల ఆధ్యాత్మిక పోషణ పొందగలరని దృఢముగా విశ్వసించాడు. అలా దివ్య సత్రప్రసాదమును స్వీకరించినప్పుడు ప్రతి క్రైస్తవుడు నిజముగా క్రీస్తు యొక్క మాంసముతో పోషింపబడుతున్నాడని ఆయన విశ్వసించడం మాత్రమే కాకుండా, దానిని ఒక వివరించలేని అద్భుతముగా వర్ణించాడు. సువార్త బోధనలో క్రైస్తవులకు తెలియజేయబడిన వాగ్దానములను దివ్యసత్రప్రసాదము ధ్రువీకరుస్తుందని ఆయన బోధించాడు. అంతేకాక ఈ దివ్యసత్రప్రసాదము దేవుని స్తుతించుటకు, పొరుగు వారిని ప్రేమించుటకు సహాయపడుతుందని ఆయన ప్రకటించాడు. క్రీస్తు యొక్క విందులో, క్రీస్తు యొక్క మానవత్వంతో పాటు అతని ఆత్మలో కూడా పాలుపంచుకోవడం అవసరం. ద్రాక్ష రసము క్రీస్తు శరీరక్తములను సూచించడం కంటే నిజముగానే అవి క్రీస్తు శరీర రక్తం అని ఆయన విశ్వసించాడు. దివ్య బలి పూజలో దివ్య సప్రసాద స్వీకరణ తరువాత మానవునికి మరియు పవిత్రాత్మకు

మధ్య ఒక సంభాషణ జరుగుతుంది అని ఆయన విస్తృతంగా చాటి చెప్పాడు. లూథరకు వ్యతిరేకంగా, కాల్విన్ జింగ్లీ వలె, క్రీస్తు దివ్యసత్ప్రసాద మూలకాలలో శారీరకంగా ఉన్నాడని విశ్వసింపలేదు. క్రీస్తు పరలోకంలో ఉన్నాడని, ఆయన మన వద్దకు దిగి రాడని, దివ్యసత్ప్రసాదమును స్వీకరించడం ద్వారా మనం ఆయనతో సంభాషిస్తున్నామని ఆయన ప్రబోధించాడు.

కడరాత్రి ప్రభు భోజనం నిజమైన సంఘటన అని కాల్విన్ నమ్మాడు. అయితే ఈ సంఘటన విశ్వాసం ద్వారా మాత్రవే విశ్వాసులకు సాధ్యమవుతుందని బోధించాడు. విశ్వాసి యొక్క దృష్టి అతని రక్షకుని పై కేంద్రీకరించడం ద్వారా తాను క్రీస్తు యొక్క పశ్చాతాపక్రియ ఫలములను మరియు ప్రయోజనాలను సమృద్ధిగా పొందగలుగుతాడు, ఇది దివ్యబలిపూజ యొక్క నిజమైన ఉద్దేశం అని కాల్విన్ అంటాడు. రొట్టె రసములలో క్రీస్తు తన భౌతిక శరీరము మరియు రక్తములను దాచి ఉంచాలని భావించలేదు, అయితే వాటిని స్వీకరించడం ద్వారా క్రైస్తవుడు క్రీస్తుతో ఐక్యతను పొందగలడు.

ఒక క్రైస్తవుడు క్రీస్తు ఐక్యమైనప్పుడు, అద్భుత విధముగా అతడు త్రియేక సర్వేశ్వరుడు యందు కూడా ఐక్యమవుతాడని కాల్విన్ విశ్వసించాడు. ఇది తండ్రి దేవుని దయగల ఎన్నిక పైన, విశ్వాసి యొక్క దృఢమైన విశ్వాసము పైన, మరియు పవిత్రాత్మ అనుగ్రహించు సహాయం పైన ఆధారపడి ఉంటుంది. ఈ బంధము ద్వారా విశ్వాసి క్రీస్తులో అన్ని ప్రయోజనాలను పొందగలుగుతాడు. క్రీస్తు మరియు విశ్వాసి మధ్య కలయికలో పరిశుద్ధాత్మ ఒక కీలక పాత్రను పోషిస్తాడు. ఆత్మ ద్వారా మాత్రమే విశ్వాసి క్రీస్తుతో ఐక్యం కాగలడు. ఆ ఆత్మ దయ మరియు శక్తి ద్వారా మాత్రమే విశ్వాసి క్రీస్తు దేహములో సభ్యునిగా కాగలరు. క్రీస్తు మనలను తనతో ఐక్యం చేసుకోవడానికి బంధమే పవిత్రాత్మ అని కాల్విన్ భావించాడు.

మనము పరిశుద్ధాత్మ యొక్క పనిని పరిగణలోనికి తీసుకున్నప్పుడు, క్రైస్తవున్ని క్రీస్తుతో ఐక్యం చేయడంలో భగవంతుడే స్వయంగా పనిచేస్తున్నాడని గ్రహించగలము. అనగా క్రీస్తుతో ఐక్యం కావడం అంటే త్రియేక సర్వేశ్వరునితో ఐక్యం కావడమే. పవిత్రాత్మ (ప్రభావము) కార్యము ద్వారా, తండ్రి దేవుడు

(కారకుడు), విశ్వాసిని క్రీస్తుతో (పదార్థం) ఐక్యపరుస్తున్నాడు. క్రీస్తుతో ఐక్యత గురించి కాల్విన్ తన వేదాంత శాస్త్రంలో ఒక ముఖ్యమైన పదములు వినియోగిస్తాడు: క్రీస్తు అన్ని ప్రయోజనాలు. ఈ పదబంధం చాలా ముఖ్యమైంది.. క్రీస్తు జీవితము మరణము పునరుత్థానము మోక్షరోహణం ద్వారా సంపాదించిన ఫలములను, మరియు తండ్రి వద్ద నుండి తాను పొందిన అనుగ్రహములను, తనను విశ్వసించు ప్రతి విశ్వాసిపై పవిత్రాత్మ ద్వారా కుమ్మరిస్తున్నాడు. దీని ద్వారా విశ్వాసి క్రీస్తుతో ఐక్యమగుతున్నాడు. కాల్విన్ ఇలా వ్రాస్తున్నాడు: "మీరు అతనిలో సభ్యులుగా చేయబడి అతనితో ఐక్యమవుతున్నారు. ఇది కచ్చితంగా ఇలాగే ఉంటుంది. మన నుండి క్రీస్తుని, క్రీస్తు నుండి మనలను వేరు చేయకూడదు."

## 2.4.3. జ్వింగ్లీ – దివ్యసత్ప్రసాద వేదాంతము

జ్వింగ్లీ యొక్క దివ్యసత్ప్రసాద ఆరాధన విధానం పూర్తిగా పరిశుద్ధ గ్రంథం పై ఆధారపడి ఉంటుంది. అతడు దివ్యసత్ప్రసాదం యొక్క సుమాతృక పోలిక వీక్షణను అభివృద్ధి చేశాడు. అతడు కతోలిక పదార్థత్వ పరిణామ సిద్ధాంతాన్ని తిరస్కరించాడు. రొట్టె మరియు ద్రాక్ష రసములు కేవలము భావగర్భితముగా క్రీస్తు శరీర రక్తాలను సూచిస్తున్నాయి కానీ, అవి వాస్తవంగా క్రీస్తు శరీరక్తముగా మారడం లేదు అని అతడు అంటాడు అతడు ప్రభు భోజనంలో దివ్య సంస్కార సంగమమును గుర్తించలేదు. దివ్య సంస్కారాలు పవిత్రమైన విషయానికి, అనుగ్రహించబడిన దయకు సంకేతము. దివ్య సంస్కారానికి విశ్వాసుల విశ్వాసం ఆవశ్యకం. ప్రభు భోజనం పశ్చాత్తాపం యొక్క పునరావృతం కాదు అది కేవలము ఒక ప్రతీకాత్మక స్మరణ మాత్రమే, క్రీస్తు మరణమును ప్రతిబింబించడం ద్వారా విశ్వాసి ఒక ఆధ్యాత్మిక ఆశీర్వాదాన్ని పొందుతాడు అని అతడు ప్రబోధించాడు.

### దివ్యసత్ప్రసాదము – క్రీస్తు జ్ఞాపకార్థం

అప్పము మరియు ద్రాక్ష రసము కేవలము క్రీస్తు యొక్క చిహ్నాలు మాత్రమే. అవి క్రీస్తు శరీరము రక్తమని విశ్వాసి యొక్క ఊహకు మాత్రమే సూచిస్తాయి. అప్పము ద్రాక్షరసము వాటంతటఅవి ఏ విధంగానూ మార్చబడవు, ఉంటాయి.

ఏసు తన జ్ఞాపకార్థ చిహ్నంగా చేసిన ఆ కార్యమును విశ్వసించి, విశ్వాసంతో స్వీకరించడం ద్వారా విశ్వాసులు క్రీస్తుతో మరింత ఐక్యతను సాహిత్యమును సంపాదించుకుంటారు అని అతడు అభిప్రాయపడ్డాడు.

అప్ప ద్రాక్షరసములు దేవుని దయను తెలియజేయవు, విశ్వాసమును మాత్రమే తెలియజేస్తాయి. దీనిని తరచుగా దివ్యసత్ప్రసాదము లేదా దివ్య బలి పూజ అని కాకుండా "ప్రభు భోజన వేడుక" అని పిలుస్తారు. తద్వారా ఒక విశ్వాసి దీనిని ఒక చారిత్రాత్మక సంఘటనల కాకుండా, మానసికంగా దేవుని సాన్నిధ్యమును పొందుటకు దోహదపడు అంశముగా గ్రహించగలరు. ఇది క్రీస్తు మరణమును గుర్తుచేస్తుంది. మన రక్షకుని యొక్క విధేయత ప్రతిజ్ఞ మరియు వాగ్దానము ప్రకటించడానికి ఇది ఒక కారణంగా నిలుస్తుంది. ప్రభు రాత్రి భోజనం ఒక జ్ఞాపకార్థ చిహ్నంగా ఉంటుంది. అంతేకానీ, మన పాప పరిహారానికి ప్రతిరోజు ఈ కార్యములు జరగవలసిన అవసరం లేదు. క్రీస్తు మరణ పునరుత్థానములను విశ్వసించడం ద్వారా విశ్వాసి మరింత ఆధ్యాత్మిక వరములను పొందగలుగుతాడు.

## దివ్యసత్ప్రసాద రూపాంతర తిరస్కరణ

కతోలిక శ్రీసభ దివ్య బలి పూజను ఒక సమిష్టి వేడుకగా జరుపుకుంటుంది. అప్ప ద్రాక్షరసములు పవిత్రమైన గురువుల హస్తాల మీదుగా ప్రతిష్టింపబడినప్పుడు అవి క్రీస్తు శరీర రక్తాలుగా రూపాంతరం చెంది, ఒక దైవీక సాంగత్యముగా మారు ఒక సాదృశ్యముగా కతోలిక శ్రీసభ దివ్య బలిపోషను అభివర్ణిస్తుంది. దీని ద్వారా అప్ప ద్రాక్ష రస రూపములలో పవిత్రమైన ప్రభువు వాస్తవముగా కొలువై ఉంటాడని ప్రకటిస్తుంది. అయితే జ్వింగ్లీ ఈ కతోలిక శ్రీసభ విశ్వాసాన్ని, దివ్యసత్ప్రసాద సిద్ధాంతమును వ్యతిరేకిస్తూ, అప్ప ద్రాక్ష రసములు క్రీస్తు శరీరరక్తాలుగా మారవు అని బలంగా ప్రకటించాడు. తన వాదనను నిరూపించుకోవడానికి యోహాను 6:63 వచనము (జీవమును ఇచ్చినది ఆత్మయే, శరీరము నిష్ప్రయోజనము) ఉదాహరణగా తీసుకుంటాడు.

జ్వింగ్లీ ప్రకారము ఏసుక్రీస్తు సృష్టి ఆరంభము నుండి ఉన్న ఏకైక ప్రధాన యాజకుడు. ఇతర బలులను కాకుండా తనను తానే స్వయంగా తండ్రి దేవునికి

సంపూర్ణమైన బలిగా అర్పించుకున్న యాజకుడు. క్రీస్తు త్యాగబలి సంపూర్ణమైనది. ఎందుకన, ఆయన ఒకే ఒకసారి తన ప్రాణార్పణ ద్వారా అనాది నుండి మరియు యుగయుగములుగా జీవించు ప్రతి ఒక్కరి నిమిత్తమై శాశ్వత రక్షణ బలిని సమర్పించాడు. ఈ సత్యాన్ని రాబోవు తరముల వారికి తెలియజేయుటకై ప్రతిదినము దివ్య బలి పూజను ఆయన జ్ఞాపకార్ధంగా చేసుకోవాలి. తద్వారా ఈ సత్యము చీకటిలో కాకుండా వెలుగు నందు బహిరంగంగా ప్రకటింపబడుతుంది. దీనిని మనము క్రీస్తు మన కొరకు సమర్పించిన యోగ్యమైన పశ్చాతాప బలిగా ఈ సంఘటనను జ్ఞాపకార్ధంగా మన విశ్వాసం చాటుతూ ఘనంగా జరుపుకోవాలి. ఇది కేవలము మానవుని విశ్వాస కార్యకలాపాల ద్వారా మాత్రమే జరుగుతుంది.

## మూడవ అధ్యాయము

## దివ్యసత్ప్రసాదం - కతోలిక సంస్కరణ సమాధానం

దివ్యసత్ప్రసాదం అనునది కతోలిక శ్రీసభలో ఐక్యతకు గొప్ప సంకేతం. అయితే క్రైస్తవుల మధ్య విభజనకు ప్రధాన కారణాలలో దివ్యసత్ప్రసాదం ఒకటి. దివ్యసత్ప్రసాదం గురించి కతోలిక శ్రీసభ కలిగి ఉన్న ప్రధాన ప్రకటనలలో అత్యంత ముఖ్యమైనది ట్రెంటు మహాసభ. మార్టిన్ లూథర్ 16వ శతాబ్దపు సంస్కర్తలు ఆనాటి దివ్యసత్ప్రసాద వేదాంతాన్ని సవాలు చేశారు. ఆ సవాలుకు ప్రతిస్పందనగా ట్రెంటు మహాసభ సమావేశమైంది. కతోలిక శ్రీసభలో దివ్యసత్ప్రసాదానికి ఈ మహాసభ ఎంతగానో తోడ్పడింది సహకరించింది. ఈ అంశాలన్నీ సంబోధించే ముందుగా వ్యతిరేక సంస్కరణ మరియు కతోలిక సంస్కరణ అనగా ఏమిటో పరిశీలించుదాం.

### 3.1. వ్యతిరేక సంస్కరణ - కతోలిక సంస్కరణ

చరిత్రకారులు కొన్నిసార్లు కతోలిక సంస్కరణ మరియు వ్యతిరేక సంస్కరణల మధ్య వ్యత్యాసాన్ని చూపించరు. హూబెర్జెడిన్ (1900–1980) అనుగొప్ప చరిత్రకారుడు ట్రెంటు మహాసభ అను "అంతర్గత పునరుద్ధరణ ద్వారా కతోలిక జీవిత ఆదర్శాన్ని శ్రీసభ యొక్క జ్ఞాపకం" అని అభివర్ణించాడు. మరియు అతడు వ్యతిరేక సంస్కరణ ప్రొటెస్టెంటు భావా జాలానికి వ్యతిరేకంగా

పోరాటంలో శ్రీసభ యొక్క "స్వీయ ధ్రువీకరణ" అంశాన్ని పొందుపరచాడు. అయితే కతోలిక సంస్కరణ సాధారణంగా 16వ మరియు 17వ శతాబ్దాలలో కతోలిక శ్రీసభలోని సంస్కరణ ఉద్యమాలలో ఒకటిగా పరిగణింపబడుతుంది. నేను కూడా కతోలిక సంస్కరణ అనుపదాన్ని వినియోగించడానికి చాలా ప్రేరణ పొందాను.

వివిధ రకాల ప్రొటెస్టెంటు సంస్కరణ ఉద్యమాల సమయంలో కతోలిక శ్రీసభ కపూచిన్స్ (1528) మరియు యేసు సభ (1540) మొదలగు నూతన మత సంఘాల ఎదుగుదలను చవిచూచింది. కతోలిక సంస్కరణాలు ఉద్యమాలు కేవలము నిరసనకారుల లేదా ప్రొటెస్టెంటు సంస్కరణ ఉద్యమాలకు ప్రతిచర్యలు కాదు. బదులుగా వారు 15వ శతాబ్దం చివరి నుండి మరియు 16వ శతాబ్దం ఆరంభం వరకు శ్రీసభలో చోటుచేసుకున్న మరింత విస్తృతమైన సంస్కరణల ప్రేరణలో వీరు భాగమయ్యారు. కతోలిక సంస్కరణ ప్రధానంగా మతాధికారుల ప్రాపంచికత మరియు అనైతికత, నైతిక మరియు ఆధ్యాత్మిక సంస్కరణలకు సంబంధించిన అంశము.

## 3.2. సాధారణ సభ కోసం పిలుపు

1519 సంవత్సరములో లూదరు స్వయంగా సాధారణ సభకు పిలుపునిచ్చాడు. అయితే అతడు పాపుగారిని కానీ, సభల అధికార మద్దతు పై నమ్మకం ఉంచలేదు. అయిదవ రోమను చక్రవర్తి చార్లెస్ (1500-1558) 1523 సంవత్సరములో డైట్ ఆఫ్ నూరెంబర్గ్ అను ప్రదేశములో "జర్మనీ గడ్డపై స్వతంత్ర క్రైస్తవసభ" కోసం పిలుపునిచ్చాడు. అటు తర్వాత పోపు క్లమెంటు (1523-1534), అటువంటి సభ పాపుగారి అధికారాన్ని తగ్గించి వేస్తుందని భయపడ్డాడు. అంతే కాకుండా ఫ్రాన్స్దేశపు రాజు, ఫ్రాన్సిస్, జర్మనీ గడ్డపై నిర్వహించే సాధారణ సభకు మద్దతు ఇవ్వడని క్లమెంటు పాపుగారికి ముందుగానే తెలుసు. అంతేకాదు అది తన రాజకీయ ప్రత్యర్థి ఐదవ చార్లెస్ శక్తిని కూడా పెంచుతుందని ముందుగానే ఎదిగి ఉన్నాడు. 1530 సంవత్సరములో ఐదవ చార్లెస్ లూథరన్ సభతో ఒప్పందం కుదుర్చుకోవడంలో విఫలమైన తర్వాత, అతడు మరల క్లమెంటు పాపుగారిని సాధారణ సభకు పిలుపునివ్వమని విజ్ఞప్తిచేశాడు. ఆవిజ్ఞప్తిని క్లెమెంటు పాపుగారు చివరకు

అంగీకరించాడు. అయితే ఆ సమావేశం యొక్క అధికారంపై అతడు అనేక ఆంక్షలు విధించాడు. అది ఎప్పటికీ కార్యరూపందాల్చ లేదు. కాబట్టి ఐదవ చార్లెస్ సాధారణ సభను ప్రారంభించడంలో ఏడవ క్లమెంటు పాపుగారి వారసుడు మూడవ పౌలు పాపుగారి సహకారంతో విజయం సాధించాడు, సాధారణ సభకు పిలుపు నిచ్చాడు.

## 3.3. ట్రెంటు మహాసభ – నేపద్య చరిత్ర

సంస్కరణకు కారణం లూధరు అని అనేక మంది వాదించినప్పటికీ, అతడు కేవలము సంస్కరణకు మాత్రమే పిలుపు నిచ్చాడని, శ్రీసభలో కూడా సంస్కరణ అవసరమని సూచించాడని మనకు తెలుస్తుంది. మార్టిన్ లూథర్ నేతృత్వంలోని సంస్కర్తలు చాలా మంది కతోలిక శ్రీసభ గుర్తించింది. కాబట్టి సభ అవసరం అని గ్రహించింది. ఇది ఇకపై వేదాంత చర్చకాదు, సామాజిక మరియు రాజకీయ చిక్కులను కలిగి ఉంది. ఈ సంస్కరణ ఉద్యమం ముందుగా విశ్వాసులను ఆకర్షించింది. అనేక మంది మార్టిన్ లూథర్ వేదాంత భావాలను అంగీకరించటం ప్రారంభించారు. ఈ పరిస్థితి కతోలిక శ్రీసభ ఉనికికి మరియు కతోలికుల విశ్వాసానికిపెను ప్రమాదముగా మారింది. మతపరముగా మరియు రాజకీయ పరమైన సమస్యలు ఉన్నందున సాధారణసభ ఖచ్చితంగా అవసరం. కేవలము వ్యక్తిని పిలవడంగాని, వ్యక్తిగతంగా పరిష్కరించడం కానీ సాధ్యం కాదు. లూధరనులను తిరిగి శ్రీసభలోనికి తీసుకొనిరావడానికి ఒకమార్గాన్ని కనుగొనడానికి ఒక సమావేశాన్ని ఏర్పరచారు. అంతకు ముందు జరిగిన అన్ని చర్యలు, సమావేశాలు, స్థానిక సభలు మరియు అనాధికారక సభలు విఫలమయ్యాయి. సఖ్యతను స్థిరపరచే క్రమములో ప్రక్రియలో జర్మనీ నాయకుడు మార్టిన్ లూథర్ బహిష్కరణకు గురి అయ్యాడు.

చివరగా ఏడవ క్లమెంటు వారసుడు మూడవ పౌలు క్రైస్తవ ఐక్యత మరియు సమర్ధవంతమైన శ్రీసభ సంస్కరణ కేవలము మహాసభ ద్వారా మాత్రమే సాధ్యమవుతుందని అభిప్రాయపడ్డాడు. అతని మొదటి ప్రయత్నాలు విఫలమైన తర్వాత అతడు ట్రెంటు మహాసభకు పిలుపు నిచ్చిదానిని ఏర్పాటు చేశాడు. అయితే ఏది ముందుకు సాగలేదు. 1545 సంవత్సర ప్రారంభంలో సభను పిలవడానికి 1544 నవంబర్లో మూడవ ప్రయత్నం జరిగింది. ఆ మహాసభకు

వచ్చిన పీఠాధిపతుల ఏకైక రాయబారుడు మరియు పాపుగారు పంపించిన తన సహాయకుడు. చివరకు 1545 సంవత్సర చివరలో ఒక మహాసభను ఏర్పాటు చేయడానికి విజయవంతమైన ప్రయత్నం జరిగింది.

### 3.4. ట్రెంటు మహాసభ

ట్రెంట్మహాసభ అధికారికంగా డిసెంబరు 13, 1545 ప్రారంభించబడింది. సభప్రారంభమైన వెంటనే కొంతమంది పీఠాధిపతులు తక్షణ సంస్కరణల కోసం కోరారు. మరి కొందరు కతోలిక సిద్ధాంతాల యొక్క వివరణను కోరారు. అయితే శ్రీసభలో అవి నీతికి సంబంధించిన విలాస విక్రయాలు లూథరకు ఒక తిరుగుబాటుకు కారణమని సభగ్రహించింది, ఆ ప్రస్తావన చేసింది.

మహాసభ సంస్కరణల ద్వారా శ్రీసభ తన జీవన అన్నిరంగాలలోనూ మార్పును తీసుకొని వచ్చింది. అంతేకాదు నాలుగవ శతాబ్దము నుండి సాంప్రదాయంగా అనుసరించు మార్గమును ఈ మహాసభ క్రమపరచింది, నిర్దేశించింది. ఈ మహాసభ 18 సంవత్సరాల వ్యవధిలో సమావేశమైంది. అంతేకాదు దాని పనిని వివిధ ప్రతినిధుల సమూహాలు నిర్వహించాయి. స్పానిష్సంస్కర్తలచే బహుగా ప్రభావితమైనప్పటికి, ముఖ్యంగా ఆఖరి సమావేశములలో ట్రెంట్మహాసభ ప్రొటెస్టెంట్ సిద్ధాంతాలకు సమాధానమును అందిస్తూ, శ్రీసభ తన సిద్ధాంతమును ఆచారమును, తన నీతిని ప్రస్పష్టముగా ప్రకటించింది. అంతేకాదు శ్రీసభ ఉనికిని పీడిస్తున్న అవి నీతిని మరియు దుర్వినియోగాలను తొలగించడానికి ఈ మహాసభ ఎంతగానో ప్రయాసపడింది. సిద్ధాంతాల విషయానికి వస్తే, శ్రీసభ ప్రొటెస్టెంటు భావాజాలానికి ఎప్పుడు రాజీపడలేదు, పైగా వారి బోధనలను తిరస్కరించింది. మరియు పాపుగారు కతోలిక క్రమానుగతశ్రేణి యొక్క అధికారాన్ని ధ్రువీకరించింది. అదనంగా శ్రీసభ సాంప్రదాయ ఆచారము మరియు భక్తిని మాత్రమే కాదు, ప్రభు భోజనం మరియు ఉదారత్యాగం మరియు ఆరాధన అంశాల గురించి వారిని వ్యతిరేకించి తన వేదాంతమును సమర్థించుకుంది.

### 3.5. ట్రెంటు మహాసభ – దివ్యసత్ప్రసాద సంస్కారం

దివ్యసత్ప్రసాద సంస్కారము అన్ని సమస్యలకంటే ఎక్కువగా

పరిగణింపబడుతుంది. అది. ఒక పెను ప్రమాదంగా కనిపిస్తుంది. అత్యంత గొప్పసవాలుగా నిలుస్తుంది. ఈ దివ్యసంస్కారానికి ప్రొటెస్టెంటు సంస్కర్తలు కూడా అంతగొప్ప ప్రాధాన్యత ఇవ్వడం లేదని, దానిపై అవసరమైనంత ఆసక్తి చూపించడం లేదని గమనించగలం. కతోలిక మరియు ప్రొటెస్టెంటు సంస్కర్తలు మధ్య, ఈ సంస్కరణ ఉద్యమ సమయంలో, దివ్యసత్ప్రసాద సంస్కారం చుట్టూ చాలా వివాదాలు ఉన్నాయని తెలుస్తుంది. అందు కొరకే ఈ మహాసభ దివ్యసత్ప్రసాదములో దాగి ఉన్న నిగూఢమైన వేదాంత అందాన్ని అర్థాన్ని బహుశ్రద్ధగా వ్యక్తీకరించింది. ఈ పరమ పవిత్రమైన దివ్యసంస్కారమును చేరుకొనుటకు అవసరమైన యోగ్యమైన భక్తిని గురించి ఈ సభ దృఢంగా పొందుపరచింది. ఈ సమయములో ఎనిమిది అధ్యాయాలలో దివ్యసత్ప్రసాదం గురించి, అనేక శాసనాలు చట్టాలు రూపొందించి, ఏసుక్రీస్తు నుండి అపోస్తలుల ద్వారా అనేక శతాబ్దాల కాలంలో స్వీకరించబడిన శ్రీసభ యొక్క విశ్వాసమును మరియు ప్రబోధమును ఈ సభ వివరించింది.

### 3.5.1. పరమ పవిత్ర దివ్యసత్ప్రసాదము - మహాసభ శాసనాలు

ట్రెంట్ మహాసభలో పవిత్ర సినడు సత్ప్రసాదం యొక్క గౌరవనీయమైన మరియు దైవీక సంస్కారముపై వారి ధ్వని మరియు నిజమైన సిద్ధాంతాన్ని అందించింది. ఇది కతోలిక సభ మన ప్రభువైన ఏసుక్రీస్తు ద్వారా మరియు అతని అపోస్తలుల ద్వారా మరియు పవిత్రాత్మ ప్రేరణ ద్వారా బోధించబడింది. తల్లి శ్రీసభ ప్రతిరోజు ఆ సత్యమును తన మనసులో భద్రంగా నిలుపుకుంటుంది, నిరంతరము దానిని కాపాడుకుంటుంది, మరియు లోకాంతం వరకు ఆ సత్యమును స్థిరముగా సంరక్షిస్తుంది. క్రీస్తు విశ్వాసులందరిని పవిత్ర దివ్యసత్ప్రసాదం గురించి, విశ్వసించడం బోధించడం లేదా ప్రకటించడం వంటి అంశాలను నిషేధిస్తుంది. ఈ ప్రస్తుత శాసనము వివరించబడింది మరియు నిర్వచించబడింది. ఇది పరమ పవిత్రమైన దివ్యసత్ప్రసాద సంస్కారం గురించి స్పష్టంగా మరియు లోతుగా వ్యవహరించే అధ్యాయాలను కలిగి ఉంది. వాటిని ఇప్పుడు ప్రస్తావిద్దాం.

## మొదటి అధ్యాయము: దివ్యసత్ప్రసాదంలో యేసుక్రీస్తు నిజమైన ఉనికి

రొట్టె మరియు రసమును ప్రతిష్టించిన తరువాత, మన ప్రభువైన యేసుక్రీస్తు నిజమైన దేవుడు నిజమైన మానవుడు, పవిత్రమైన దివ్యసత్ప్రసాద సంస్కారములో, బాహ్యంగా కనిపించు వస్తువులైన రొట్టె మరియు రసములో, నిజముగా వాస్తవముగా గణనీయంగా ఉన్నాడు అని ఆ పవిత్ర సభ విశ్వసించింది, అదే సత్యాన్ని బహిరంగంగాను సరళంగాను ప్రకటించింది. మన రక్షకుడు స్వర్గములో ఉన్నాడు. సహజపద్ధతి ప్రకారం ఎల్లప్పుడు తండ్రి కుడి ప్రక్కన కూర్చుని ఉంటాడు. అయినప్పటికీ అతడు ఇతర ప్రదేశాలలో తన సొంతపదార్థములో, తనదైన పద్ధతిలో తన ఉనికిని సన్నిధిని మనకు పవిత్రంగా ప్రత్యక్షంగా అందిస్తూ ఉంటాడు.

కాబట్టి మన పూర్వీకులు అందరూ క్రీస్తుని నిజమైన శ్రీసభ ఈ దివ్యసత్ప్రసాదమును అత్యంత పవిత్రమైన దివ్యసంస్కారముగా పరిగణించారు మరియు దానిని బాహాటముగా ప్రకటించారు. మన విమోచకుడు తన కడరా విందులో ఈ ప్రశంసనీయమైన ఈ పరమోన్నతమైన దివ్యసంస్కారములు స్థాపించాడని, రొట్టె మరియు ద్రాక్షరసాన్ని ఆశీర్వదించిన తరువాత, వాటిలోనే వాటిద్వారా తన సొంత శరీరాన్ని రక్తాన్ని ఇచ్చాడని, తన స్వీయ పలుకులే అందుకు నిదర్శన మని వారు విశ్వసించారు. ఎవరైనా ఈ సత్యమును తిరస్కరిస్తే అతడు శ్రీసభ యొక్క సార్వత్రిక భావానికి విరుద్ధంగా ప్రవర్తించిన వాడు అవుతాడు.

## రెండవ అధ్యాయము: దివ్యసత్ప్రసాద స్థాపన యొక్క కారణం

మన రక్షకుడైన ఏసుక్రీస్తు ఈ లోకము నుండి తండ్రి యొద్దకు తిరిగి వెళ్ళు సమయములో ఈ దివ్యసంస్కారమును స్థాపించాడు. అందులో అతడు మానవుని పట్ల తనకు ఉన్న దివ్యమైన ప్రేమ సంపదను అనుగ్రహించి, తన అద్భుతమైన పనులను జ్ఞాపకం చేసుకున్నాడని ఈ అధ్యాయము తెలియజేస్తుంది. అంతేకాదు ఈ దివ్యసంస్కారమును తన జ్ఞాపకార్థబలిగా గౌరవించి నిర్వహించ మని శ్రీసభకు ఒక ఆజ్ఞను ఇచ్చాడు. అంతేకాదు తానులోక తీర్పునకు మరల వచ్చు వరకు అతని మరణమును ప్రకటించమని, మరియు ఈ దివ్య సంస్కారమును ఆత్మల ఆధ్యాత్మిక ఆహారముగా స్వీకరించమని తాను

ఆజ్ఞాపించాడు. తద్వారా మనము అతని జీవమును పొంది ఇతరులకు జీవాహారమును బలమును అందించగలము. ఎందుకన ఆయనే స్వయంగా ఇట్లు పలికాడు: నన్ను భుజించు వాడు నా ద్వారా జీవిస్తాడు.

అందువలన శ్రీసభ ఆయన శిరస్సుగా ఉన్న ఒకే శరీరానికి సంకేతముగా మారుతుంది. విశ్వాసము, ఆశ మరియు దాతృత్వం యొక్క సన్నిహిత సంబంధం ద్వారా ఆయన మనల నుతన దివ్యశరీరంలో సభ్యులుగా ఏకం చేస్తాడు. అప్పుడు మనము ఒకే విధముగా జీవించగలము, ఒకే విషయమును మాట్లాడగలము, మన మధ్య ఎటువంటి విభేదాలు ఉండవు.

**మూడవ అధ్యాయము:**

**ఇతర దివ్యసంస్కారాల పై దివ్యసత్ప్రసాద ప్రాధాన్యత లేదా శ్రేష్టత**

అత్యంత పవిత్రమైన దివ్యసత్ప్రసాదం నిజానికి మిగిలిన దివ్యసంస్కారాలతో సమానం. ఇది ఒక రహస్య విషయానికి చిహ్నాము. ఇది ఒక అదృశ్యకారుణ్యమునకు సాదృశ్య రూపం. అయితే ఈ మహాసభలో దివ్యసత్ప్రసాదములో అగోచరమైన, అద్భుతమైన, అత్యంత పవిత్రమైన ఒక విషయం కనుగొనబడింది: ఇతర దివ్యసంస్కారాలు వాటిని మొదట ఉపయోగించినప్పుడు అవి మనలను పవిత్రం చేసేశక్తిని కలిగి ఉంటాయి, అయితే దివ్యసత్ప్రసాదం విషయంలో దానిని ఉపయోగింపక పూర్వమే ఆ పవిత్రత కారకుడు స్వయంగా అందులో దాగి ఉన్నాడు.

అపోస్తులులు ఇంకా ప్రభువు హస్తముల నుండి దివ్యసత్ప్రసాదం స్వీకరింపకమునుపే, యేసు అప్పద్రాక్షరసములను సమర్పించి వాటిని తన సొంత శరీరం తన సొంతరక్తముగా ప్రతిష్టించాడు. అనగా మన స్వీకరణకు పూర్వమే యేసు సన్నిధి ఆయన పవిత్రత ఆయన ఉనికి దివ్యసత్ప్రసాదములో స్థిరపరచబడింది. ఈ విశ్వాసము కతోలిక శ్రీసభలో ఎల్లప్పుడూ ఉంది. పవిత్రీకరణ పదాల ఉచ్చారణ ద్వారా ఏసుప్రభువు నిజమైన శరీరం, అతని నిజమైన రక్తం, అతని ఆత్మ మరియు దైవత్వం, బాహ్యంగా కనిపించు రొట్టె రసరూపాలలో దాగి ఉన్నాయి. ఇది శ్రీసభ వాస్తవం. యేసు రెండు వస్తువుల రూపాల క్రింద సంపూర్ణంగా ఉన్నాడు. రొట్టెలో సంపూర్ణంగా దాగి ఉన్నాడు. రసములో సంపూర్ణంగా దాగి ఉన్నాడు.

## నాలుగవ అధ్యాయము: రొట్టెరసముల ఆవర్తనము/ పరివర్తనము/ రూపాంతరము

ట్రెంటు మహాసభ ప్రధాన అంశాలలో రూపాంతర సిద్ధాంతం ఒకటి. ఎందుకంటే ఈ రూపాంతర సిద్ధాంతమును/ ఆవర్తన స్థితిని ప్రొటెస్టెంట్సంస్కర్తలు తిరస్కరించారు. మన ప్రభువైన క్రీస్తు బాహ్యంగా సమర్పించిన రొట్టెరూపమును తన శరీరంగా మార్చాడు అని శ్రీసభ ప్రకటిస్తుంది. కావున ఇది తల్లి శ్రీసభ దృఢ విశ్వాసం. ఈ మహాసభలో రెండు విషయాలు ప్రకటించబడినాయి: రొట్టె మరియు ద్రాక్షరసం యొక్క పవిత్రత. రొట్టెలోని మొత్తం పదార్థం మన ప్రభువైన క్రీస్తు శరీరం యొక్క పదార్థంగా రూపాంతరం చెందుతుంది. అదే విధంగా ద్రాక్షరసం యొక్క మొత్తం పదార్థం క్రీస్తు రక్తం యొక్క పదార్థంగా ఆవర్తనం చెందుతుంది. ఈ మార్పును పవిత్ర కతోలిక శ్రీసభ సముచితంగా రూపాంతరం లేదా పదార్థ ఆవర్తనంః అనుపదాలతో పిలుస్తుంది.

## ఐదవ అధ్యాయము: పవిత్ర దివ్యసత్ప్రసాద ఆరాధన

కతోలిక శ్రీసభలో క్రైస్తవులందరూ వారి సాంప్రదాయ విశ్వాసం ప్రకారము, ఈ పరమ పవిత్రమైన సత్ప్రసాద సంస్కారమును నిజమైన దేవునికి సంబంధించిన లాత్రియ అను ఆరాధనకు ఆపాదించగలము అని బోధించింది. శాశ్వతమైన తండ్రి తన ఏకైక కుమారుడు ఏసుక్రీస్తును ఈ ప్రపంచానికి అందించినప్పుడు ముగ్గురు జ్ఞానులు ఆబాలుని ముందుసాగిలపడి ఆరాధించి ఈ విధంగా ప్రకటిస్తారు: దేవుని దూతలు అందరూ అతనిని ఆరాధింపనివ్వండి, అదే దేవుడు అక్కడ కూడా ఉంటాడని మేమునమ్ముచున్నాము. పవిత్ర గ్రంథ ప్రకారము ఈ దివ్యసత్ప్రసాదము గలిలీయలోని అపోస్తులులచే ఆరాధింపబడింది. అంతేకాదు, ఇదే ఆరాధన విధానమును ఒక ఆచారముగా ఒక పవిత్రమైన సాంగ్యముగా, మతపరమైన విశ్వాస సత్యముగా శ్రీసభలో ప్రవేశపెట్టబడింది. ఈ మహోన్నతమైన గౌరవనీయమైన దివ్యసంస్కారం ప్రతిసంవత్సరం ఒక నిర్దిష్టమైన దినమున ప్రత్యేకపూజలు మరియు పండుగగా జరుపుకోవాలని, అంతే కాకుండా పుర వీధులలో బహిరంగ ప్రదేశాలలో ఈ దివ్యసత్ప్రసాదమును గౌరవ ప్రదమైన ఊరేగింపులతో నిర్వహింపబడుతుంది అని ఈ మహాసభ ప్రకటించింది.

## ఆరవ అధ్యాయము: వ్యాధిగ్రస్తుల కొరకై దివ్యసత్ప్రసాదమును భద్రపరచడం

సాక్రేరియంలో పవిత్ర దివ్యసత్ప్రసాదం నిలువ చేసే ఆచారం చాలా పురాతనమైనది. ఈ సత్యమును నైసియాసభ కూడా గుర్తించింది. అంతే కాకుండా పవిత్ర దివ్యసత్ప్రసాదమును రోగుల వద్దకు తీసుకొని వెళ్లడం మరియు ఇటువంటి అవసరం కోసం దేవాలయంలో ఈ దివ్యసత్ప్రసాదమును శ్రద్ధగా జాగ్రత్తగా నిల్వచేయడం న్యాయము మరియు ఒక కారణము అని సభలలో ప్రస్తావింపబడింది. మరియు ఇది కతోలిక శ్రీసభ యొక్క ప్రాచీన ఆచారము. ఇది శుభప్రదమైన దని మరియు అవసరమైన ఆచారం, కాబట్టి దివ్యసత్ప్రసాదమును నిల్వ ఉంచడం సరైనదని, ఈ మహాసభ నిర్దేశించింది.

## ఏడవ అధ్యాయము: పవిత్ర దివ్యసత్ప్రసాదం స్వీకరణ సిద్ధపాటు

ఈ మహాసభ పవిత్రమైన దివ్యసత్ప్రసాదమును ఏ విధంగా స్వీకరించాలి, స్వీకరించడానికి ఎటువంటి సంసిద్ధపాటు చేయాలి అను అంశాల గురించి ఈ అధ్యాయంలో వివరించింది. దివ్యసత్ప్రసాదమును స్వీకరించిన తరువాత దాని ఎడల అత్యంత గౌరవం చూపించాలని ప్రస్తావించింది. అపోస్తలుడు పౌలు దివ్యసత్ప్రసాదం ఎడల మనము చూపించవలసిన గౌరవభయము గురించి ఈ విధంగా అంటున్నాడు: "దివ్యసత్ప్రసాదమును అయోగ్యముగా భుజించి పానము చేయువాడు తననుతాను తీర్పునకు గురిచేసుకొనును". ఈ దివ్యసంస్కారం యొక్క మత సంబంధమైన ఉపయోగం, భౌతికమైన పాపం అను విషయాలు అతనికి స్పృహలో లేకున్నా, తనకు తానుగా వ్యక్తిగతంగా పశ్చాత్తాపపడ్డట్లు కనిపించినా, పాపసంకీర్తనము అను దివ్యసంస్కారం ద్వారా నిర్మలమనసును పొంది యోగ్యమైన విధముగా దివ్యసత్ప్రసాదమును స్వీకరించుటకు వెళ్లాలని ప్రకటించింది. ఈ విషయమును క్రైస్తవులందరూ స్థిరంగా పాటించాలని నిర్ణయించింది. ఇటువంటి సంసిద్ధ పాటును గురువులు కూడా తమ విశ్వాసులకు బోధించడంలో, పాప సంకీర్తన ద్వారా వారిని సత్ప్రసాద స్వీకరణకు సిద్ధంచేయడంలో నిర్లక్ష్యమును చూపించకూడదు. అత్యవసర పరిస్థితులలో పాపసంకీర్తనం చేయకుండానే దివ్యసత్ప్రసాదమును స్వీకరించినట్లయితే, అటు తరువాత వీలైనంతత్వరగా పాప సంకీర్తనం చేయడానికి ప్రయత్నం చేయాలి.

## ఎనిమిదవ అధ్యాయము: ప్రశంస నీయమైన దివ్యసంస్కారం యొక్క ఉపయోగం

ఈ పవిత్ర దివ్యసంస్కారం యొక్క ఉపయోగం గురించి ఈ మహాసభ సభ్యులు దివ్యసత్ప్రసాద స్వీకరణకు అవసరమైన మూడు మార్గములను ఎంతో శ్రద్ధగా తెలివిగా గుర్తించారు. మొదటి మార్గం, దివ్యసత్ప్రసాదమును పవిత్రంగా స్వీకరించడం, మరియు పాపాలకు బుద్ధిచెప్పటం. రెండవ మార్గం, దివ్యసత్ప్రసాదమును ఆధ్యాత్మికంగా మాత్రమే స్వీకరించడం.

మూడవ మార్గం, దానిని పవిత్రంగా మరియు ఆధ్యాత్మికంగా స్వీకరించడం. వివాహ వస్త్రమును ధరించి ఈ దైవీకబల్ల యొద్దకు చేరుకోవడానికి విశ్వాసులు తమను తాము ముందుగానే నిరూపించుకోవాలి మరియు యోగ్యులుగా మార్చుకోవాలి.

ఈ దివ్యసంస్కారం గురించి దేవుని శ్రీసభలో ఎల్లప్పుడూ ఒక ఆచారము ఉండేది: సామాన్య విశ్వాసులు గురువుల నుండి దివ్యసత్ప్రసాదమును స్వీకరించాలి. గురువులు వ్యక్తిగతంగా దివ్యబలిపూజ జరుపుకున్నప్పుడు తమకు తాముగా దివ్యసత్ప్రసాదమును స్వీకరించాలి. ఈ సాంప్రదాయం అపోస్తలిక జీవన విధానం నుండి వచ్చిన ఆచారం కాబట్టి అందులో ఒక న్యాయం ఉంది, దానికి ఒక కారణం ఉంది.

ఈ మహాసభ పితృవాత్సల్యముతో ఒక తండ్రివలె మన దేవుని దయను మనకు బోధిస్తూ ఒక మనవి చేసుకుంటుంది: క్రైస్తవ పేరును కలిగి ఉన్నవారందరూ మరియు ప్రతి ఒక్క విశ్వాసి కూడా దివ్యసత్ప్రసాద ఐక్యత యొక్క చిహ్నంలో, దాని దాతృత్వ బంధంలో, ఈ సామరస్య సంకేతములో చిరకాలము ఒకటిగా ఉండాలని, ఒకే మనసుతో జీవించాలని ఈ మహాసభ కోరుకుంటుంది.

### 3.5.2. శ్రీసభచట్టం: దివ్యసత్ప్రసాదం పరమ పవిత్ర సంస్కారం

1551 సెప్టెంబరు రెండవ తేదీ చివరి పాలక సభ ముగిసిన మరుసటి రోజున సభ జరిగింది. ఈ సభలో పవిత్ర దివ్యసత్ప్రసాదం పై ప్రొటెస్టెంట్ (నిరసనకారుల) వివాదాస్పద రచనల నుండి సేకరించిన 10 వ్యాసాలు గురువుల మధ్య పంపిణీ చేయబడ్డాయి. ఈ కథనాలు క్రింది విధంగా ఉన్నాయి.

**మొదటి చట్టము:** అత్యంత పవిత్రమైన దివ్యసత్ప్రసాదం యొక్క సంస్కారములో నిజంగా, వాస్తవంగా, గణనీయంగా మన ప్రభువు యేసుక్రీస్తు యొక్క శరీరము మరియు రక్తము, అతని ఆత్మ అతని దైవత్వం నివాసమై ఉన్నాయి. అందువలన దివ్యసత్ప్రసాదములో క్రీస్తు సంపూర్ణంగా ఉన్నాడు. ఈ సత్యమును ఎవరైనా నిరాకరించినా, లేదా దివ్యసత్ప్రసాదములో వాస్తవముగా లేడు కేవలము ఒక చిహ్నంగా, ఒక రూపంగా, ఒక లక్షణంగా మాత్రమే ఉన్నాడు అని ప్రబోధించినా, అతడు బహిష్కరణకు గురి అగును.

**రెండవ చట్టము:** పరిశుద్ధమైన పవిత్రమైన దివ్యసత్ప్రసాదములో అప్పద్రాక్షరసముల పదార్థతత్వం మన ప్రభువైన యేసుక్రీస్తు శరీరరక్తములతో అనుసంధానంగా ఉంటుందని ఎవరైనా బోధించినా, లేదా ఆశ్చర్యకరమైన ఏకీకృత రూపాంతరములు రొట్టె సంపూర్ణతత్వం క్రీస్తు శరీరంగా, సంపూర్ణ తత్వం క్రీస్తు రక్తముగా మారుతున్నాయి, దీనిని కతోలిక శ్రీసభ సరైన విధముగా పదార్థతత్వ రూపాంతరము అని పిలుస్తుంది అను సత్యమును ఎవరైనా నిరాకరించినా, అతడు బహిష్కరణకు గురి అగును.

**మూడవ చట్టము:** ఆరాధ నీయమైన దివ్యసత్ప్రసాద సంస్కారములో, విడివిడిగా ఉన్నటువంటి అప్పములో మరియు ద్రాక్షరసములో కూడా క్రీస్తు సంపూర్ణంగా ఉన్నాడు. ఈ సత్యమును ఎవరైనాని రాకరించిన అట్టివాడు బహిష్కరణకు గురి అగును.

**నాలుగ వచట్టము:** దివ్యసత్ప్రసాద ప్రతిష్టాపన ముగిసిన తర్వాత, ఆశ్చర్యకరమైన దివ్యసంస్కారములో మన ప్రభువైన యేసుక్రీస్తు శరీరరక్తములు ఇక ఉండవని ఎవరైనా పలికినా, కేవలము ఆ దివ్యసంస్కారమును వినియోగించినప్పుడు, లేదా స్వీకరించినప్పుడు మాత్రమే కానీ అంతకు ముందుగానే ఆ తర్వాత గాని అందులో క్రీస్తు లేడు అని బోధించినా, అంతేకాదు ప్రతిష్టింపబడిన అప్పములో గాని, అప్పం యొక్కభాగాలలో గాని, సత్ప్రసాద స్వీకరణ తరువాత భద్రపరచబడిన అప్పములో గాని, మన ప్రభువుని నిజమైన శరీరము ఉండదు అని ఎవరైనా ప్రకటించినా, అట్టివాడు బహిష్కరణకు గురి అగును.

**ఐద వచట్టం:** పరమ పవిత్ర దివ్యసత్ప్రసాద ప్రధానమైన అనుగ్రహము పాపమన్నింపు అని అందులో నుండి ఇతర ఫలాలు లభించవని ఎవరైనా పలికిన అతడు బహిష్కరణకు గురి అగును.

**ఆరవ చట్టము:** పరమ పవిత్ర దివ్యసత్ప్రసాద సంస్కారములో, దేవుని ఏకైక కుమారుడు క్రీస్తుని ఏ విధమైన రూపములో, సాధారణ రూపంలో కూడా ఆరాధించ కూడదని ఎవరైనా పలికినా, దాని ఫలితంగా పవిత్ర శ్రీసభ ప్రశంసనీయమైన సార్వజనీన క్రమమైన ఆచారముగా దివ్యసత్ప్రసాదమును ఒక ప్రత్యేకమైన మహోత్సవ వేడుకలో దానిని గౌరవించకూడదు అని పలికినా, బహిరంగ ప్రదేశాలలో దానిని ఊరేగింపుగా మూసుకొని వెళ్ళకూడదు అని చెప్పినా, దానిని ఆరాధించమని ప్రజలకు బహిరంగంగా ప్రబోధించకూడదు అని పలికినా, అటువంటి ఆరాధికులు విగ్రహ ఆరాధికులు అని చెప్పినా, అట్టివాడు బహిష్కరణకు గురియగును.

**ఏడవ చట్టము:** దివ్యమందసములో పవిత్రమైన దివ్యసత్ప్రసాదమును భద్రపరచడం చట్టబద్ధమైంది కాదు అని ఎవరైనా పలికినా, ప్రతిష్టింపబడిన తర్వాత దానిని కచ్చితంగా సమావేశమైన అందరికీ పంచిపెట్టాలని, అంతేగాని గౌరవ ప్రదముగా దానిని రోగుల వద్దకు తీసుకొని వెళ్లడం చట్టబద్ధం కాదని ఎవరైనా పలికినా, అట్టివాడు బహిష్కరణకు గురియగును.

**ఎనిమిదవ చట్టం:** దివ్యసత్ప్రసాదములో ఇవ్వబడిన క్రీస్తును సంస్కార రూపంలో కాదు, వాస్తవముగా కాదు, కేవలము ఆధ్యాత్మికంగా మాత్రమే భుజిస్తున్నాము అని ఎవరైనా పలికినా అట్టివాడు బహిష్కరణకు గురి అగును.

**తొమ్మిదవ చట్టము:** క్రీస్తు విశ్వాసులందరూ ఎటువంటి పురుష స్త్రీ అనుభేదము లేకుండా, హేతుకంగా ఆలోచింపగల విచక్షణ వయస్సు వచ్చిన తర్వాత, పవిత్ర తల్లి శ్రీసభ చట్టము ప్రకారము ప్రతి సంవత్సరము కనీసం ఉత్థాన మహోత్సవం రోజున ఈ దివ్యసత్ప్రసాదమును స్వీకరించాలి. దీనికి విరుద్ధంగా ఎవరైనా బోధించినా అట్టివాడు బహిష్కరణకు గురి అగును.

**పదియవ చట్టము:** దివ్యబలిపూజను నిర్వహించు గురువు తనకు తానుగా దివ్యసత్ప్రసాదమును స్వీకరించడం చట్టబద్ధం కాదు అని ఎవరైనా పలికినా, అట్టి వాడు బహిష్కరణకు గురి అగును.

**పదకొండవ చట్టం:** పవిత్ర దివ్యసత్ప్రసాద సంస్కారమును స్వీకరించుటకు విశ్వాసము మాత్రమే సరిపోతుందని ఎవరైనా పలికినా అట్టివాడు బహిష్కరణకు గురియగును.

### 3.5.3. దివ్యబలిపూజ వేదాంత సిద్ధాంతము

పూర్వపు లేక ప్రాచీన లేవియా యాజకత్వ బలులు ప్రజల పాపములను పరిహరింపలేవు. అందువలన ఒక నూతన బలి అవసరమై ఉంది. దయామయుడైన తండ్రి దేవుడు, మెల్కిసెదేకు క్రమము ప్రకారం, మన ప్రభువైన ఏసుక్రీస్తుని ఒక నూతన యాజకునిగా నియమింప సంకల్పించాడు. దాని మూలమున తాను ఎన్నుకొనిన వారిని సంపూర్ణులుగా చేసి, పవిత్ర పరచుటకు ఆ విధంగా చిత్తగించాడు.

అందువలన మన ప్రభువు మన దేవుడైన యేసుక్రీస్తు తనను తాను తండ్రి దేవునికి మరణం ద్వారా ఒకే ఒకసారి సిలువ పీఠముపై స్వయంగా సమర్పించుకొని శాశ్వత రక్షణను అనుగ్రహించాడు. అయితే, మరణం ద్వారా తన యాజకత్వము వినాశనం కాకూడదు కాబట్టి, తాను అప్పగింపబడనున్న రాత్రి కడరా భోజన సమయంలో తనకే స్వంతమైన ప్రియమైన పత్ని శ్రీసభకు, ఒక గోచరమైన బలిని అందించాడు. దీనిమూలముగా సిలువ మీద సమర్పింపబడనున్న రక్తపుబలి, ముందస్తుగానే రక్తరహితబలిగా కడర భోజన సమయంలో శ్రీసభకు అనుగ్రహించి, లోకాంతము వరకు దానిని ఒక జ్ఞాపకార్థబలిగా నిర్వహించాలని సంకల్పించాడు.

ఏసుక్రీస్తు, మెల్కిసెదేకు క్రమము ప్రకారం, తనను తాను శాశ్వతముగా యాజకునిగా స్థిరపరచుకొని, తన శరీరరక్తాలను అప్పద్రాక్షరస రూపములలో తన తండ్రి దేవునికి సమర్పించుకున్న బలియే ఈ దివ్యపూజబలి. తన శిష్యుల స్వీకరణ నిమిత్తమై తన శరీరరక్తాలను ఏసుక్రీస్తు అప్పద్రాక్షరస చిహ్నాలలో వారికి అందించాడు. ఆ విధముగా వారిని ఈ దివ్యబలి ద్వారా నూతన నిబంధన యాజకులుగా నియమించాడు. ఉదీనిని నాజ్ఞాపకార్థముగా చేయుడు అను మాటల ద్వారా, వారిని తన యాజకత్వ వారసులనుగా, తన జ్ఞాపకార్థబలిని

సమర్పించడానికి వారికి ఒక ఆజ్ఞను ఇచ్చాడు. అందువలన మనము ప్రతిదినము చేయు పాపములకు ఈ దివ్యబలిపూజ, పరిహారమును అందించుటకు ఒక లక్షణమును సంతరించు కొని ఉంది. ఈ సత్యమునే కతోలిక శ్రీసభ గ్రహించింది, విశ్వసించింది, వారసత్వ సంపదగా అందించింది.

## 3.6. ట్రెంటు మహాసభ తదనంతరం శ్రీసభ స్థితిగతులు

1563 వసంవత్సరములు ట్రెంటు మహాసభ ముగిసింది. ఈ మహాసభకు మునుపు శ్రీసభ అనేక ఆటంకాలను, అవరోధాలను చవిచూచింది. శ్రీసభ అధికారుల మధ్య అనేక అంతరాలు, లౌకిక మరియు సామాజిక నాయకుల నుండి అనేక ఒత్తిడిలు, కతోలికుల నుండి ప్రొటెస్టెంటుగా మారిన నిరసనవాదుల హింసలు, ఇవన్నీ కూడా శ్రీసభ ఉనికిని ఒక కుదుపు కుదిపేసాయి. ఈ పరిస్థితుల నడుమమూలముగా అనేక దేశాలలో కతోలిక విశ్వాసులు ఈ కీడులవలన ఆందోళన చెందారు, దేవుని విశ్వసించడంలో, శ్రీసభ నడిపింపును అంగీకరించడంలో వారు వెనకడుగు వేశారు. అయితే ఈ ట్రెంటు మహాసభ తరువాత అనేక దేశాలు నూతన సంస్కరణలను అవలంబించడంలో చొరవ చూపించాయి.

శ్రీసభలో నిమతపరమైన విశ్వాస ఘాతుకాలు సద్దుమణిగాయి. అనైతిక ప్రవర్తనలు మెల్లగా తగ్గుతూ వచ్చాయి. సత్యోపదేశం అందించబడింది. దైవార్చన క్రమములో నూతన విధానాలు చోటు చేసుకున్నాయి. సన్యాసులకు, కన్యస్త్రీలకు, గురువులకు, మేత్రానులకు గుణాత్మక విద్య మరియు శిక్షణ అందించబడింది. ఈ మార్పులతో కతోలిక ప్రజలు తమ విశ్వాసములో బలపడసాగారు. శ్రీసభలో విశ్వాస జీవితం అంత సులువైనదికాదు. దానికి కారణం, శ్రీసభలో ఎప్పుడు ఇబ్బందులు ఉంటూనే ఉన్నాయి. అయినప్పటికీ కతోలికలు మాత్రము విశ్వసనీయత మరియు సానుకూల దృక్పథంలో ఎదుగుతూ ముందుకు సాగారు. ట్రెంటు మహాసభ మరియు 1965లో ముగిసిన ద్వితీయ వాటికను మహాసభ మధ్యకాలంలో కతోలిక శ్రీసభ మరియు కతోలిక విశ్వాస జీవితం, నైతికత, ఆత్మ విశ్వాసం అను అంశాలలో నిరంతరము పురోగతి సాధిస్తూనే ఉంది.

## ముగింపు

ఈ మూడవ అధ్యాయంలో ట్రెంటుమహాసభ దివ్యసత్ప్రసాద వేదాంత ప్రబోధనను పరిశీలించాము. ఈ మహాసభ ప్రొటెస్టెంట్సంస్కర్తల అనేక సందేహాలకు సమాధానమును, అందించడమే కాకుండా దివ్యసత్ప్రసాద సంస్కారం గురించి ఒక వేదాంత ప్రబోధనను స్థిరపరచింది. ఈ మహాసభ తన పత్రాల ద్వారా మరియు తన చట్టాల ద్వారా కతోలిక విశ్వాసమును నిర్మించడమే కాకుండా, ఆసిద్ధాంతాలకు వ్యతిరేకముగా మాట్లాడు వారిని ఖండించింది.

ఈ మహాసభ పత్రాలలో అనేక అంశాలు పొందుపరచబడి ఉన్నాయి: అప్పద్రాక్షరస రూపాలలో ఏసుక్రీస్తు నిజమైనసన్నిధి, దివ్యసత్ప్రసాద ప్రతిష్టాపన కారణాలు, ఇతర దివ్యసంస్కారాలపై దివ్యసత్ప్రసాదం యొక్క గణనీయ ఆధిపత్యం, పదార్ధలక్షణ ఆవృత సిద్ధాంతం, దివ్యసత్ప్రసాదమును నిల్వ ఉంచడం, దానిని రోగులకు పంచిపెట్టడం మొదలగునవి. అందువలన, దివ్యసత్ప్రసాదములో ఏసుక్రీస్తు వాస్తవ సన్నిధి, పదార్థా లక్షణ ఆవృతసిద్ధాంతం మరియు అప్పరస రూపాలలో నిరంతర యేసు సన్నిధి అనుఅంశాలను కతోలిక విశ్వాస ప్రబోధాలుగా శ్రీసభ దృఢంగా ప్రకటించింది. అటు పిమ్మట తన చట్టాలలో ఈ ప్రబోధాలను నిరాకరించు వారికి బహిష్కరణను ఒక శిక్షగా ప్రకటించింది.

ఈ ట్రెంటుమహాసభ ప్రబోధనలు అత్యంత ముఖ్యమైనవి. ఇప్పటికీ కతోలిక వేదాంతములో, తదుపరి జరిగిన అన్ని మహాసభలలో, ద్వితీయ వాటికను మహాసభలో కూడా, ఈ ప్రబోధనలే శ్రీసభను నడిపించాయి.

కావున, దివ్యసత్ప్రసాదంలో ఏసుక్రీస్తు నిజముగా వాస్తవముగా లక్షణముగా వేంచేసి ఉన్నారని మనము విశ్వసిద్దాము, దానిని యోగ్యముగా స్వీకరిద్దాము, గౌరవంతో భక్తితో దానిని ఆరాధిద్దాం మరియు ఆది వ్యసత్ప్రసాద అనుగ్రహములను మన జీవితంలో అనుభవిద్దాము.

# 3. దివ్య బలి పూజ - మానవుల రక్షణార్థమై స్వీయ సమర్పణతో క్రీస్తు బలి

- బ్రదర్ బాపనపాటి అలెక్స్



## ఉపోద్ఘాతం

బలి లేక త్యాగం అనేది ఒక మతపరమైన ఆచారం. ఇది మానవులు దైవానికి అర్పించే ఒక బాహ్యమైన కార్యము, సంస్కారము. మానవుడు దైవముతో సరియైన సంబంధమును ఏర్పాటు చేసుకోవడానికి, లేదా బంధమును స్థిరపరచుకోవడానికి, లేదా కోల్పోయిన బంధమును తిరిగి పునరుద్ధరించడానికి ఒక వస్తువును లేక జంతువును దేవునికి అర్పిస్తారు. ఈ బలిని ప్రజల తరపున అధికారికంగా నియమింపబడిన ఒక మత గురువు మాత్రమే దైవానికి సమర్పిస్తారు. అన్ని మతాలు కూడా దైవానికి బలులు అర్పించమని ప్రబోధిస్తున్నాయి.

దైవశాస్త్ర చదువులలో భాగంగా నేను ఈ బలుల మీద పరిశోధన చేసి ఈ అంశమును రాశాను. ఆ అధ్యయన సమయంలో నేను ఒక వ్యత్యాసమును కనుగొన్నాను: క్రీస్తు ప్రభువు కలువరి గిరిపై అర్పించిన బలికి మరియు ఇతరుల బలులకు మధ్య గొప్ప వ్యత్యాసం ఉంది. శ్రీసభ ప్రతిరోజు మనకు జ్ఞాపకం చేస్తున్నది: క్రీస్తు ప్రభువు సిలువ మీద సకల మానవాళి పాపం కొరకు తనను తాను అర్పించిన బలి, అర్పించడం మాత్రమే కాదు, 'నా శరీరమును భుజించండి, నా రక్తమును పానము చేయండి అని ఒక మహోన్నత కార్యాన్ని తన జ్ఞాపకార్థంగా, మనకు నిత్య జీవ మార్గముగా అర్పించాడు. క్రీస్తు ప్రభువు ప్రత్యక్షతను శ్రీసభ విశ్వసిస్తుంది. అప్పద్రాక్ష రసములలో క్రీస్తు ప్రభువు నిజముగా వాసం చేస్తున్నారని నమ్ముతుంది. అయితే ఇతర క్రైస్తవ సంఘాల వారు క్రీస్తు ప్రభువు ఉనికి అప్పద్రాక్ష రసాల్లో లేదని శ్రీసభ బోధనలను నిరాకరిస్తున్నారు.

నా అంశమును, నేను మూడు అధ్యాయాలుగా విభజించాను. మొదటి అధ్యాయంలో సాధారణ బలుల గురించి, ఎందుకు వాటిని దైవానికి అర్పిస్తారు అను అంశం గురించి, పాత నిబంధనలో ఇశ్రాయేలు ప్రజలు అర్పించిన బలుల గురించి, వాటి ప్రాముఖ్యత ఏమిటి అను విషయాల గురించి చర్చించాను. రెండవ అధ్యాయంలో, క్రీస్తు ప్రభువు కల్వరి గిరిపై రక్తం చిందిస్తూ అర్పించిన బలి గురించి వివరించాను. మూడవ అధ్యాయంలో, కల్వరి గిరిపై రక్తం చిందిస్తూ క్రీస్తు అర్పించిన బలి, నేడు గురువు బలిపీఠముపై దివ్య పూజగా అర్పిస్తున్న బలి - రెండు ఒకటే అని రుజువు చేయడానికి ప్రయత్నించాను. క్రీస్తు ప్రభువు ఇచ్చిన ఆజ్ఞను అనుసరించి కతోలిక శ్రీసభ ప్రభువు యొక్క ప్రణాళికను ఈ లోకంలో కొనసాగిస్తుంది. ఏ వ్యక్తి కూడా నశించి పోరాదు, ప్రతి ఒక్కరూ రక్షింపబడాలి అను ప్రభు ఉద్దేశ్యంతో ఏకమై శ్రీసభ మానవాళి రక్షణ నిమిత్తమై క్రీస్తు శరీర, రక్తములను పంచిపెడుతుంది.

యోహాను సువార్త 6:54లో, “నా శరీరమును భుజించి, నా రక్తమును పానము చేయువాడు నిత్యజీవము పొందును” అని యేసు క్రీస్తు పలికారు. కతోలిక శ్రీసభ ఆ యేసుక్రీస్తు ఆజ్ఞానుసారముగా అనేక మత కర్మల ద్వారా, పుణ్యపూరిత మార్గాల ద్వారా రక్షణ అనుగ్రహమును ఈ ప్రపంచానికి అందిస్తుంది.

## మొదటి అధ్యాయము

## సాధారణ బలి - దాని ప్రాముఖ్యత

బలి అనే భావానికి మానవ చరిత్రలో గౌరవప్రదమైన స్థానం ఉంది. నిజానికి ప్రాచీన మానవ చరిత్రలో బలులకు సంబంధించిన మూలాలు అనేకం కనిపిస్తాయి. ఆ మేరకు ప్రపంచవ్యాప్తంగా ఉన్న వివిధ మతాలకు చెందిన వారు, అనాది కాలము నుండి తమ తమ దేవుళ్ళకు పశువులను బలిగా సమర్పిస్తూ వచ్చారు. అనేక రూపాలలో కానుకలు అర్పిస్తూ వచ్చారు. అదేవిధంగా, మానవులు తమ తోటి మానవుల కోసం తమను తాము బలిగా అర్పించుకోవడం, తమ జీవితాలను స్వచ్ఛందంగా ఇతరుల కోసం త్యాగం చేయడం మానవ సమాజంలో సహజంగా కనిపిస్తున్న విషయాలు. మానవుని

యొక్క మత చరిత్రలో ‘బలులు’ లేదా “జంతు బలులు” ప్రధాన పాత్ర పోషిస్తున్నాయి. ఈ అధ్యాయంలో, ఈ బలులు ఎక్కడ నుండి వచ్చాయి, ఎందుకు ఈ బలులను దైవానికి సమర్పిస్తారు మరియు పాత నిబంధన బలుల ప్రాముఖ్యత ఎటువంటిది అని తెలుసుకుందాం.

### 1.1. బలి: మూలం, అర్థం, నేపథ్యం

బలి లేక త్యాగం అను పదం “సాక్రిఫిశియుం” అను లతీను భాష నుండి స్వీకరించబడింది. దీని అర్థం, పవిత్రంగా చేయడం లేదా దేవునికి ఇవ్వడం. దేవునికి సమర్పించడం ద్వారా ఒక వస్తువును లేదా ఒక జంతువును పవిత్రంగా పరిగణించడం జరుగుతుంది. ఈ పదమును గ్రీకు మరియు సంస్కృత భాషలతో పోల్చినప్పుడు దీనిని “తూసియా” అని అంటారు. అనగా దహనం లేదా పైకి లేపడం. బలిని గురించి తెలుసుకోవాలంటే అనేక సిద్ధాంతాలు ఉన్నాయి. ఇది ‘ప్రజల అంతరంగిక సంఘర్షణలు’ లేదా ‘అపరాధ భావము నుండి వచ్చింది’ అని కొందరు నమ్ముతారు. ఇది ‘దైవానికి మరియు మానవునికి మధ్య ఉన్న సంబంధము’ను నిలబెడుతుంది అని మరికొందరు అంటారు. దీన్ని బట్టి చూస్తే అన్ని మతాలలో తరచుగా దైవానికి బలిని అర్పించే ఆచారాలు ఉన్నాయి అని తెలుస్తుంది.

### 1.2. బలి: దాని ప్రయోజనం లేదా లక్ష్యం

బలులు సమర్పించడం ఒక మతపరమైన ఆచారం. మానవుని పాప కారణంగా దేవునికి మానవునికి ఉన్న బంధంలో కలిగిన లోపమును సరి చేయుటకు మానవుడు దేవునికి సమర్పించు కార్యమే ఈ బలి. ఇదియే దాని ఉద్దేశం కూడా. ఈ బలిలో దేవునికి మానవునికి మధ్య విచ్ఛిన్నమైన బంధం తిరిగి నిర్మించడం జరుగుతుంది. మరో మాటలో, దేవునికి, మానవునికి మధ్యమన్న ఆగాదం పూడ్చబడుతుంది, లేదా తెగిన సంబంధం పునరుద్ధరింపబడుతుంది. ఇది దేవుని ఆమోదమును పొందిన కార్యం. పరిశుద్ధ గ్రంథం ప్రకారం చూస్తే, సర్వేశ్వరునికి అనగా దేవునికి మాత్రమే ఈ బలులను అర్పిస్తారు. అతడు పవిత్రుడు, దయామయుడు, కరుణాపూరితుడు. బలులను మనసా వాచా కర్మణా భక్తి పూర్వకంగా దేవునికి అర్పించాలి. ఇది

మూఢ భక్తితో ఏమాత్రము పోల్చదగినది కాదు. బలి అనగా మానవులు తమ అపరాధమును స్పృహతో అంగీకరించడం. ఈ విధంగా బలి రూపములో దైవానికి అర్పిస్తే అది దేవునకు చెందుతుంది. వారి మధ్య ఉన్న బంధం బలపడుతుంది. కాబట్టి బలి యొక్క ప్రధాన ఉద్దేశం: ప్రజలను బలహీనతల నుండి, అవినీతి మార్గముల నుండి, అంతరంగంలో బాధపెడుతున్న అనేక సమస్యల నుండి, విముక్తిని కలిగించి వారిని చైతన్యవంతం చేయడం. ఈ బలి కార్యము వలన, ఇటు మానవుని దీనత్వం, అటు దేవుని ఔన్నత్యం, రెండు కూడా స్పష్టమవుతున్నాయి. ఈ బలుల ద్వారా దేవుడు మానవాళి చెంతకు తన అద్భుతమైన శక్తితో వేంచేసి వస్తాడు. కాబట్టి ఈ బలులను పవిత్రంగా సమర్పించాలి. అలా కాకుండా, ఆ బలులు ఒక బాహ్యమైన ఆచారంగా మాత్రమే మిగిలిపోతే, కేవలము ఆచారం కోసమే బలులు అర్పిస్తే, వాటి ప్రభావం మరియు వాటి విలువ కోల్పోయే ప్రమాదం ఉంది.

## 1.3. బలి: ఒక మత ధర్మం

మతం యొక్క మూలధర్మం, అది ఉండే స్వభావమును బట్టి, అది అనుగ్రహించే ఫలాలను బట్టి అభివృద్ధి చెందుతుంది. క్రైస్తవ ధర్మాన్ని దాని ప్రధాన లక్షణాలను పరిగణలోనికి తీసుకోవడం ద్వారా బలి యొక్క అవగాహన దాని ధర్మం వెల్లడి అవుతుంది.

**మొదటిది:** మానవుడు, దేవుని పట్ల ఆంతరంగిక గౌరవం మరియు ఆరాధనను చూపించడానికి మతం దోహదపడుతుంది. దీనిద్వారా మనము దైవాన్ని సృష్టికర్తగా, అత్యున్నత పాలకునిగా ఆరాధిస్తాము. ఈ ధర్మం ద్వారా మన దేవుడైన ప్రభువును గౌరవిస్తాము.

**రెండవది:** మన జీవితములో చిన్నదైనా పెద్దదైనా, ఏ కార్యము తలపెట్టినా, అది దేవుని మహిమ కోసమే చేయాలి. ఈ సత్యమును గ్రహించాలి. పునీత పౌలు ఇలా అంటాడు: "మీరు తినినను, త్రాగినను ఏమి చేసినను దేవుని మహిమార్థము చేయండి". పునీత అగుస్తీను ఇలా అంటాడు: "క్రైస్తవ విలువలైన విశ్వాసం, నమ్మిక, ప్రేమతో దేవుని ఆరాధించాలి". అనగా మన ప్రతి కార్యము, ప్రతి బలి దైవ మహిమ కొరకై నిర్వహింపబడాలి.

**మూడవది:** దేవుని ఆరాధించడంలో కొన్ని స్థాయిలు ఉన్నాయి, కొన్ని మార్గాలు ఉన్నాయి. వాటిలో ప్రధానంగా, దేవుని స్తుతించడం, కృతజ్ఞతలు తెలియజేయడం, విజ్ఞాపన ప్రార్థనలు చేసి పాపపరిహారమును పొందడం. ఇవి కేవలం బాహ్యంగా మాత్రమే కాదు, అంతరంగములో, మన ఆత్మలో జరగాలి. అప్పుడు మాత్రమే దేవుని మనము సంతోషపెట్టగలము. పూర్ణ స్వేచ్ఛతో, సంపూర్ణ స్పృహతో, ఒక కార్యమును తలపెట్టినప్పుడు భౌతికంగా ఆధ్యాత్మికంగా మనం దేవునికి మహిమను చేకూర్చగలము.

## 1.4. పరిశుద్ధ గ్రంథములో "బలి అర్పణం"

ఇశ్రాయేలు ప్రజల జీవితాలలో అత్యంత ప్రధానమైనది – 'దైవార్చన'. ఇశ్రాయేలీయుల దృష్టిలో 'దైవార్చన' అనగా యావే దేవునికి తాము భక్తి ప్రపత్తులతో సమర్పించే బలి అని అర్థము. ఈ బలి అర్పణములను, వాటికి సంబంధించిన కర్మకాండలను, ఇశ్రాయేలు ప్రజలు అత్యంత పవిత్రంగా భావించేవారు. ఈ సంగతుల గురించి పరిశుద్ధ గ్రంథంలో ముఖ్యముగా లేవీయ కాండములో వివరించబడింది.

అయితే ఇక్కడ దేవునికి బలి అర్పించే వ్యక్తి అర్పణ సందర్భాలలోనే బలులను సమర్పించేవారు. ఎందుకనగా, ప్రధాన పర్వదినాలలోనే ఇశ్రాయేలు ప్రజలు అధిక సంఖ్యలో యెరూషలేము దేవాలయానికి వచ్చి దైవార్చనలు చేయించేవారు. ఇటువంటి పర్వదినాలలోనే మతపరమైన, రాజకీయ పరమైన అనుబంధము సంఘీభావము బలపడుతూ ఉండేవి. . ఇశ్రాయేలు పండుగలలో ప్రధానమైనవి మూడు: పాస్కా పండుగ (లేవి 23:4,5; సంఖ్యా 28:16–25), పెంతెకోస్తు పండుగ (సంఖ్యా 28:26–31), మరియు ఏడవ నెల మొదటి రోజు నూతన సంవత్సర పండుగ (లేవీ 23:23). ఈ మూడు పండుగల సందర్భాలలో మాత్రమే కాకుండా, పశ్చాత్తాప దినం రోజు కూడా యూదులు దేవునికి బలులు అర్పించేవారు. పూర్వ నిబంధన బలులన్నీ మతపరమైన ప్రాధాన్యత సంతరించుకొని ఉన్నాయి. పరిశుద్ధ గ్రంథంలో ఉన్న కొన్ని బలుల గురించి తెలుసుకుందాం.

### 1.4.1. దహన బలులు (లేవి 1:1-17)

ఇశ్రాయేలు ప్రజలు తాము చేసే దైవార్చనలలో ఎక్కువగా దహన బలులను సమర్పించేవారు. హీబ్రూ భాషలో ఓలహ 'Holah' అని పిలిచేవారు. ఈ తరహా బలులలో దేవునికి సమర్పించే కానుకలను గాని, బలి పశువులను గాని దేవాలయంలోని బలిపీఠాలపై దహనం చేస్తారు. ఈ విధముగా బలి వస్తువులను అగ్నిలో దహనం చేస్తూ అర్పించే బలులను దహన బలులు అని పిలుస్తారు. ఈ దహన బలులను కొన్నిసార్లు పాపపరిహారం కోరుతూ దేవునికి సమర్పించేవారు. అలాగే దేవునికి ప్రత్యేకంగా ఏవైనా మనవులను, విన్నపాలను చేయవలసి వచ్చినప్పుడు దహన బలులను సమర్పిస్తారు. ఇటువంటి భక్త జనులు సమర్పించే దహన బలుల సువాసన వలన యావే దేవుడు సంతృప్తి చెందుతారని ఇశ్రాయేలీయుల ప్రగాఢమైన విశ్వాసం (లేవీ 1:9,13,17). ఇటువంటి దహన బలులలో కొన్నింటి గురించి పూర్వ నిబంధన మనకు తెలియజేస్తుంది. వాటిలో ప్రధానమైనవి కొన్ని:

మొదటిది: నోవా భక్తుడు జల ప్రళయం తదనంతరం యావే దేవునికి సమర్పించిన దహన బలి - ఆది 8:20.

రెండవది: బేత్సమేషు పౌరులు ఫిలిస్తీయుల దేశము నుండి ప్రభువు మందసాన్ని తిరిగి స్వాధీనం చేసుకున్న తరువాత సమవేలు ప్రవక్త (1 సమూవేలు 7:9,10,18), సౌలు రాజు (1 సమూయేలు 13:9-10), దావీదు రాజు (2 సమూయేలు 17:18), సొలోమోను రాజు (1 రాజుల గ్రంథము 3:4, 9:25) యావే దేవుని ఆరాధిస్తూ దహన బలులు సమర్పించారు.

మూడవది: ఇశ్రాయేలు ప్రజలను పీడిస్తున్న అంటు రోగాలను పారద్రోలడానికి యావే దేవుని ఆదేశం ప్రకారం దహన బలి సమర్పించబడింది (2 సమూయేలు 24:20-22).

నాలుగవది: ఏలియా ప్రవక్త కర్మెలు కొండమీద బాలు ప్రవక్తలను సవాలు చేస్తూ ప్రభువైన దేవుని ప్రార్థించి, ప్రభువే స్వయంగా ఆకాశము నుండి అగ్నిని పంపించి దహనబలి గావించారు (1 రాజులు18:20-40).

## 1.4.2. సమాధాన బలులు (లేవీ 7:11-21)

హీబ్రూ భాషలో సమాధాన బలిని "షలేమ్" అని పిలుస్తారు. ఇతరులతో అనుబంధాలను స్నేహ బంధాలను ఏర్పరచుకొను సందర్భాలలో ఇటువంటి సమాధాన బలులను సమర్పిస్తారు. ఈ సమాధాన బలులను సంక్షేమ బలులు అని కూడా అంటారు. ఇశ్రాయేలీయులు సమర్పించే ఈ సమాధాన బలులు - వారు ప్రభువైన దేవునితో చేసుకున్న ఒడంబడికకు కట్టుబడి ఉన్నారని అని చెప్పడానికి నిదర్శనంగా ఉంటాయి. ఈ బలులను అర్పించడం ద్వారా ప్రజలు ప్రభువైన దేవునితో సమాధానపడాలని ఆశిస్తారు. ఈ సమాధాన బలులను అర్పించడం ద్వారా ప్రజలు ప్రభువైన దేవునితో చేసుకున్న ఒడంబడికలోని నిబంధనలను పాటించిన వారవుతారు. అలాగే దేవుని వైపు నుండి ఆలోచిస్తే, ఈ సమాధాన బలుల ద్వారా మానవులతో దేవునికి సఖ్యత సంబంధాలు ఏర్పడతాయి (యెషయా 54:10).

### ఈ సమాధాన బలులను రెండు రకాలుగా పేర్కొనవచ్చు

మొదటిది - **స్తుతి బలి:** ఇది ప్రభువైన దేవుడు తమకు చేసిన మేలులకు గాను కృతజ్ఞతలు తెలియజేస్తూ భక్తజనులు సమర్పించే బలి, లేదా దేవుని మహత్యాన్ని స్తుతిస్తూ సమర్పించేదే సమాధానబలి ( లేవీ 7:12-15, 22:29-30).

రెండవది - **స్వచ్ఛంద బలి లేదా స్వేచ్ఛపూరితమైన బలి:** ఈ కోవకు చెందినవే పాపపరిహార బలులు. ఈ పాప పరిహార బలులను ఇశ్రాయేలు ప్రజలు తాము దేవునికి మరియు సాటి మానవులకు వ్యతిరేకముగా చేసిన అపరాధములకు పరిహారముగా చెల్లిస్తారు (లేవీ 7:16-17).

## 1.4.3. అపరాధ బలులు (లేవి 6:1-7)

ఈ అపరాధ బలులను ఇశ్రాయేలు ప్రజలు ఎప్పుడైతే వారు దేవుని ఆజ్ఞలకు విరుద్ధంగా ప్రవర్తిస్తారో, అప్పుడు పాప క్షమాపణ కోరుతూ ప్రజలు తమ మంద నుండి అవలక్షణములేని పొట్టేళ్లను యాజకుని వద్దకు దోష పరిహార బలిగా తీసుకొని వస్తారు. అప్పుడు యాజకుడు ప్రభువు సమక్షంలో ఆ వ్యక్తికి ప్రాయశ్చిత్తము చేయగా అతని దోషము పరిహరింపబడుతుంది.

### 1.4.4. ఇశ్రాయేలీయుల ఇతర బలులు

ఇశ్రాయేలు ప్రజలు తమ పొలములలో పంటలు బాగా పండినప్పుడు ప్రభువైన దేవుడు తమ పైరు పంటలను చల్లగా చూచినందుకు కృతజ్ఞతగా దాన్య బలులను సమర్పించేవారు. ఇంకొన్నిసార్లు ధాన్యంతో పాటు సాంబ్రాణిని కూడా కలిపి బలిపీఠం మీద దహిస్తూ దేవునికి బలులు అర్పిస్తారు. ధాన్యబలులు సమర్పించే వారైనా, జంతు బలులు అర్పించే వారైనా, అందరూ దేవుని సంతుష్టి పరచడానికి, ఆయన ప్రసన్నతను పొందడానికి తమ బలులను సమర్పిస్తారు. దైవానుగ్రహాలను ఆశీస్సులను పుష్కలంగా పొందాలని కోరుకుంటారు. ఆదికాండము 8:20లో చూసినట్లయితే, భక్తుడైన నోవా అర్పించిన బలి ఇటువంటిదే అని తెలుస్తుంది. అతడు ప్రభువు చేసిన మహోపకారానికి ధన్యవాదములు తెలుపుకుంటూ సమర్పించిన బలి కృతజ్ఞతా బలి. అయితే పూర్వ నిబంధనలోని అనంతర కాలంలో శుద్ధికరణ కోరుతూ, జీవితములో ఉన్నతిని కోరుతూ, ఆధ్యాత్మిక పురోగమనమును కోరుతూ ప్రభువైన దేవునికి బలులు సమర్పించే సరికొత్త సాంప్రదాయాలు కూడా ఆచరణలోనికి వచ్చాయి.

### 1.5. బలి అర్పణ - శుద్ధికరణ సంస్కారము

ఆనాడు ఇశ్రాయేలు ప్రజలు ప్రభువైన దేవునికి బలులు సమర్పించడం ద్వారానే తాము శుద్ధి పొందుతామని నమ్మేవారు. కనుకనే పాపపరిహారం కోసం, దోష పరిహారం కోసం, కృతజ్ఞతా స్తుతులు చెల్లించడం కోసం వారు సాంప్రదాయ పద్ధతిలో దేవునికి బలులను అర్పించేవారు.

ప్రభువైన దేవునికి అర్పించే బలుల ఫలితంగా భక్తజనులు పొందే ఆధ్యాత్మిక శుద్ధీకరణ ఒక మతపరమైన అంశము. ఈ శుద్ధీకరణ ప్రక్రియకు మూలము దేవుడు. శుద్ధీకరణ పర్యవసానం పవిత్రత మరియు పవిత్ర జీవనం. ఈ శుద్ధీకరణ ప్రక్రియలో ఇద్దరు వ్యక్తుల ప్రమేయం స్పష్టంగా కనిపిస్తుంది. ఒకరు ప్రభువైన దేవుడు, మరొకరు మానవుడు.

దేవుడు: దేవుని సంకల్పం తెలుసుకున్న మానవుడు విధిగా ఆత్మ శుద్ధీకరణం పొందాలి. పరిశుద్ధుడు, పవిత్రమూర్తి అయిన దేవుడు స్వయంగా తన ప్రజలను పవిత్ర మార్గానికి ఆహ్వానిస్తాడు. సాక్షాత్తు తానే వారిని శుద్ధీకరిస్తాడు (నిర్గమ 31: 13; యెహెజ్కేలు 37: 28)

మానవుడు: మానవులు ఆత్మ శుద్ధీకరణకు ప్రభువు చూపించే పుణ్య మార్గాన్ని అనుసరించాలి. పవిత్ర జీవన ప్రణాళికలను నిష్టగా పాటించాలి. నేను వారి నడుమ చేసిన కార్యములను చూచి, వారి సంతానము నన్ను పవిత్రునిగా నెంచి పూజించును, వారు నన్ను కొలిచెదరు, నన్ను గాంచి భయపడుదురు (యెషయా 29:23) అని ప్రభువు ఆజ్ఞాపిస్తున్నాడు.

## 1.6. పాత నిబంధనలో బలుల వ్యవస్థ – వేదాంత తాత్పర్యము

దేవుడు ఎన్నుకున్న ప్రజలు ఇశ్రాయేలు ప్రజలు. వీరు దేవునికి ప్రత్యేకమైన వారు. పరిశుద్ధ గ్రంథంలో పరిశీలించి చూసినట్లయితే, ఐగుప్తు దేశములో బానిసత్వపు ముసుగులో మగ్గిపోతున్న ఇశ్రాయేలు ప్రజలను మోషే నాయకత్వమున ఆ దేవాతిదేవుడు వారిని విడిపించారని మనము తెలుసుకుంటున్నాము. అలా వారిని ఎడారి గుండా నడిపించుకుని వస్తున్న మార్గంలో వారి అలవాట్లు, పద్ధతులు, జీవన మార్గాలు గమనించి ప్రభువు వారికి ఆజ్ఞలను ఇచ్చారు. ప్రభువు చూపించిన మంచి మార్గంలో జీవించడానికి ఈ ఆజ్ఞలు దోహదపడేవి. దేవుడు వారి నుండి కోరుకునేది ఒకటే: వారు పవిత్రంగా జీవిస్తూ అతని చిత్తనుసారంగా నడుచుకోవడమే. కానీ బలహీనులైనటువంటి ఇశ్రాయేలు ప్రజలు పలుమార్లు దేవునికి విరుద్ధముగా పాపం కట్టుకుంటున్నారు. దేవునికి వారికి మధ్య ఉన్న సంబంధం బలహీన పడసాగింది. సీనాయి పర్వతం వద్ద దేవుడు వారితో చేసుకున్న పవిత్ర ఒప్పందము ః నేను మీ దేవుడను, మీరు నా ప్రజలు. ఈ పవిత్ర ఒడంబడికను జ్ఞాపకం చేసుకుంటూ, దానిని పునరుద్ధరించుకోవడానికి వారు దేవునికి బలులను అర్పిస్తూ వచ్చారు. దేవుడు కూడా ఆ బలులతో సంతృప్తి చెంది ప్రజలను క్షమిస్తూ వచ్చారు. అలాగే ప్రభువు వారికి చేసిన మేలులకు కృతజ్ఞతగా వారు దేవునికి సమర్పిస్తూ వచ్చారు. దాని కారణంగా దేవునితో వారి బంధం బలపడుతూ వచ్చింది. అనగా, పాత నిబంధన బలుల ద్వారా దేవునికి మానవునికి మధ్య ఉన్న బంధం నూత్నీకరించబడింది, ఈ బలులు కృతజ్ఞతకు సూచనగా ఉన్నాయి అని మనకు అర్థమవుతుంది.

## 1.7. పాత నిబంధన బలుల తాత్పర్యం, సమర్థత

ఇశ్రాయేలు ప్రజలు, దేవునికి సమర్పించే బలులలో రెండు విధాల బలులు కనిపిస్తున్నాయి. ఒకటి, రక్త పూరిత బలులు అనగా రక్తమును చిందించే బలులు; రెండు, రక్తరహిత బలులు అనగా రకం చిందించకుండా అర్పించు బలులు. ఈ బలులన్నీ కూడా క్రీస్తు శకానికి ముందుగా ఉన్నటువంటి బలులు. ఈ రక్తపూరిత బలులు ఇశ్రాయేలీయుల సమర్పణలో ప్రధాన పాత్ర పోషిస్తున్నాయి. వారు ఈ బలులను తరచుగా దేవునికి అర్పించేవారు. ఇవి రకరకాలుగా విభజింపబడి ఉన్నాయి.

**దహన బలులు:** ఈ దహన బలిలో జంతువును చంపి కాల్చాలి. అలా కాల్చినప్పుడు దాని నుండి వచ్చే పొగకు దేవుడు సంతృప్తి చెందుతాడని వారి నమ్మకం.

**సమాధాన బలులు:** ఈ సమాధానబలిలో జంతువులు కోసిన తర్వాత, మాంసంలో కొంత భాగాన్ని మాత్రమే కాల్చి, దానిని అర్పించిన యాజకులతో కలసి భుజిస్తారు.

**పాప పరిహార బలి:** దీనిని ప్రాయశ్చిత్త బలి అని కూడా అంటారు. ఈ బలి దేవుని కోపాన్ని లేక ఉగ్రతను శాంతింప చేయడానికి అర్పిస్తారు. అలా చేయడం వలన దేవుడు వారిని వారి పాపముల నుండి క్షమిస్తాడు.

ఈ బలులన్నీ కూడా ప్రధానమైనవి. ఇశ్రాయేలీయుల బలులు మరియు పాత నిబంధనలోని ప్రతీ బలి, క్రీస్తు సిలువపై అర్పించిన బలిని సూచిస్తున్నాయి. పాత నిబంధన బలులను తలచి చూస్తే ఒక సత్యం బోధపడుతుంది: ఈ పాత నిబంధన బలులకు పాపము చేసిన వ్యక్తి మనోభావాన్ని, లేక మనస్థాపం చెందిన వ్యక్తిని గాని, తన దోషము నుండి మనసుకు శాంతిని అందించగల శక్తి సామర్థ్యం లేదు. అందుకే పునీత పౌలు హెబ్రీయులకు వ్రాసిన లేఖలో 10:4లో ఈ విధంగా సెలవిస్తున్నాడు: "ఎద్దుల మేకల రక్తము ఏనాటికిని పాపములను తొలగింపలేదు". కనుక మనం గుర్తించవలసిన ఒక సత్యం: పాత నిబంధనలోని బలులన్నీ కూడా కల్వరి గిరిలో క్రీస్తు సిలువపై తనను తాను మానవుల పాపపరిహారం నిమిత్తమై అర్పించిన బలిని సూచిస్తున్నాయి.

## రెండవ అధ్యాయము

## క్రీస్తు సిలువపై అర్పించిన రక్తసిక్త బలి

పాత నిబంధనలోని బలులన్నీ అసంపూర్ణమైన బలులుగా, అత్యల్పమైన బలులుగా పరిగణింపబడ్డాయి. ఎందుకంటే కేవలము జంతువుల యొక్క రక్త మాంసములు మానవుని పాపములను పరిహరింపలేవు. మానవుల పాప పరిహార బలికి ఏ క్రొవ్విన కోడెదూడ గాని, శ్రేష్ఠమైన గొర్రె పిల్ల బలి గాని సరిపోదు. ఈ బలులు మానవుడు ప్రాయశ్చిత్తం చేసుకోలేని పాపాలకు గుర్తుగా ఉన్నాయి. పాత నిబంధనలోని ఏ రక్తపు బలి కూడా మనకు సంతృప్తినివ్వదు. కేవలము మనిష్య కుమారుని రక్త ప్రోక్షణ ద్వారా మాత్రమే పాపములకు ప్రాయశ్చిత్తం కలుగుతుంది. ఆ పవిత్ర రక్తము ద్వారా మన పాపములు పరిహరింపబడడమే కాక, సకల మానవాళి పవిత్రీకరింపబడుతుంది. ఏలయన, ఈ కారణముననే తన రక్తముచే ప్రజలను పాపముల నుండి శుద్ధి చేయుటకు యేసు మరణించెను (హెబ్రీ 13:12).

### 2.1. యేసు ప్రభువు – మానవజాతి ప్రతినిధి

యేసు దైవస్వభావము, మానవ స్వభావము కలిగి జీవించి మనకు ప్రభువై ఉన్నాడు. మానవాళి చేసిన సకల పాపముల పరిహారమునకై ఈ లోకమున జన్మించాడు. తద్వారా ఆయన మనలను తండ్రి దేవునితో సఖ్యత కలిగి జీవించినట్లు స్థిరపరచాడు. పరిశుద్ధ గ్రంథంలో చెప్పబడినట్లుగా, ఆది తల్లిదండ్రులైన ఆదాము, ఏవలు దేవునికి వ్యతిరేకముగా పాపము చేసిరి. ఆ పాప ఫలితముగా వారు ఆత్మ యొక్క ఆంతరంగిక కృపను కోల్పోయిరి. ఆ కృపను తద్వారా సకల మానవాళి కోల్పోయింది. యేసుక్రీస్తు, మానవుడు పోగొట్టుకున్న ఆ కృపను తిరిగి ఇవ్వడానికి మానవాళి తరఫున ఒక ప్రతినిధిగా ఒక సమాధానకర్తగా తండ్రి ఎదుట నిలుచుని ఉన్నాడు. మానవాళి యొక్క పాపపు మచ్చను తొలగించుటకు, తన రక్తమును చిందించి, పాప ప్రక్షాళన గావించాడు. తద్వారా తండ్రి దేవుని ఇష్టపుత్రునిగా ఈ లోకమున మానవాళిని పాపముల నుండి విముక్తులను గావించి రక్షణ మార్గమును చూపించాడు. యేసుక్రీస్తు దైవ స్వభావమును కలిగి ఉన్నను మానవ మాత్రునిగా శరీర

రక్తములను కలిగి ఈ లోకమున మనతో ఒక సోదరునిగా జీవించాడు. పరిశుద్ధ గ్రంథము ఇట్లు పలుకుచున్నది: మానవాళి రక్షణమునకై క్రయ ధనముగా ఆయన తనను తాను అర్పించుకొనెను (1 తిమోతి 2:6).

ఈ ప్రాతినిధ్యపు బలి పాత నిబంధనలో మరియు నూతన నిబంధనలో అనేక వాక్యములకు సూచనగా కనిపిస్తుంది. ఈ ప్రాతినిధ్యపు బలి గురించి యెషయా ప్రవక్త తన గ్రంథములో ఇలా ప్రస్తావించాడు: అతడు తన ప్రాణములను అర్పించెను, దుష్టుడిగా ఎంచబడెను. అతడు పెక్కుమంది దోషములను భరించి వారి పాపముల పరిహారము కొరకు విజ్ఞాపనము చేసెను (యెషయా 53:12). నూతన నిబంధనలో పునీత పేతురు క్రింది విధంగా ప్రకటిస్తున్నాడు: మనము పాపమునకు మరణించి, నీతి కొరకు జీవించినట్లుగా, ఆయన మన పాపములను తనపై ఉంచుకొని సిలువను మోసెను. ఆయన పొందిన గాయములచే మీరు స్వస్థత నొందితిరి (1 పేతురు 2:24).

సమస్త మానవాళి పాప భారములు తాను మోసి, ఒక దివ్య గొర్రె పిల్లగా బలి అర్పణ గావించుకొని, యేసు మానవాళిని రక్షించాడు. అధికమైన దైవిక ప్రేమ, నిజంగా దేవుని ఏకైక కుమారుడైన యేసుక్రీస్తులో ప్రత్యక్ష పరచబడింది. శాశ్వతమైన శాపం నుండి, అగాధమైన శ్రమల నుండి పాపులమైన మనలను రక్షించుటకు అత్యంత బాధాకరమైన సిలువ మరణమును యేసు అనుభవించాడు.

## 2.2. సిలువపై యేసు క్రీస్తు మరణం: సత్యమైన, యోగ్యమైన బలి

సిలువపై యేసుక్రీస్తు మరణం, అన్ని బలులకంటే ప్రధానమైనది మరియు యోగ్యమైనది. యేసుక్రీస్తు సిలువబలిని ఎందుకు సత్యమైన బలిగా యోగ్యమైన బలిగా పరిగణించాలి? మానవాళిని అవినీతి మార్గము నుండి తప్పించి, దేవుని వైపు మరల్చుటకు తనను తాను బలి అర్పణం గావించుకున్నాడు. ఈ ప్రణాళిక మానవ చరిత్ర ఆరంభంలోనే ప్రకటించబడింది.

పాత నిబంధన గ్రంథములో ఇశ్రాయేలు ప్రజలు పాప పరిహార బలిగా గొర్రె పిల్లలను అర్పించేవారు. ఒక గొర్రె పిల్లను వధించడం పాప మన్నింపునకు సూచికగా ఉండేది. మానవాళి యొక్క అన్ని పాపముల తరుపున, యేసు ఒక బాధితుడుగా గొర్రెపిల్ల బలికంటే విలువైన బలిగా తండ్రికి అర్పించబడ్డాడు.

పునీత పౌలు పలుకులు, ఈ సత్యమునకు సాక్ష్యం ఇస్తున్నాయి: మన నిమిత్తము దేవుడు ఆయనను పాపముగా చేసెను. ఏలయన, ఆయనతో ఏకమగుట వలన మనము దేవుని నీతిగా రూపొంద వలనని అట్లు చేసెను (2 కొరింథీ 5:21). సర్వశక్తిమంతుడైన దేవునిగా అతడు సమస్త మానవాళి యొక్క పాపములను తనపై వేసుకొని, వాటిని సిలువ మరణం వరకు మోయగలిగాడు. అతడు సిలువపై తనను తాను అర్పించుకున్నప్పుడు దేవునికి స్వచ్ఛమైన, నిర్మలమైన మచ్చలేని ఒక బలిని సమర్పించాడు. ప్రధాన యాజకునిగా యేసుక్రీస్తు ప్రపంచంలోని పాపాలకు ప్రాయశ్చిత్తముగా తనను తాను అర్పించుకున్నాడు

నిజమైన బలి కావాలంటే అది యేసుక్రీస్తు ద్వారా మాత్రమే సాధ్యం కావాలి. యేసుక్రీస్తు సిలువ బలి సంపూర్ణంగా స్వచ్ఛమైనది మరియు స్వచ్ఛందమైనది. యెషయా ప్రవక్త చెప్పినట్లుగా క్రీస్తు బలవంతం లేకుండా వినయముతో స్వీయ ఇష్టంతో తనను తాను సమర్పించుకున్నాడు (యెషయా 53:7). యేసు అనుకుంటే ఈ సిలువబలి నుండి తప్పించుకొనగలడు, కానీ ఆయన అలా చేయలేదు. మన రక్షకుని యొక్క యాజక కార్యకలాపం మొదట ఆత్మతో మరియు హృదయముతో సాధించబడింది. తన బలి అదృశ్యంగా కాకుండా బహిరంగంగా మానవాళి పాపాల కోసం సిలువ మరణమును పొంది చూపించాడు. అతడు నిజమైన మరియు యోగ్యమైన బలిని అర్పించాడు. అతడు తీవ్రమైన పరీక్షలు మరియు కష్టాలు ఎదుర్కొన్నాడు. అతడు మరణించినట్లు ఈ లోకంలో ఎవరును మరణించలేదు, మరణింపలేరు. అతని మరణం చాలా ఘోరమైనది. అతని మరణం అనంతమైనది. తండ్రి దేవునికి పూర్తిగా క్రీస్తు ప్రభువు అంకితమయ్యాడు. మరణాన్ని సంతోషంగా స్వీకరించాడు. అతని మరణం ద్వారా సకల మానవాళిని పాపముల నుండి క్షమించాడు. పునరుత్థానం ద్వారా క్రీస్తు బలి సంపూర్ణమైంది అని అనడం కంటే, ఎప్పుడైతే క్రీస్తు తనను తాను తండ్రి దేవునికి సమర్పించుకున్నాడో అప్పుడే అతని బలి సంపూర్ణమైంది అని చెప్పవచ్చు.

## 2.3. క్రీస్తు శ్రమలు మరణము: మానవాళికి రక్షణము

యేసుక్రీస్తు మంచి గొర్రెల కాపరి. గొర్రెల కాపరి తన గొర్రెల కొరకు తన ప్రాణమును ధారపోయును (యోహాను 10:1–21). మంచి కాపరి అయిన యేసుక్రీస్తు లోనే మనకు రక్షణ. ఈ ఆలోచనను పెంపొందిస్తూ, ద్వితీయ వాటికను మహాసభ ఇలా అంటుంది: "ఒక అమాయక గొర్రె పిల్లగా, క్రీస్తు స్వేచ్ఛగా చిందించిన రక్తము ద్వారా మనము ఇప్పుడు రక్షణ పొందుచున్నాము. క్రీస్తులో దేవుడు మనలను తనతో మరియు ఒకరితో ఒకరు సఖ్యత కలుగునట్లు చేశాడు. క్రీస్తు మరణం ద్వారా దేవుడు మనలను పాపపు బానిసత్వం నుండి విడిపించాడు. సమస్త మానవాళికి రక్షణను అనుగ్రహించాడు. మనకోసం బాధలు అనుభవించడం ద్వారా, ఆయన అడుగుజాడల్లో నడవడానికి, ఒక మాదిరిగా, ఒక ఉదాహరణగా, ఒక ఆదర్శంగా ఆయన నిలిచాడు. అతడు జీవించిన విధంగా మనము జీవిస్తే, అనగా నిర్మలమైన జీవితాన్ని జీవిస్తే మన జీవితము పవిత్రీకరింపబడుతుంది. ఈ జీవితము నూతన అర్థాన్ని ఇస్తుంది. పవిత్ర గ్రంథములో అతని గురించి ప్రస్తావింపబడిన ప్రతి ప్రవచనం అతని శ్రమలు, మరణం, పునరుత్థానములో పరిపూర్తి అవుతున్నాయి. అతని ద్వారా మానవాళి దేవునితో సమాధాన పరచబడింది.

### 2.3.1. క్రీస్తు ప్రభువుని మరణ బలి పాత్ర

క్రీస్తు మరణం నిజమైన బలి. అది తండ్రి దేవునికి మాత్రమే అర్పింపబడిన బలి. ఈ బలి పాత నిబంధన బలి వంటిది కాదు. వాటిని మించిన యోగ్యత కలిగిన బలి. అయినప్పటికీ పాత నిబంధనలోని మూడు బలి అర్పణలకు ఈ క్రీస్తు బలి దగ్గరి సంబంధం కలిగి ఉంది.

**మొదటిది:** ఒడంబడిక బలి, ఒడంబడిక చేయడానికి బలి కూడా అవసరమై ఉంది. అది తండ్రి దేవుని ద్వారా స్థాపించబడి ఉంది. క్రీస్తు బలి నూతన నిబంధనకు నాంది పలికింది. ఆ నూతన బలి నిస్వార్థమైనది, స్వీయమైన ప్రేమ కలిగిన బలి. మన పట్ల దేవుని ప్రేమ, దేవుని కుమారుని అనగా క్రీస్తుని స్వీయ సంభాషణ, స్వీయ సమర్పణ ప్రారంభమవుతుంది. తన శ్రమల పాటుల మరణం ద్వారా యేసు మానవాళిపై తనకున్న ప్రేమను చాటుతున్నాడు. తద్వారా

మనము తండ్రి కుమారులతో ఐక్యమై జీవిస్తున్నాము. దివ్య బలి పూజలో మనము క్రీస్తు ద్వారా గుర్తించబడిన తండ్రి బిడ్డలమని స్పష్టమవుతుంది. మనము క్రీస్తు ప్రభువు తన శిష్యులతో పాలుపంచుకున్న దివ్యమైన విందులో పాల్గొని, క్రీస్తు పాటులను, మరణమును కూడా పాలుపంచుకొనుటకు సిద్ధంగా ఉన్నామని అదే సూచిస్తుంది. కల్వరి గిరిపై క్రీస్తు స్వచ్ఛందంగా తండ్రి దేవునికి అర్పించిన రక్తం ద్వారా అనేక ప్రయోజనాలను పొందుతున్నాము.

**రెండవది:** పాస్కా గొర్రె పిల్ల బలి నిర్గమకాండము 12వ అధ్యాయంలో చూసినట్లయితే, పాస్కా పండుగను సంవత్సరంలోని మొదటి నెలలో జరుపుకోమని దేవుడు తన ప్రజలకు చెప్పవలసిందిగా మోషేకు ఆజ్ఞాపించాడు. ఆరోజు ఏ మచ్చలేని ఒక సంవత్సరపు గొర్రె పిల్లను తీసుకొని బలి ఇవ్వాలి. తద్వారా ఈ దినము యావే దేవుడు మిమ్ములను ఐగుప్తు బానిసత్వం నుండి కొన్ని వచ్చాడని మీరు జ్ఞాపకం చేసుకోవాలి. ఏ విధంగా ప్లేగు వ్యాధితో ఐగుప్తు ప్రజలను దేవుడు బాధ పెట్టాడో మీరు గుర్తించుకోవాలి. ఆ రోజుల్లో మృత్యువు ఇంటి గుమ్మం చేరకుండా గొర్రె పిల్ల రక్తము ద్వారా దేవుడు వారిన కాపాడాడు. అదే రక్షణ ఈనాడు క్రీస్తు ప్రభువు యొక్క రక్తము ద్వారా నెరవేరిందని పరిశుద్ధ గ్రంథం తెలుపుచున్నది. అందుకే బప్తిస్మ స్వీకరణ సమయంలో యేసు గురించి యోహాను, ఇదిగో! లోక పాపములను పరిహరించు దేవుని గొర్రెపిల్ల (యోహాను 1:29) అని ప్రజలకు పరిచయం చేశాడు. సువార్తీకులు ఈ గొర్రెపిల్ల రక్తం లేక క్రీస్తు రక్తం నూతన ఒప్పందమును పరిపూర్ణము నొచ్చిందని ప్రస్తావించారు. పాత నిబంధనలో చూస్తే, గొర్రెపిల్ల యొక్క ఎముకలను విరగగొట్టకూడదు (సంఖ్యా 9:12). నూతన నిబంధనలో పాపములను పరిహరించు దేవుని గొర్రెపిల్ల అయిన క్రీస్తుని ఎముకలలో ఒకటియును విరగగొట్టబడలేదు అని ప్రవచనాలు పరిపూర్తి చేయబడ్డాయి

**మూడవది:** ప్రాయశ్చిత్త దిన బలి ప్రాయశ్చిత్త దినమనేది ప్రజల దోషాలను పోగొట్టడం కోసం నియమింపబడిన ఒక దినం. ఈ దినమున ప్రధాన యాజకుడు మాత్రమే దేవాలయ పవిత్ర స్థలంలోనికి ప్రవేశించి బలి అర్పణ గావించిన గొర్రె పిల్ల రక్తమును ప్రజల మీద చల్లేవాడు, దాని మూలముగా వారి పాపములు క్షమింపబడేవి. సువార్తీకుడైన యోహాను ఈ బలిని సూచిస్తూ

యేసు పాప విమోచకుడు అని అంటాడు (1 యోహాను 2:2). ఏసుక్రీస్తు రక్తం సకల మానవాళిని పాపముల నుండి శుద్ధి చేస్తుంది. తల్లి శ్రీసభ కూడా ఈ విషయమును పునరుద్ఘాటిస్తుంది: యేసు ప్రభువు మానవాళి రక్షణ కోసం నిజమైన మరియు యోగ్యమైన సిలువ మరణం పొందాడు. శ్రీసభ పితామహులలో ఒకడైన అలెగ్జాండ్రియా సిరిల్ ఇలా అంటాడు: యేసు మనకోసం తనను తాను దేవునికి సుమనోహరమైన బలి అర్పణగా ఇచ్చుకున్నాడు. క్రీస్తు మన పాపముల కోసం మరణించాడు. అతడు తండ్రి దేవుని చిత్తానికి అనుగుణంగా తనను తాను అర్పించుకున్నాడు. కాబట్టి క్రీస్తు త్యాగం అద్వితీయమైనది, అమోఘమైనది, అన్ని బలులను పరిపూర్తి చేయు సిలువ బలి. ఈ బలి ద్వారా సకల మానవాళి దేవునితో సమాధాన పరచబడింది.

## 2.4. క్రీస్తుని స్వీయ సమర్పణ

దేవునికి ఏదైనా అర్పించాలనుకుంటే రెండు విషయాలు ఉండాలి: ఒకటి – అర్పణ వస్తువు, రెండవది – అర్పించు వ్యక్తి. క్రీస్తు విషయంలో ఈ రెండు ఒకటిగా కనిపిస్తున్నాయి: ఎందుకనగా, ఆయనే బలి గొర్రెపిల్ల మరియు ఆయనే బలి యాజకుడు. ఆయనే బలి. నిజమైనది ప్రత్యేకమైనది, తనను తాను బలిగా తండ్రి దేవునికి అర్పించడం ద్వారా ఈ బలి ప్రత్యేకమైన బలిగా మనకు కనిపిస్తుంది. ఈ త్యాగం తండ్రి పట్ల తనకున్న విధేయతను, నిజమైన ప్రేమను సూచిస్తుంది, అంతేకాదు మానవాళిపై తనకున్న ప్రేమను కూడా సూచిస్తుంది. ఈ సత్యమైన, ప్రత్యేకమైన, పరిపూర్ణమైన బలి గొర్రెపిల్ల శాశ్వత నిబంధనకు సంకేతంగా ఉంది. ఈ బలిలో యాజకుడు మరియు గొర్రెపిల్ల స్వయంగా క్రీస్తు ప్రభువే.

## 2.5. క్రీస్తు యాజకత్వం శాశ్వతమైనది

తల్లి శ్రీసభలో యాజకులు ఉన్నప్పటికీ, వాస్తవంగా మనకు ఉండేది ఒకే ఒక యాజకుడు, అది క్రీస్తు ప్రభువు. మిగిలిన యాజకులు అందరూ క్రీస్తుని యాజకత్వంలో పాలుపంచుకొనే వారు మాత్రమే. ఎందుకన, క్రీస్తు నందు మాత్రమే సంపూర్ణ యాజకత్వం కలిగి ఉంది. పునీత పౌలు ఈ విధంగా అంటాడు: దేవుడు ఒక్కడే, దేవుని ప్రజలను ఒక చోట చేర్చు మధ్యవర్తియు

ఒక్కడే, ఆయనే మనుషుడైన క్రీస్తు యేసు (1 తిమోతి 2:5). ఆయన యందే సంపూర్ణమైన గురుత్వం ఉంటుంది.

హెబ్రీయుల పత్రికలో 10:6లో మనము ఈ విధంగా చదువుతున్నాము: క్రీస్తుని యాజకత్వం శాశ్వతమైనది, మెల్కిసేదేకుని యాజక క్రమమున, నీవు సర్వదా యాజకుడవై ఉందువు. క్రీస్తు సజీవమైన శక్తి కలవాడు, కనుక అతడు ఎల్లప్పుడూ యాజకత్వమును కలిగి ఉంటాడు. మరణము క్రీస్తును జయింపలేదు. ఆయన దైవ స్వభావముతోనే కాక, మానవ శరీరధారుడై, ఆత్మ వలన తండ్రి దేవునితో సఖ్యత కలిగి ఉన్నాడు. కుమారుని ద్వారా, తండ్రి దేవుడు క్రీస్తునకు శాశ్వతమైన యాజకత్వమును వాగ్దానం చేశాడు: నీవు మెల్కిసేదేకుని వలే యాజకత్వమును బడసి కలకాలము యాజకునివిగా ఉందువు (కీర్తన 110:4). ఈ వాగ్దానము ఏసుక్రీస్తు సిలువ మరణం పొంది, పునరుత్థానమైన తర్వాత నెరవేరింది.

క్రీస్తు ప్రభువు ఈ లోకములో చేసిన కార్యములన్నీ మానవ రక్షణ కొరకే. ఆయన రక్షణ చరిత్ర మూడు దశలుగా మనకు కనిపిస్తుంది:

**మొదటి దశ:** క్రీస్తు మనుష్యవతారం (హెబ్రీ 2:10–18)

**రెండవ దశ:** క్రీస్తుని సిలువ మరణం (హెబ్రీ 2:26–28)

**మూడవ దశ:** క్రీస్తుని శాశ్వత మహిమ (హెబ్రీ 10:11–15)

క్రీస్తు రక్షణ చరిత్ర మొత్తము కూడా ఆయన యాజకత్వముతో ముడిపడి ఉంది. శ్రీసభకు నాయకుడిగా, ఇప్పటికీ యాజకుడిగా, క్రీస్తు, తండ్రి కుడి ప్రక్కన కూర్చొని అనునిత్యం తండ్రిని స్తుతిస్తూ తన యాజకత్వ విధులను ఆచరిస్తున్నాడు.

## 2.6. దేవుని ప్రేమ, శ్రమల రహస్యం: మానవుల రక్షణం

పాపమున్న వ్యక్తిలో దేవుడు నివాసము ఉండడు. క్రీస్తు సకల మానవాళి పాపములను మోసి సిలువ మరణం పొందాడు. క్రీస్తు తన నిత్య ఆత్మ ద్వారా తనను తండ్రికి అర్పించుకొని పరిపూర్ణ బలిగా మారాడు (హెబ్రీ 9:14). తండ్రి దేవుడు, క్రీస్తు ప్రభువు స్వచ్ఛందంగా ఇష్టపూర్తిగా అర్పించిన బలిని సంతోషంగా స్వీకరించి అతనికి నూతన ఆత్మను ఒసగాడు. ఇది దేవుని ప్రేమ మరియు విశ్వాస రహస్యము. పాప విమోచన ద్వారా ప్రేమ లభించినది

మరియు అందరూ రక్షింప బడిరి. క్రీస్తు యేసు దేవుని గొర్రెపిల్లగా, ఇష్టపూర్తిగా మన కొరకు పాటులను అనుభవించి సిలువ మరణం పొందాడు. క్రీస్తు మరణం తండ్రి దేవునికి మరియు మానవునికి మధ్య ఉన్న గొప్ప అనుబంధానికి నిదర్శనంగా ఉంది. ఒక సామాన్య మానవునిలా యేసు మానవుల అందరి తరపున మన స్థానములో తనను తాను సమర్పించుకొని మనకు రక్షణ భాగ్యమును ప్రసాదించాడు.

## 2.6.1. విమోచనాత్మకమైన ప్రేమ

దేవుడు మనిషిగా జన్మించి మనలను రక్షించాడు. ఈ విధంగా మనపై ఉన్న ప్రేమను ఆయన విధితం చేశాడు. రక్షణ ప్రణాళిక అంతయు ఈ ప్రేమను గురించి బోధిస్తుంది. తండ్రి కుమారుని ప్రేమించినట్లే, కుమారుడు కూడా తండ్రిని ప్రేమించాడు. అంతేకాదు తండ్రి కుమారులు ఇద్దరు ఈ లోకాన్ని ఎంతగానో ప్రేమించారు. యోహాను సువార్తికుడు 15:9లో ఈ విధంగా అంటాడు: నా తండ్రి నన్ను ప్రేమించినట్లే నేను మిమ్ము ప్రేమించితిని. ఇంకా కొద్దిగా ముందుకు వెళ్లి యోహాను ఈ విధంగా ప్రస్తావిస్తాడు: తన స్నేహితుల కొరకు తన ప్రాణమును ధారబోయవానికంటే ఎక్కువ ప్రేమ గలవాడు ఎవడును లేడు (యోహాను 15:13). ఈ విధంగా ఏసుక్రీస్తు దేవుని ప్రేమను వెల్లడి చేస్తూ పవిత్రాత్మ ద్వారా దేవుని రక్షణ కార్యమును పరిపూర్తి చేశాడు. రెండవ జాన్ పాల్ పాపుగారు ఇలా అంటాడు: “దేవుని రక్షణ కార్యము తన అమితమైన ప్రేమ వలన జరిగినది. తండ్రి పట్ల ప్రేమతో క్రీస్తు తన కర్తవ్యాన్ని నిర్వహించాడు. ప్రప్రధమముగా ఇది జరగటానికి కారణమేంటి అని ఆలోచించినప్పుడు మనకు అర్థమయ్యే సంగతి: మానవాళి ఎడల త్రియేక దేవునికి ఉన్న దయార్ధపూరిత ప్రేమ. ఉ క్రీస్తు సిలువ దేవుని పట్ల న్యాయంగా ఉండడానికి ఉపకరిస్తుంది. దేవుని ప్రేమ చెడుకు, పాపానికి, మరణానికి విరుద్ధంగా ఉంటుందని మానవ చరిత్ర చెబుతోంది”.

## 2.6.2. క్రీస్తులో దేవుని బాధ

మానవాళిని రక్షించడమే దేవుని ప్రేమ లేక దేవుని పని. దేవుని యొక్క ప్రేమ ఏసుక్రీస్తు బాధలలో చూపబడింది. యేసు సిలువపై అనుభవించింది నిజమైన మానవ బాధ. ఒక సామాన్య మానవునిలా ఆయన శ్రమలను పొందాడు.

అతనికి రెండు స్వభావాలు ఉన్నాయి: దైవ స్వభావం మరియు మానవ స్వభావం. సువార్తలలో చూస్తున్నాము (మత్తయి 4:2; లూకా 4:7; యోహాను 4:6–8): ఒక సామాన్య జీవిలా యేసు ఆకలి, దాహం, అలసట, సంతోషం, దుఃఖం మానసిక భావోద్వేగాలను అనుభవించాడు. ఇటువంటి గొప్ప సాక్షాలు ఉన్నప్పటికీ కొంతమంది నాస్తికులు మత విరుద్ధమైన సిద్ధాంతాలతో క్రీస్తు మానవత్వాన్ని నిరాకరిస్తున్నారు. క్రీస్తు దేవుడు మాత్రమే మానవుడు కాదు, మానవునిలా కనిపించినప్పటికీ అతడు నిజమైన మానవుడు కాదు అని ప్రబోధిస్తూ క్రీస్తు దైవ మానవ స్వభావముల గురించి అసత్యంగా ప్రకటిస్తున్నారు. వారు క్రీస్తు నిజముగా మానవ బాధలను పొందలేదు అని వాదిస్తున్నారు. ఇటువంటి మత విరుద్ధ ప్రచారమును కతోలిక శ్రీసభ తిరస్కరిస్తుంది. అంతేకాదు, క్రీస్తు దైవ మానవ స్వభావాలు కలిగిన ఏకైక వ్యక్తి అని విశ్వసిస్తుంది. దేవుడు మానవునిగా మారి క్రీస్తులో ఈ బాధను అనుభవిస్తున్నాడు అని ప్రబోధిస్తుంది. దేవుడు మన పాపములను మన బాధలను తన శ్రమలుగా క్రీస్తులో మార్చుకున్నాడు అని ప్రబోధిస్తూ క్రీస్తు మనుష్యవతార పరమ రహస్యములు ఈ లోకానికి ప్రకటిస్తుంది. ఈ మానవ రూపమే సిలువ వేయబడిన దేవుణ్ణి మనకు చూపించగలుగుతుంది, అటువంటి ఘోరమైన మరణమును ఏ మానవుడు కూడా అనుభవించలేదు, అనుభవింపలేడు అని కూడా ప్రకటిస్తుంది. ఇంకా, ఏసు మరణింపకపోయి ఉంటే మానవాళికి రక్షణ వరం అనుగ్రహింపబడి ఉండేది కాదు. అతడు దేవుడు పంపిన గొర్రెపిల్ల. ఆయన తన ప్రాణాన్ని ఇష్టపూర్వకంగా దేవుని సంకల్పాన్ని పరిపూర్తి చేయడానికి సమర్పించాడు. ఇది సిలువ సమర్పణం. ఈ సిలువ సమర్పణమే దేవునికి మానవాళిపై ఉన్న గొప్ప ప్రేమను తెలియజేసే పరమ రహస్యం.

## 2.7. సకల మానవాళి రక్షణ

క్రీస్తు సిలువ మరణం పొంది సకల మానవాళికి పాప విమోచనను అందించాడు. తన మరణము ద్వారా క్రీస్తు కేవలము ఒక వ్యక్తికి లేదా ఒక జాతికి మాత్రమే కాకుండా, సర్వ జగత్తుకు రక్షణను కలిగించాడు. క్రీస్తు అందరి కోసం మరణించాడు (2 కొరింతీ 5:15; రోమీ 5:18). పునీత యోహాను అంటాడు: క్రీస్తే మన పాప విమోచకుడు, మనకే కాదు

మానవులందరి పాపములకు ఆయనే విమోచకుడు, రక్షణ కర్త (1 యోహాను 2:2). ఇక్కడ మనం ఒక విషయం స్పష్టంగా అర్థం చేసుకోవాలి: క్రీస్తు మరణము ద్వారా సకల మానవాళిని పాపముల నుండి విమోచించి, వారికి రక్షణ వరములను అనుగ్రహించాడు. అయితే ఎవరైతే ఈ రక్షణ వరాన్ని నిరాకరిస్తారో వారికి ఆ దేవుని శాశ్వత కృప లభింపదు. రక్షణ అందరికీ అందుబాటులో ఉంచబడింది. అందుకే పౌలు అంటాడు: మానవులందరూ రక్షింపబడవలనని, సత్యమును తెలుసుకొనవలెనని దేవుని అభిలాష, కోరిక (1 తిమోతి 2:4). కానీ కొలది మంది మాత్రమే ఆ రక్షణమును వారి నైతిక జీవితం ద్వారా స్వీకరించి స్వర్గ లోక ఆనందానికి చేరువలో ఉన్నారు. ఈ విషయమున తల్లి శ్రీసభ కూడా ఎన్నో జాగ్రత్తలు తీసుకుంటూ, విశ్వవ్యాప్తంగా ప్రభు సువార్త అను రక్షణ వెలుగును తన బోధన ద్వారా దివ్య సంస్కాల ద్వారా ప్రపంచ నలుమూలలకు ప్రసరింపజేస్తూ ప్రకటిస్తుంది. ఈ సకల మానవాళి రక్షణ లేదా మానవాళి విమోచనను కేవలము బహిరంగ విశ్వాసముతో క్రీస్తును అనుసరించు వారికి మాత్రమే కాకుండా, అన్యులకు కూడా వారి వారి జీవిత విధానమును బట్టి లభించు లాగున అందించబడింది. ఏలయన క్రీస్తు ఒక రక్షణకు వెలుగు కోట. ఆయన కృపావరములు ఎవరిపై అనుగ్రహింపబడాలో పరిశుద్ధాత్మ నిర్ణయిస్తుంది. మానవుని యొక్క స్వీయ చిత్తం మరియు పవిత్రాత్మ సహాయం ద్వారా రక్షణకు వెలుగును మనము స్వీకరిస్తున్నాము.

## 2.8. సిలువపై క్రీస్తు ప్రాణత్యాగ ఫలాలు, ఫలితాలు

సిలువ అనునది అందంగా అలంకరింపబడిన మహా వృక్షం. ఈ అందమైన వృక్షంపై గొర్రెపిల్ల రక్తం చిందించింది. ఈ గొర్రె పిల్ల చిందించిన రక్త ప్రభావం వలన దాని కొమ్మలు దయను, కారుణ్యమును వెదజల్లుతూ జీవ ఫలాలను అందిస్తున్నాయి. ఈ మహా వృక్షం నుండి వచ్చే ఫలాలను కేవలము పుణ్యాత్ములు, కల్మషం లేని పవిత్రులు మాత్రమే తాకగలరు. అంతేగాక ఈ మహా వృక్షం సిలువ వృక్షం సకల మానవాళి పాపపరిహారార్థమై ఒక గుర్తుగా నిలబడి ఉంటుంది. విత్తనం ఏ విధంగానైతే భూమిలో పడి, నశించి, మరల భూమిని చీల్చుకొని తిరిగి వికసిస్తుందో, క్రీస్తు ప్రభువు కూడా అలాగే మరణించి మరలా

జీవంతో లేచారు. సకల మానవాళి రక్షణార్థమై ఈ మహా వృక్షంపై దేవుని కుమారుడైన యేసు మరణించి తిరిగి నూతన జీవితాన్ని పొందాడు. ఈ మహా వృక్షంపై చిందించబడిన ఏసుక్రీస్తు రక్తము కేవలము పాపపరిహారమును అందించడం మాత్రమే కాకుండా, అనేక ఆధ్యాత్మిక దీవెనలు, జ్ఞాన వరాలు, అనుగ్రహాలు, ఫలాలను కూడా అందజేస్తుంది (ఎఫెసీ 1:8-10). ఎచ్చట అయితే పాపం పెరుగుతుందో, అచ్చట దేవుని కృప ఇంకా అధికంగా పెరుగుతుంది (రోమీ 5:20).

సిలువపై ప్రాణ త్యాగము ద్వారా మన బాధల నుండి కష్టాలనుండి రక్షించి, క్రీస్తు ప్రభువు మనలను దేవదూతల సముఖమున నిలబెట్టాడు. అదేవిధంగా అతడు మనకు ఉన్నత మహిమను ప్రసాదించి, సాతాను సంకెళ్ల నుండి మనలను విముక్తులను చేసి, తండ్రి దేవునికి ప్రియమైన బిడ్డలుగా మలిచాడు. సాతాను నుండి విమోచనను, స్వేచ్ఛను ప్రసాదించాడు. అయితే ఈ స్వేచ్ఛ ఎవరైతే విశ్వాసంతో కోరుకుంటారో వారికి మాత్రమే దక్కుతుంది. ప్రభువు ఎవరికైతే ఈ స్వేచ్ఛను ప్రసాదించాలని సంకల్పిస్తాడో, ఎవరికైతే పరలోక భాగ్యాన్ని అనుగ్రహించి నిత్యజీవంతో నింపాలనుకుంటాడో వారికి మాత్రమే ఆ భాగ్యం దక్కుతుంది. ఎన్నో శ్రమలు కష్టాలు శోధనలు ఒడిదుడుకుల ద్వారా ప్రభువు మనకు పరలోక భాగ్యాన్ని, ఆధ్యాత్మిక ఆశీర్వాదాలను ప్రసాదించాడు. కేవలము భూలోకములో మన సిలువను మోస్తూ ముందుకు సాగడం ద్వారా మాత్రమే మనము కూడా ఆ క్రీస్తు ప్రభువుని రక్షణ ఫలాలను పొందగలము. క్రీస్తు, తండ్రి దేవుని చిత్తానుసారం జీవించి, వినయముతో తండ్రి దేవునికి తలవంచి, తండ్రిని తృప్తి పరచాడు (హెబ్రీ 2:10). క్రీస్తు తన శ్రమల, మరణం ద్వారా తండ్రి మహిమలు భాగస్థుడై మనకు రక్షణమును, రక్షణ ఫలాలను అందిస్తున్నాడు (లూకా 24:26).

## మూడవ అధ్యాయము

## దివ్యబలిపూజ - బలిపీఠంపై క్రీస్తు అర్పించు రక్తరహిత బలి

కతోలిక శ్రీసభలో నిర్వహింపబడు దివ్య బలి పూజ గురించి, దాని ప్రాముఖ్యత, దాని ప్రభావం గురించి ప్రొటెస్టెంట్ శాఖలవారు కతోలిక సిద్ధాంతాలను నిరాకరించి వారు కొన్ని ప్రశ్నలను సంధిస్తూ ఉంటారు.

1. పరిశుద్ధ గ్రంథంలో చెప్పబడినట్లుగా, క్రీస్తు సిలువపై తన రక్తముతో మనకు శాశ్వతంగా రక్షణను సంపాదించి పెట్టాడు (హెబ్రీ 9:12), అంతేకాదు, క్రీస్తు ప్రభువు ఒకే ఒకసారి తనను తాను అర్పించుకున్నాడు (హెబ్రీ 9:25). కతోలిక శ్రీసభలో ఎందుకు ప్రతిరోజు దివ్యబలిని సమర్పిస్తుంటారు?
2. కతోలిక క్రైస్తవులు సమర్పించినది బలి ఎలా అవుతుంది? అప్ప ద్రాక్ష రసములు నిజముగా క్రీస్తు శరీరకాలుగా ఎలా మారతాయి?
3. క్రీస్తు ప్రభువు సిలువపై రక్తం చిందిస్తూ అర్పించిన బలి, కతోలిక దేవాలయాల్లో జరిగే బలి రెండు ఒకటే అని ఏ విధంగా చెప్పగలరు? అసలు ఈ బలి ఒకటిగా ఉంటున్నదా? అనేక బలులుగా నిర్వహింపబడుచున్నదా?

క్రీస్తు ప్రభువు భౌతికంగా ఈ భూలోకంలో ఉన్నప్పుడే ఈ రెండవ ప్రశ్న జనులలో తలెత్తింది. నా శరీరము నిజమైన ఆహారము, నా రక్తము నిజమైన పానము. నా శరీరమును భుజించి, నా రక్తమును పానము చేయువాడు, నాయందును నేను వాని యందును ఉండును (యోహాను 6:55). అంతే కాదు, "మీరు మనుష్య కుమారుని శరీరమును భుజించి, రక్తమును త్రాగిననే తప్ప మీలో జీవముండదు". యేసు ఈ మాటలను పలికినప్పుడు, అనేకమంది దానిని తప్పుగా అర్థం చేసుకొని ఆయననుండి వెళ్ళిపోయారు. ఇటువంటి పరిస్థితి నేటికీ ఉధృతంగా సాగుతూనే ఉంది. అనేక శాఖ వారు లేక తెగలవారు, అప్పద్రాక్ష రసాలు క్రీస్తు ప్రభువుని శరీర రక్తాలుగా రూపాంతరం చెందు అంశాన్ని ప్రశ్నిస్తున్నాయి. మూడవ ప్రశ్నను మన ప్రొటెస్టెంట్ సహోదర సహోదరీలు మరింత అసంబద్ధమైనదిగా, అర్థం లేనిదిగా భావించటం మొదలుపెట్టారు. వారు సిలువపై శాశ్వతంగా యేసు సమర్పించిన బలిని అర్థం చేసుకోగలుగుతున్నారు కానీ, ఎందుకు క్రీస్తు ప్రభువు సిలువ మీద బలిగా అర్పించబడి ఉన్నాడు, అతని మదిలో ఉన్న పరమార్థం ఏమిటి అని గ్రహించలేకపోతున్నారు. అందువలన ఈ మూడవ అధ్యాయంలో మనము కొన్ని సత్యాలను గ్రహించబోతున్నాం. దివ్య సత్ప్రసాదం క్రీస్తు ప్రభువు మనందరికీ ప్రసాదించిన గొప్ప వరం. ఇది కేవలం పవిత్ర భోజనం మాత్రమే

కాదు, తండ్రి దేవునికి మరియు తన శిష్యుల కొరకు క్రీస్తు అర్పించిన నిజమైన త్యాగబలి. ఈ సత్యాలను శ్రీసభ క్రమ పద్ధతిలో మనము తెలుసుకుందాము.

### 3.1. దివ్యబలిపూజ: ఒక త్యాగబలి లేదా యాగము

కతోలిక శ్రీసభలో 1545-63 వరకు ట్రెంటు మహాసభ జరిగింది. ఆ సభను నాటి జగద్గురువులు మూడవ పౌలు పాపుగారు మొదలుపెట్టారు. నాలుగవ భక్తి నాథ పాపుగారు ముగించారు (1562-63). నాలుగవ భక్తి నాద జగద్గురువులు 1562వ సంవత్సరము, సెప్టెంబర్ మాసంలో దివ్యబలిపూజ గురించి చర్చించారు. ఆ చర్చ తదనంతరం ఆ మహాసభ ఒక గొప్ప ప్రకటన చేసింది. "దివ్యబలిపూజ నిజమైన మరియు సరియైన త్యాగము లేక బలి. ఈ నిజమైన సరియైన దివ్యబలిపూజ దేవునికి సమర్పింపబడదు అని ఎవరైనా పలికితే, లేదా ఆ బలి దేవునికి అర్పించుట కొరకు కాదు, కేవలము మనము తినడానికి క్రీస్తు ప్రభువు ఈ బలిని అర్పించారు అని ఎవరైనా పలికితే, అట్టివాడు బహిష్కరణకు గురి అవుతాడు" అని శ్రీసభ ప్రబోధిస్తుంది. మరియు ఈ బలి జీవించున్న వారికి అదే విధంగా మరణించిన వారి పాప విముక్తి కోసం సమర్పింపబడుతుంది. కడరాత్రి భోజన సమయాన ఏసు రొట్టెను ద్రాక్ష రసమును తీసుకొని తన శరీర రక్తాలుగా మార్చడమే కాకుండా, వాటిని తండ్రి దేవునికి సమర్పిస్తూ, దానిని నూతన నిబంధన యొక్క నిజమైన, స్వచ్ఛమైన, స్వచ్ఛందమైన బలిగా ఏర్పాటు చేశాడు అని శ్రీసభ ప్రకటిస్తుంది.

కడరాత్రి భోజన సమయంలో క్రీస్తు స్థాపించిన దివ్యబలినే, నేడు గురువు ప్రతిదినము బలిపీఠముపై అర్పిస్తున్నాడు అని చెప్పడానికి కొన్ని కారణాలు కలవు.

**మొదటిది:** గురువు అపర క్రీస్తు. దేవాలయంలో ప్రార్ధనకై సమావేశమైన వారిలో క్రీస్తు ఉన్నాడని, దివ్యబలిపూజను అర్పిస్తున్న గురువులో క్రీస్తు ఉన్నాడని, గురువు అర్పిస్తున్న అప్ప ద్రాక్ష రసములలో క్రీస్తు ఉన్నాడని, దేవాలయంలో జరుగు మత కర్మలలో, ప్రకటింపబడు దైవ వాక్కులో క్రీస్తు ఉన్నాడని శ్రీసభ బోధిస్తుంది.

**రెండవది:** తండ్రి దేవునికి సమర్పణ. ఆనాడు కడరాత్రి భోజన సమయంలో క్రీస్తు తండ్రి దేవునికి అప్పద్రాక్ష రస రూపాలలో అర్పించిన బలి, ఈనాడు

గురువు ద్వారా కూడా తండ్రి దేవునికి అర్పింపబడుతుంది. కతోలిక శ్రీసభ కృతజ్ఞతా ప్రార్ధనల ద్వారా ధ్రువీకరిస్తుంది: "దయగల తండ్రి! నీ కుమారుడైన క్రీస్తు ద్వారా మేము వినయ పూర్వకముగా ప్రార్థనలను, విన్నపములను చేస్తూ, ఈ పవిత్రమైన నిష్కలంకమైన అర్పణలను మేము నీకు అందిస్తున్నాము" (కృతజ్ఞత ప్రార్ధన 1).

**మూడవది:** అప్ప ద్రాక్ష రసముల రూపాంతరం. ఈ దివ్యబలిలో కంటికి కనపడు అప్పము ద్రాక్ష రసము, ప్రభువైన క్రీస్తు శరీర రక్తాలుగా మార్చబడుతున్నాయి. ప్రధాన యాజకుడు క్రీస్తు స్వయంగా ఒక గురువు ద్వారా ఈ బలి వస్తువులను దేవునికి అర్పిస్తున్నాడు. క్రీస్తు తనను తాను అర్పించుకుంటున్నాడు. అదేవిధంగా రక్తరహిత రూపంలో అగోచరంగా రొట్టె మరియు ద్రాక్షరస రూపములలో కాల్చివేయబడుతున్నాడు. ఇలా క్రీస్తు తనను తాను దహన బలిగా సమర్పించుకుంటున్నాడు, అందువలన రొట్టెలోనే తన శరీరమును, రసములోని తన రక్తమును మనకు అందిస్తున్నాడు.

**నాలుగవది:** దివ్యబలిపూజ ప్రధాన ఉద్దేశం. ఇది దేవుని కల్పించే ఆరాధనలో మహా ఉన్నతమైనది మరియు మహా గొప్పది అని గుర్తించాలి. ఈ దివ్యబలిపూజ ద్వారా ఏసుప్రభుని శ్రమలను మరణమును ధ్యానిస్తూ, యోగ్యత గల బిడ్డలుగా మనలను మనము దేవునికి సమర్పించుకుంటూ, ఆ దేవున్ని సంతృప్తి పరచగలుగుతున్నాము.

### 3.2. దివ్యబలిపూజ: పాత నిబంధన ప్రస్తావన

పాత నిబంధనలో ప్రజల మధ్య మూడు రకాల అర్పణలు ఉండేవి. అవి: కానుక అర్పణలు, భాగస్వామ్య అర్పణలు, పాప పరిహార అర్పణలు. రకరకాల సమర్పణల ద్వారా ప్రజలు దేవునిపై ఆధారపడి ఉన్నారని జ్ఞాపకం చేసుకుంటారు. భాగస్వామ్య అర్పణల ద్వారా ప్రజలు ఒకరితో ఒకరు సఖ్యత కలిగి సామరస్యపూర్వకంగా భగవంతునితో ఐక్యము కావలసిన అవసరాన్ని గుర్తించారు. పాప పరిహార అర్పణల ద్వారా వారి పూర్వపు పాపములు దేవుని ఎదుట అంగీకరించి, ఆయన చిత్త ప్రకారం జీవిస్తూ, సవరించుకుంటారు.

### 3.2.1. బహుమతి బలులు లేదా త్యాగ అర్పణలు (Gift Sacrifice)

రెండు రకాల త్యాగా అర్పణలు ఉన్నాయి. మొదటిది, దహన బలులు లేదా అర్పణలు. రెండవది, తృణధాన్య బలులు. దహనబలిలో జంతువు అనేది పూర్తిగా కాల్చి వేయబడాలి. తృణధాన్య బలి **(Minhah)** సాధారణంగా మెత్తటి పిండిని నైవేద్యంగా సమర్పించేవాళ్లు. ప్రవాసానికి పోవడానికి ముందు మిన్హా కు ఒక ప్రత్యేక ఉదాహరణ చూపిస్తుంది. దహన బలి **(Holocaust)** చాలా శ్రేష్టమైనది. దీనిలో అర్పించే జంతువును మంటలలో బాగా కాల్చి దేవునికి సమర్పిస్తారు.

### 3.2.2. సఖ్యత బలి లేదా సమాధానబలి (Communion Sacrifice)

సమాధానబలి అనేది పురాతన ఇశ్రాయేలీయులలో అత్యంత తరచుగా జరిగే బలి. దహన బలి వలే ఇది కూడా జంతు బలి కలిగి ఉంటుంది. రెండింటి మధ్య తేడా ఏమిటంటే, దీనిలో జంతువులు కొంత భాగమును మాత్రమే కాలుస్తారు. మిగిలిన భాగమును పూజారి లేక సమర్పకుడు మరియు కుటుంబాల వారు లేక అతిధులు భోజనంగా పంచుకుంటారు (నిర్గమ 24:9–11).

### 3.2.3. పాప పరిహార బలులు (Sin Offering)

సమాధానబలి, దహన బలులలో జంతుబలికి ప్రాముఖ్యత ఉంది. అలాగే పాప పరిహార బలిలో జంతు రక్తాన్ని జోడిస్తారు. ఎందుకంటే పాపపరిహారానికి రక్తం ఒక సాధనంగా నిలుస్తుంది. ప్రాయశ్చిత్త దినం అనేది యూదా మతములు చాలా ప్రముఖమైనది (లేవీ 16). దీనిలో కొన్ని బలిని గూర్చి సూచిస్తున్నాయి. అదియే దివ్యబలి పూజ. ఇది సిలువకు ప్రాతినిధ్యం వహిస్తుంది. ఉదాహరణకు, ఏబేలు మరియు ఇస్సాకుల బలి. రెండవ రకం అనేది ప్రస్తుతమున్న అప్పము మరియు ద్రాక్షరసము. పాత నిబంధనలు ఈ ఆచారాలన్నీ నాలుగు భాగాలుగా కనిపిస్తాయి: మెల్కీసేదేకుని బలి, నిర్గమకాండములోని మన్నా భోజనం, ఒడంబడిక ఆహారం మరియు పాస్కా భోజనం. పాత కాలం నుండి ఈ మెల్కీసేదేకు అర్పించిన అప్పము మరియు ద్రాక్షరసము దివ్య బలి పూజను సూచిస్తున్నాయి. నూతన నిబంధనలో దివ్య సత్ప్రసాదం గురించి ఏమని ప్రస్తావించబడిందో తెలుసుకుందాం.

## 3.3. సువార్తలలో దివ్యసత్ర్పసాదం

ఈ పవిత్రమైన దివ్యసత్ర్పసాదాన్ని స్వయంగా యేసు ప్రభువు మనకు ఇచ్చినట్లు నూతన నిబంధన వృత్తాంతాలు వివరిస్తాయి. యోహాను 6:51లో ఏసుప్రభువు ఇలా అంటున్నాడు: పరలోకము నుండి దిగివచ్చిన జీవము గల ఆహారమును నేనే. ఈ ఆహారమును ఎవడేని భుజించినచో వాడు నిరంతరము జీవించును. ఈ లోకము జీవించుటకు నేను ఇచ్చు ఆహారము నా శరీరమే. యేసు మాటలను గ్రహింపలేని యూదులలో ఒకరితో ఒకరు, “మనము భుజించుటకు ఈయన తన శరీరమును ఎట్లు ఇవ్వగలడు” అని వాదించు కొనసాగింది. చాలా సందర్భాలలో ప్రభు నేను ద్వారమును (యోహాను 10:9), నేను ద్రాక్ష తీగను (యోహాను 15:1) అని పలికినప్పుడు ఎవరు ఏమీ అనలేదు. ఈ మనిషి చెక్కగా ఎలా తయారవుతాడు? అని గాని, లేదా ఈ మనిషి మొక్కగా ఎలా మారతాడు? అని గాని వారు ప్రశ్నింపలేదు. వీటిని వారు రూపకాలుగా గుర్తించారు. కానీ యోహాను 6:53 లో మీరు మనుష్యకుమారుని శరీరమును భుజించి, ఆయన రక్తమును పానము చేసిననే తప్ప మీలో జీవం ఉండదు. నా శరీరంను భుజించి నా రక్తమును ప్రాణము చేయువాడు నిత్యజీవమును పొందుతాడు, అతనిని నేను అంతిమ దినమున లేపుదును అని పలికినప్పుడు మాత్రము, వారికి ఈ మాటలు కఠినంగా తోచాయి. ఈ మాటలను ఎవడు వినగలడు అని వారు తర్కించుకొనిరి (యోహాను 6:60). దేవుడు జల ప్రళయం తర్వాత నోవాకు మరియు అతని కుమారులకు దేవుడు చెప్పిన మాటలను యూదులు గుర్తుకు తెచ్చుకున్నారు: నెత్తుటిలో ప్రాణం ఉంటుంది, దానిని మాత్రము ముట్టుకొనవద్దు (ఆది 9:4). లేవీయకాండం 17:10లో దేవుడు తాను ఎన్నుకున్న ఇశ్రాయేలు ప్రజలతో, ఎవడేని నెత్తుటిని భుజింపరేని, నేను వారికి విముఖుడనై, వారిని శిక్షించి, వారిని సమాజం నుండి వెలివేయుదును, అంతేకాదు, రక్తములో జీవముంది, కనుకనే ఈ నెత్తురును బలిపీఠము మీద చిలకరించి మీ పాపములకు తమ చేయుటకు గాను దానిని మీకు ఇచ్చితిని (లేవీ 17:11).

పరలోకమందున్న తండ్రి, అసలు రక్తాన్ని త్రాగవలదు అని ఎందుకు ఆజ్ఞాపించాడు? మనము ఆ రక్తమును త్రాగినప్పుడు వాటి జీవితంలో

పాలుపంచుకోకూడదు, ఎందుకంటే జంతువులు ఆత్మ లేనివి, నశించిపోవునవి. సృష్టిలో మనిషి కంటే తక్కువ స్థానం కలిగినవి. ఏమైనప్పటికీ, నూతన మరియు శాశ్వతమైన నిబంధనలు నిత్య జీవాన్ని పొందడానికి క్రీస్తు శరీరమును భుజిస్తాము, ఆయన రక్తమును పానము చేస్తాము. క్రీస్తు ప్రభువుని శరీర రక్తముల గురించి మనము అంత సులభంగా అర్థం చేసుకోలేమని ఆయనకు తెలుసు. కడరాత్రి భోజన సమయంలో ఆయన నాలుగు గొప్ప కార్యములను చేశాడు: రొట్టెను తీసుకున్నాడు, దానిని ఆశీర్వదించాడు, దానిని విరిచాడు, దానిని శిష్యులకు ఒక ఆహారంగా ఇచ్చాడు. మత్తయి 26:26; మార్కు 14:22; లూకా 22:19-20 ఈ విధంగా తెలియజేస్తున్నాయి: ఇది నా శరీరం, ఇది నా రక్తం అని, ఇదే నూతన నిబంధన అని ప్రస్తావిస్తూ తన శిష్యులతో, మీరు దీనిని "నా జ్ఞాపకార్థం చేయండి" (లూకా 22:19) అని ఆజ్ఞాపిస్తూ యాజకత్వాన్ని స్థాపించాడు. అంతేకాదు, "ఇది మొదలుకొని మీతో కూడా నా తండ్రి రాజ్యంలో నూతనముగా ద్రాక్ష రసము పానము చేయు వరకు నేను మళ్లీ త్రాగనని మీతో చెప్పుచున్నానని" అన్నాడు. ఆయన మరణించి, మూడవ దినమున ఉత్తనమైన తర్వాత, ఇద్దరు శిష్యులతో కలిసి ఎమ్మావు మార్గంలో నడిచాడు. వారు ఎమ్మావు చేరుకున్నప్పుడు అక్కడ దివ్యబలిని సమర్పించాడు. ప్రభువు రొట్టెను తీసుకొని, ఆశీర్వదించి తుంచి వారికి ఇచ్చినప్పుడు వారికి కనువిప్పు కలిగింది. తరువాత చూసినప్పుడు అక్కడ ప్రభువు లేడు (లూకా 24:30). వీటిని బట్టి చూస్తే అప్పటి రూపంలో ఉన్నది నిజముగా క్రీస్తు శరీరమే అని తెలుస్తుంది.

## 3.4. పౌలు రచనలలో దివ్యసత్ర్పసాదం

పునీత పౌలు గారు మాసిదోనియా గ్రీకు దేశములకు సువార్త ప్రచారంనకై వెళ్ళినప్పుడు, త్రోయ పట్టణంలోని గృహములో పై అంతస్తు గదిలో రొట్టెను తుంచి భుజించడం చూడగలం. పునీత పౌలు తన లేఖలలో రొట్టెను విరవడం అంటే ఏమిటో స్పష్టంగా వివరించాడు. మొదటి కొరింతీయుల పత్రిక 10:16లో ఆయన అంటున్నాడు: మనము ఆశీర్వదించిన దీవెన పాత్రలోనిది తాగునప్పుడు క్రీస్తు రక్తమున పాలుపంచుకొనుటలేదా? మనము పెక్కుమంది అయినను ఒకే రొట్టెను విరచుట ద్వారా మనమందరము ఒకే శరీరము. ఒకే రొట్టెను

విరచుట ద్వారా క్రీస్తు శరీరములో పాలుపంచుకొనుటలేదా? మరియు ఇంకనూ తన బోధనలను కొనసాగిస్తూ పునీత పౌలు ఇలా అంటాడు: ఎవడైనను ఆశీర్వదించి త్రుంచబడిన ఈ రొట్టెను, రక్తమును అయోగ్యముగా స్వీకరిస్తే, తినుట వలనను, త్రాగుట వలనను తీర్పునకు గురి అగును. వారు వ్యతిరేకంగా పాపము చేయుచున్నారు. నిజంగానే ఈ విరచబడిన రొట్టె క్రీస్తు శరీరము, దీవెన పాత్రలోని ద్రాక్ష రసము క్రీస్తు రక్తము అని పౌలు దృఢంగా ప్రకటిస్తున్నాడు. వీటిని అయోగ్యంగా స్వీకరించవద్దు అని కూడా హెచ్చరిస్తున్నాడు. 1 కొరింతీ 11:33-34లో ఈ విధంగా సెలవిస్తున్నాడు: "సోదరులారా! ప్రభు భోజనమున పాల్గొనుటకు సమావేశమైనప్పుడు ఒకరికొకరు వేచి ఉండండి. ఒకవేళ ఎవడైనను ఆకలిగొని ఉన్నచో, మీ సమావేశమున మీరు దేవుని తీర్పునకు గురి కాకుండా ఇంటి వద్దనే అతనిని తిననివ్వండి". పౌలు ఈ దివ్య సత్ప్రసాదమును భౌతికమైన ఆహారముగా పరిగణింప లేదు. ఇంకను ఈ దివ్యసత్ప్రసాదం సఖ్యతకు ఐక్యతకు లేదా సంఘజీవనానికి సూచనగా ఉంది. ఈ దివ్యసత్ప్రసాదం క్రైస్తవ్యానికి పునాది లాంటిది అని పౌలు తన పత్రికలలో ప్రకటిస్తున్నాడు. క్రైస్తవులమైన మనము పెక్కుమందిగా ఉన్నను ఒకే రొట్టెలో పాలుపంచుకుంటున్నాము, కాబట్టి మనమందరము క్రీస్తులో ఒకే శరీరము. అనగా మనమందరము ఒకటే. ప్రభు రాత్రి భోజనం ఐక్యతకు సూచికగా నిలుస్తుంది. ఇంత గొప్పని దివ్య సంస్కారపు ప్రభావమును ప్రొటెస్టెంట్ సహోదరులు తక్కువ చేసి మాట్లాడు సాహసం చేస్తున్నారు.

### 3.5. దివ్యసత్ప్రసాదం - ప్రొటెస్టెంట్ సంస్కరణలు

దివ్యసత్ప్రసాదం క్రైస్తవ విశ్వాస కేంద్రం. క్రైస్తవ విశ్వాస పరమ రహస్యం. ఈ దివ్యసత్ప్రసాదం నుండి ఇతర క్రైస్తవ పరమ రహస్యాలు ఉద్భవిస్తాయి. ఆ దేవాది దేవుడు శ్రీసభకు అందించిన శ్రేష్టమైన ఫలం దివ్యసత్ప్రసాదం. దీని నుండి మాత్రమే శ్రీసభ తన జీవితాన్ని పొందుతుంది. ఇది శాశ్వతమైన తరగని బహుమానం. ఇది ప్రపంచంలోని సకల జనులను దేవునితో ఐక్యపరుస్తుంది. పునీత రెండవ జాన్ పాల్ తాను రాసిన "Ecclesia de Eucharistia" అను విశ్వలేఖలో దివ్యసత్ప్రసాదం క్రైస్తవ జీవితానికి ఒక శిఖరం వంటిది అని అంటాడు. చరిత్రలో చూసినట్లయితే దివ్యసత్ప్రసాదం మీద అనేక వివాదాలు

తలెత్తాయి. శ్రీసభ అధికారులు ట్రెంటు మహాసభ ద్వారా ఈ దివ్య సంస్కారం మీద ఉన్నటు వంటి అనుమానాలను, అపనమ్మకాలను తొలగించి, దానికి సక్రమమైన సత్యమైన మార్గాన్ని ఏర్పాటు చేసింది. దివ్యసత్ప్రసాదం గురించి చెలరేగిన కొన్ని వేదాంత వివాదాలను పరిశీలిద్దాం.

### 3.5.1. దివ్యసత్ప్రసాదం – మత సంస్కరణలు

ప్రాచీన మరియు మధ్యయుగాలలో నామమాత్రవాదం మరియు దాని నుండి వెలువడిన ఇతర వేదాంత ప్రవాహాలు, దివ్యసత్రసాదం మీద మనకు ఒక విశ్వాస పునాదిని బలంగా నిర్మించాయి. ఇవి దివ్యసత్ప్రసాదం మీద ఉండే వాస్తవికతను అర్థం చేసుకోవడంలో సహకరిస్తాయి. మరీ ముఖ్యంగా క్రీస్తు ప్రభువు దివ్యసత్ప్రసాదములో కొలువై ఉన్నాడని ఇవి నిరూపిస్తాయి.

### 3.5.1.1. దివ్యసత్ప్రసాదములో క్రీస్తు ఉనికి

నిర్ణీత వ్యక్తీకరణ యొక్క దుర్వినియోగం మరియు దివ్యసత్ప్రసాదము అసభ్య భౌతిక వాస్తవికత యొక్క ప్రతిరూపానికి, నాలుగవ లాతరను మహాసభ ప్రతిస్పందించింది. “రూపాంతరం చెందేవి పవిత్ర వస్తువులైన రొట్టె మరియు రసము. ఆశీర్వదింపబడిన రొట్టె మరియు ద్రాక్ష రసము క్రీస్తు శరీరముగా రక్తముగా మారుతున్నాయి”. కానీ జ్వింగ్లీ, లూథర్ మరియు కాల్విన్, వీరు గణనీయమైన వేదాంత సిద్ధాంతాలు కలిగి ఉన్నప్పటికీ, దివ్యసత్ప్రసాదములో క్రీస్తు ప్రభువు నిజముగా ఉన్నాడు అను వేద సత్యాన్ని వారు నిరాకరిస్తున్నారు.

జ్వింగ్లీ ఇలా అంటాడు: క్రీస్తు ప్రభువు మరణించాడు, ఉత్తనమయ్యాడు, పరలోకానికి వెళ్ళాడు. పరలోకానికి వెళ్లిన తర్వాత అతని శరీరం స్వర్గంలో ఉంటుంది. అందువలన భూమిపై ఉన్న రొట్టెలో ఆయన నిజంగా ఉండడు. ఈ పవిత్ర రొట్టెగా పిలువబడేది వాస్తవంగా యేసు శరీరం కాదని, అది ఒక చిహ్నం మాత్రమే అని అతడు పేర్కొన్నాడు. ప్రతి దివ్యబలిపూజలు గురువు ఉపయోగించే పదాలు, ఇది నా శరీరము, ఇది నా రక్తము కేవలము ఈ పదాలను ఒక అలంకార అర్థంలో మాత్రమే తీసుకోవాలి.

లూథర్ ఇలా అంటాడు: దివ్యసత్రసాదనలో క్రీస్తు నిజమైన ఉనికిని రెండు స్వభావాల దృక్కోణంలో చూడాలి. సమర్పణ తరువాత రొట్టె మరియు ద్రాక్షరసం

వాటి స్వంత లక్షణాలను కలిగి ఉంటాయి. అయితే అవి ప్రభు యొక్క శరీరము మరియు రక్తంగా ఐక్యమై, ఒక నిజమైన మత కర్మగా ఉంటాయి. అంతేకానీ దివ్యబలిపూజలో అవి నిజమైన క్రీస్తు శరీర రక్తాలుగా రూపాంతరం చెందడం లేదు.

కాల్విన్ ఇలా అంటాడు: దివ్యబలిపూజలు రొట్టెరసములు నిజమైన రూపాంతరాన్ని సంతరించుకోవు. అవి భౌతికంగా కనిపించే రొట్టె మరియు రసము మాత్రమే. రూపాంతరాన్ని మాత్రమే కాకుండా అతడు వాటి భౌతిక ఉనికిని కూడా తిరస్కరించాడు. ఇతడు ఈ విషయములో లూథర్‌కు భిన్నంగా ఉన్నాడు. దాని గురించి ఎటువంటి సూచన చేయనప్పటికీ కాల్విన్ కోసం సమ్మతి సిద్ధాంతాన్ని అంగీకరించాడు. దివ్యసత్ప్రసాదములో క్రీస్తు యొక్క వర్తమానాన్ని పవిత్రాత్మ తీసుకురాలేదని కాల్విన్ పేర్కొన్నాడు. ఇది విశ్వాసులను పరలోక పరలోకపు క్రీస్తుతో ఏకం చేస్తుందని, ఇది కేవలము ఆత్మ విశ్వాసులను చేరువ చేసే ప్రత్యక్ష సాక్షాత్కారమే అని చెప్పాడు. ఇది మత కర్మలు క్రీస్తు ఉనికిని ఒక సంగ్రహంగా మార్చింది.

### 3.5.1.2. దివ్యసత్ప్రసాదం – వస్తుతత్వ రూపాంతర పరిణామం

దివ్యసత్ప్రసాద ప్రతివాదులు ఒకవైపు దివ్యసత్ప్రసాదములో క్రీస్తు నిజమైన ఉనికిని అతని రూపాంతరమును తిరస్కరిస్తూ ఉంటే, మరోవైపు కతోలిక శ్రీసభ దానిని ప్రతిఘటిస్తూ తన సిద్ధాంతమును బలంగా ప్రకటిస్తుంది. దివ్యసత్ప్రసాదములో ఉన్న గొప్ప ప్రత్యేక మార్పు, సాధారణ పదార్ధములైన రొట్టె ద్రాక్ష రసములు భిన్నమైన రీతిలో వస్తు తత్వ రూపాంతర పరిణామం ద్వారా క్రీస్తు శరీర రక్తములుగా మార్పు చెందుతాయి. జస్టిన్ మార్టిన్ దివ్యసత్ప్రసాదములోని మార్పును గురించి ఉన్నతంగా చర్చిస్తూ ఇలా అంటాడు: మనకు బోధింపబడిన రీతిలో దేవుని వాక్కు అయిన క్రీస్తు శరీర రూపం దాల్చాడు. మన రక్షణ కోసం శరీర రక్తాలను ఏ విధంగా తనలో నింపుకున్నాడో అదేవిధంగా ఈ రొట్టె ద్రాక్ష రస భోజనం ప్రార్థన ద్వారా దివ్యసత్ప్రసాదంగా ప్రతిష్టించి దానిని తన శరీర రక్తాలుగా మార్చి, మన శరీరమును రక్తమును పోషించు విధంగా మనకు అందిస్తున్నాడు. దివ్యసత్ప్రసాద భోజనములో పాల్గొనడం ద్వారా పాపాత్ముడు – పుణ్యాత్ముడు గాను, దేవుని ఎరుగని వారు

దేవుని స్నేహితులగను రూపాంతరం చెందుతారు.

పునీత అగుస్తీను దివ్యసత్ప్రసాదములో దాగివున్న రూపాంతర శక్తిని గూర్చి సిలువపై బలిగా అర్పింపబడిన క్రీస్తు శరీరమును భుజించి ఆయన రక్తమును పానము చేయడం ద్వారా మనము వెలుగుతో నింపబడుతున్నాము. అంతకంటే ఎక్కువగా, ఆయన తన శరీర రక్తం ద్వారా మనకు రక్షణను ప్రసాదించాలని ఆశపడ్డాడు. ఒడో కాసెల్ (odocasel) గారి ప్రకారము, దివ్య సత్ప్రసాదం ఒక దివ్య సంస్కారం. ఇది దేవుడు మానవుని వద్దకు దిగి వచ్చుటకు, మానవుడు దివ్యమైన అంతస్తుకు చేరుటకు దోహదపడు ఒక ప్రక్రియ. క్రీస్తు బలిలో ఏ విధంగా అయితే తన శరీర రక్తాలను ఫణంగా పెడుతున్నాడో, ఈ బలిలో పాల్గొను తన విశ్వాసులందరూ కూడా పరస్పరము ఒకరి ఎడల మరొకరు అదే బాధ్యతను కలిగి ఉండాలని క్రీస్తు కోరుకుంటున్నాడు. దివ్యసత్ప్రసాదమును స్వీకరించిన ప్రతి క్రైస్తవుడు ఇతరులు ఆనందంగా జీవించడానికి మరియు నిత్యజీవం పొందుటకు తోడ్పడుతూ ఉంటారు అని చెప్పడంలో ఎటువంటి సందేహం లేదు. పునీత సీయోన్నపురి కత్తరీనమ్మ గారు ఇలా అంటారు: దివ్యసత్ప్రసాదం విశ్వాసుల దైనందిన జీవితానికి జీవాహారం. కనుక ఈ విందులో పాల్గొని వారందరూ ఆత్మాహారమును సమృద్ధిగా పొందుతారు. నిత్యజీవాన్ని పొంది రక్షింపబడతారు.

## 3.6. సిలువ పీఠబలి – బలిపీఠబలి: వ్యత్యాసాలు సారూప్యతలు

బలి అర్పించే విధానం భిన్నంగా ఉంటుంది. క్రీస్తు సిలువపై తన రక్తమును చిందించాడు మరియు చంపబడ్డాడు. సిలువపై క్రీస్తు యోగ్యతను పొందాడు. అయితే బలిపీఠం మీద జరిగే దివ్యపూజలో అతడు సిలువపై తన మరణం ద్వారా సాధించిన యోగ్యతను, సంతృప్తిని మనకు వర్తింపజేస్తున్నాడు.

**మొదటిది.** క్రీస్తు కలువరి గిరిపై ఒకే ఒకసారి మరణించాడు. దహనం చేయబడ్డాడు. అయితే ఇప్పుడు అతడు మహిమలో ఉన్నాడు, ఇక ఎన్నటికీ మరణింపడు. మరి అటువంటి సమయములో ఆయన ఆయా బలిపీఠాలపై నిరంతరము బలిని అర్పిస్తున్నాడని ఏ విధంగా చెప్పగలం?

ఎందుకంటే, దివ్యబలి పూజలో కలువరి బాధితుడైన క్రీస్తును ప్రతి గురువు నూతనంగా అందిస్తున్నాడు. మాస్ (Mass) అనునది ఒక ప్రత్యేకమైన బలి

త్యాగం. ఇది ఒక మత కర్మ త్యాగం. ముఖ్యంగా ఇది సిలువకు సంబంధించినది. సిలువపైనే క్రీస్తు మోక్షానికి అర్హుడయ్యాడు. ఇప్పుడు అతడు మహిమ పరచబడి ఉన్నాడు. అయితే ఆయన తన్ను తాను స్వీయ సమర్పణ చేసుకున్న బలి వస్తువుగా అంగీకరింపబడి ఉన్నాడు. అతడు సిలువపై తండ్రి దేవునికి యోగ్యమైన బలిగా తనను తాను అర్పించుకోవడం ద్వారా ఆ సిలువఫలములను మనము స్వీకరింపగలుగుతున్నాము.

**రెండవది:** క్రీస్తు అర్పించిన బలి దయ మరియు మోక్షానికి మూలము. క్రీస్తు సిలువపై సమర్పించిన బలి యొక్క శక్తిని, యోగ్యతను, నేడు గురువు అర్పించు దివ్య బలికి అన్వయిస్తున్నాయి. దివ్యబలి, సిలువపై ప్రభు అర్పించిన బలి సంపదను అందుబాటులో ఉంచుతుంది. ఇది కలువరి పరిస్థితులను ప్రజలకు సమీపమున ఉంచుతుంది. తద్వారా మానవులందరూ దానితో ఐక్యం కాగలరు, మరియు దాని నుండి వచ్చు అనంతమైన సంపదను పొందగలరు.

**మూడవది:** కల్వరి మీద జరిగిన బలిలో క్రీస్తు మన కొరకు తనను తాను సమర్పించుకున్నాడు. అయితే దివ్యబలిపూజలు అతడు మన ద్వారా తనను తాను అర్పించుకుంటున్నాడు. అప్పద్రాక్ష రసములను తన శరీర రక్తాలుగా మార్చి అమూల్యమైన బహుమతిగా మనకు ప్రసాదించాడు. ఆ శ్రేష్టమైన బహుమానాలను దివ్యబలిపూజలు మన చేతుల ద్వారా పరలోక తండ్రికి సమర్పిస్తున్నాము. హెబ్రీయుల పత్రిక 9:24లో, ఈ చర్యలో క్రీస్తు ప్రభువు మన తరపున దేవుని ఎదుట ప్రత్యక్షమవుతాడు అని చూడగలము. ఇలా దివ్యబలిపూజలో క్రీస్తు సిలువ త్యాగబలిని కొని ఆడుకుంటూ, దాని సంపదను మనము పొందుతాము. శ్రీసభ తన శిరస్సు అయిన క్రీస్తు ద్వారా తనను తాను అర్పించుకుంటుంది.

అదే శ్రీసభ సంపద. అదే దివ్యబలిపూజ. ఆ దివ్యసత్ప్రసాదమే శ్రీసభ ఆస్తి.

### 3.7. దివ్యబలిపూజలో అర్పించు దివ్యసత్ప్రసాదం రక్షణకు మార్గము

పునీత యోహాను ఈ దివ్యసత్ప్రసాద ప్రస్తావన గురించి ఈ విధంగా అంటాడు: మీరు మనుష్యకుమారుని శరీరమును భుజించి, ఆయన రక్తమును తాగిననే తప్ప మీలో జీవము ఉండదని మీతో నిశ్చయముగా చెప్పుచున్నాను.

నా శరీరంలో భుజించి నా రక్తమును పానము చేయువాడు నిత్యజీవం పొందును. నేను అతనిని అంతిమ దినమున లేపుదును (6:53-54). ఇది రక్షణ ప్రణాళిక. యేసు యొక్క భూసంబంధమైన జీవితంలో శరీరం అతన్ని ఆధ్యాత్మికంగా సంతృప్తి పరచలేదు. జీవాన్ని ఇవ్వలేదు. ఎందుకనగా, జీవమును ఇచ్చునది ఆత్మయే. శరీరము నిష్ప్రయోజనము (యోహాను 6:63). మహిమ పరచబడిన క్రీస్తు శరీరం మాత్రమే ఆత్మ ద్వారా జీవింపబడిన దైవీక జీవితాన్ని పంచగలదు. ఆ దైవీక జీవితం దేవుని ద్వారా లభిస్తుంది. ఇది విశ్వాసం ద్వారా మాత్రమే మానవునికి అందుబాటులో ఉంటుంది. "నన్ను విశ్వసించువాడు నిత్యజీవం పొందును అని ప్రభువే స్వయంగా ప్రకటిస్తున్నాడు" (యోహాను 6:47). కనుక మనము విశ్వాసముతో క్రీస్తు శరీరమును భుజించి ఆయన రక్తమును త్రాగిన యెడల నిత్యజీవమును పొంది రక్షణ భాగ్యానికి పాత్రులమగుతాము.

కేవలము మానవుని, పాపపు స్థితిలో ఉన్న మానవుని రక్షించడం కోసం తండ్రి దేవుడు తన కుమారుడిని అంకితం మార్చాడు. ఇది కేవలము దేవునికి మానవాళి పట్ల ఉన్న ప్రేమ. చెడు నుండి మరణము నుండి దేవుడు మనకు విమోచనను కలిగించాడు. దివ్యసత్ప్రసాదమును స్థాపించు సమయములో ఏసు తన రక్తమును ఒక నూతన మరియు శాశ్వతమైన నిబంధనగా ఏర్పరచాడు (మత్తయి 26:28; మార్కు 14:24; లూకా 22:20). లోకాంతం వరకు సర్వదా నేను మీతో ఉంటాను అను వాగ్ధానమును శ్రీసభ దివ్యసత్ప్రసాదం ద్వారా అనుభవిస్తుంది.

క్రీస్తు ప్రభువు యొక్క రక్షణ ఉనికిని, దాని ఆధ్యాత్మికమైన ఆహారమును, దివ్యసత్ప్రసాదం విశ్వాసుల సంఘములో ఉంచుతుంది. శ్రీసభకు ఉన్న అత్యంత విలువైన ఆస్తి ఈ దివ్యసత్ప్రసాదం. మహాసభలు, పలు రకముల అధికారిక కర్తవ్యాలు ఈ దివ్యసత్ప్రసాద ఉనికిని ప్రకటిస్తున్నాయి. ఈ దివ్యసత్ప్రసాదం శ్రీసభ నిరంతర జీవన విధానానికి, పునరుద్ధరణకు మరియు పెరుగుదలకు ఎంతగానో తోడ్పడుతుంది.

## ముగింపు

"ఇది నా శరీరము... ఇది నూతన, నిత్య నిబంధన యొక్క నా రక్తపు పాత్రము... దీనిని నా జ్ఞాపకార్థం చేయండి" అని యేసు దివ్యసత్ప్రసాద బలిని, కడరా భోజన సమయంలో ప్రారంభించాడు. ఆ విధంగా ఇది

కృతజ్ఞతార్చన బలి అవుతుంది. ఎందుకన ఇది సిలువ బలిని తిరిగి మన కనుల ఎదుట ప్రత్యక్ష పరుస్తుంది. సిలువబలి యొక్క జ్ఞాపకార్థమే దివ్యబలిపూజ. ఈ దివ్యబలిపూజ సిలువ ఫలాలను మనకు అందిస్తుంది (కతోలిక శ్రీసభ సత్యోపదేశం, 1366). శాశ్వత రక్షణను సంపూర్ణం కాదించడానికి ప్రభువు అలా చేశాడు. ఆయన యాజకత్వం తన మరణముతో అంతం కావడం లేదు, ఇంకా అది కొనసాగుతూనే ఉంది, లోకాంతము వరకు కొనసాగుతూ ఉంటుంది. ఈ దివ్యబలి ద్వారా శక్తి వెలబడుతుంది. క్రీస్తు చిందించిన రక్తం పాప క్షమాపణ కొరకే.

మొదటి అధ్యాయంలో సాధారణ బలుల గురించి మనము అధ్యయనం చేసి ఉన్నాము. రక్తసిక్త బలి, రక్తరహిత బలి వ్యత్యాసమును గ్రహించి ఉన్నాము. ఈ బలులు క్రైస్తవ శకానికి ముందు ఉన్నాయి. మానవాళి దేవునికి, ఆయన ఆజ్ఞలకు వ్యతిరేకంగా పాపం చేశారు. దేవుడు ప్రజలను బలులు సమర్పించమని ఆజ్ఞాపించాడు. ఈ బలులను ప్రజలు వారి జీవితములలో చాలా ముఖ్యమైనవిగా పరిగణించారు. కాబట్టి పాత నిబంధన యొక్క బలులు ప్రజలతో దేవుని ఒడంబడికను సూచిస్తున్నాయి. ఈ బలులు దేవునికి మానవునికి మధ్య ఉన్న సంబంధమును. ఈ బలులు అన్నీ కూడా యేసు క్రీస్తు సిలువపై అర్పించిన బలికి ప్రతీకగా నిలుస్తున్నాయి.

రెండవ అధ్యాయంలో, దేవుని కుమారుడైన యేసు క్రీస్తు బలి గురించి తెలుసుకున్నాము. మానవుని పాపములను తుడిచి వేయడానికి పరిపూర్ణ మానవుడు దేవునికి బలిని సమర్పించవలసి ఉంటుంది. క్రీస్తు ప్రజల ప్రయోజనం కోసం తన ప్రాణమును కోల్పోయాడు. దైవసంకల్పమును నెరవేర్చడానికి తన స్వీయ అనుమతితో భూలోకానికి వచ్చాడు. ప్రజలందరికి నిత్యజీవమును అనుగ్రహించడానికి తనను తాను అర్పించుకున్నాడు. ఒకే ఒకసారి మన కోసం తన రక్తమును చిందించాడు.

మూడవ అధ్యాయంలో, యేసు సిలువపై అర్పించిన బలి, నేడు దివ్యబలిపూజా ద్వారా బలిపీఠంపై కొనసాగుతుందని గ్రహించాము. తన మరణము ఉత్థానమును సకల జాతి జనులకు ప్రకటిస్తూ వాటిని ఒక జ్ఞాపకార్థముగా కొనియాడమని యేసు తన శిష్యులను ఆహ్వానించాడు. అందుకే

శ్రీసభ ఈ పనిని బహు విశ్వసనీయతతో కొనసాగిస్తుంది. ఎంతమంది ఈ దివ్యసత్ప్రసాద ఉనికిని నిరాకరించినా, ఎన్ని ప్రతి వాదనలు ఎదురైనా, శ్రీసభ మాత్రం తన సిద్ధాంతాలను సత్యవంతంగా లోకానికి ప్రకటిస్తుంది.

ప్రతి గురువు బలిపీఠముపై దివ్యబలిపూజలు సమర్పించినప్పుడు, యేసు మరలా మరలా సిలువ వేయబడుతున్నాడని మనము చెప్పడం లేదు. అయితే ఆ సిలువ త్యాగం, ఆ క్రీస్తు బలి, ప్రతిదినము దివ్యబలిపూజ ద్వారా మరల మనకు ప్రదర్శింపబడుతుంది, పొడిగించబడుతుంది, కొనసాగించబడుతుంది. కతోలిక శ్రీసభ సత్యోపదేశం 1367 ఈ దివ్యసత్ప్రసాదం గురించి ఈ విధంగా సెలవిస్తుంది: క్రీస్తు సిలువ బలి, కృతజ్ఞతార్చన బలి రెండు ఒకటే. బలి అయిన వ్యక్తి ఒక్కరే. ఆనాడు సిలువ మీద తను తను అర్పించుకున్న వ్యక్తి, నేడు యాజక పరిచర్య ద్వారా బలిపీఠంపై తనను తాను అర్పించుకుంటున్నాడు. అర్పించు విధానములో మాత్రమే వ్యత్యాసం ఉంది. ఒకటి రక్తసిక్త బలి. మరొకటి రక్తరహిత బలి. అయితే క్రీస్తు బలి ఒకటే.

దీనినిబట్టి అప్పద్రాక్ష రసములలో క్రీస్తు నిజముగా వాస్తమై ఉన్నాడని, దివ్యబలిపూజలో ప్రతిష్ట ప్రార్ధన ద్వారా వస్తుతత్వ రూపాంతర పరిణామం సంభవిస్తుందని మనము చెప్పగలము. ఆశీర్వదింపబడిన రొట్టె ఉన్నంతకాలం క్రీస్తు సాన్నిధ్యం ఉంటుంది. ప్రతిష్టింపబడిన ప్రతి రొట్టెలో, ద్రాక్ష రసములో, క్రీస్తు సంపూర్ణంగా సమగ్రంగా ఉంటాడు (కతోలిక శ్రీసభ సత్యోపదేశం, 1377). క్రీస్తు శరీర రక్తాల రూపాంతరం మన సాధారణ ఇంద్రియాల ద్వారా గ్రహించు సత్యము కాదు. దానికి దైవిక అనుగ్రహ విశ్వాసం అవసరమై ఉంది. విశ్వాసముతో దివ్యబలిపూజలో పాల్గొందాం. దివ్యసత్ప్రసాదమును క్రీస్తు శరీర రక్తములుగా భక్తితో భుజిద్దాం. రక్షణ అనుగ్రహమునకు పాత్రులమవుదాం.





# దివ్యసత్ప్రసాద ఆరాధన




**భక్త యోహాను ప్రచురణలు**

భక్త యోహాను ప్రాంతీయ గురువిద్యాలయం

రామంతపురం, హైదరాబాదు - 500 013. ఫోన్ : 91-040-29561761, 29561762

e-mail: stjohnshyd2@gmail.com | www.stjohnseminaryhyd.org

Printed at : Jeevan Institute of Printing